TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204064
UNIVERSAL LIBRARY

# సుభాస్ బోస్
# అంతర్ధాన గాథ
(బోస్ జియాఉద్దీనుగా నున్నప్పుడు)

రచన: ఉత్తమచంద్

ఆంధ్రానువాదం :
'ఆంధ్ర ప్రభ'

సంస్కృతి ప్రచురణ
వెల రూ 1—8—0

సంస్కృతి ప్రచురణ—21
వెల రూపాయిన్నర

ప్రథమ ముద్రణ
1946

ప్రకాశకులు:
కల్చరల్ బుక్స్ లిమిటెడ్
పెరంబూరు పోస్టు : : మద్రాసు

[అన్ని హక్కులు ప్రకాశకులవే]

Printed at the B. N. K. Press, Madras
Q. H. No. Ms. 100/B.
For Q. H. No. M. S. 19—3000—7/46.

నాభార్య రమోదేవికి—

ఆమె సహాయం, సహకారం లేకున్న
బోస్ బాబుకు, భారతమాతకు నేనీ కొద్దిపాటి
సేవ చేయడమైనా అసాధ్యమయ్యేది.

ఈ పుస్తకం వెలలో ప్రకాశకులు నాకు 30% పారితోషిక మిచ్చియున్నారు. ప్రథమ ముద్రణ పారితోషికంలో 2½% అజాద్ హింద్‌ఫౌజ్ సహాయ నిధికి, నా స్వస్థానమైన వాయవ్య సరిహద్దు రాష్ట్రంలో తన యిచ్చవచ్చిన సద్వినియోగం చేయడానికి ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖానుగారి చేతికి 10% యిస్తున్నాను. తర్వాతవచ్చు ముద్రణల పారితోషికంలో 2½% అజాద్ హింద్ ఫౌజ్ సహాయనిధికి. 5% ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్‌గారి చేతికి యివ్వనున్నాను.

ఉత్తమ చంద్.

# తొలి పలుకు

నేతాజీ సుభాస్‌చంద్రబోసు భారతదేశంనుంచి బెర్లినుకు పారిపోవడము కాబూలుమీదుగానే. నేను ఆయనకు కాబూలులో ఆశ్రయమిచ్చాను. ఆయన నా అతిథిగానుండడము నా భాగ్యము.

ఈ పుస్తకము సుభాస్‌చంద్రబోసు గుణగణాలను వర్ణించుటకు వ్రాయబడలేదు. ఇండియా నుండి బెర్లినుకు, కాబూలుమార్గాన ఆయన అతిధైర్యసాహసాలతో తప్పించుకు బోవడాన్ని మాత్రమే ఈ పుస్తకము వర్ణిస్తుంది. బోసుబాబు కాబూలులో నున్నప్పుడు జరిగిన సంఘటనలను, నాకు జ్ఞాపకమున్నంతవరకు, ఇందులో పొందుపరిచాను. నా జ్ఞాపకశక్తిపైన ఆధారపడగలిగినంతవరకు నాకు — బోసుబాబుకు జరిగిన సంభాషణలలో ఆయన మాటలనే యుపయోగింప ప్రయత్నించాను. తారీకులుగూడా నా జ్ఞాపకాన్నిబట్టి యుదహరింప బ్రయత్నించాను. ఇందులో కొన్ని పొరపాట్లు, తప్పులు ఉండవచ్చు. ఈ పుస్తకములోని సంఘటనలు నాలుగేండ్లక్రితము జరిగినందువలన చాలపొరబాట్లు (ఈ పుస్తకములో) ఉండకతప్పవు. పాఠకులందుకు నన్ను మన్నింతురుగాక.

1945 సంవత్సరములో నన్ను రావల్పిండి జైలుకు బదలాయించారు. ఆ జైలులోనే ప్రప్రథమముగా నా జ్ఞాపకములో నున్న ఈ విషయాలను నా మాతృభాషయగు ఉర్దులో వ్రాసాను. రావల్పిండి జైలులో నన్నొకనినే వేరుగా నొకగదిలో బంధించారు. ఆ ఒంటరితనాన్ని సహింపలేకపోయినాను. ఆ కష్టాన్ని మరచిపోనే సుభాస్‌బోసు అంతర్ధాన గాథను జ్ఞప్తికితెచ్చుకొన మొదలుపెట్టాను. ఈ ప్రయత్నమువల్ల రెండు సఫలములు కలిగినవి. ఖయిదులో ఒంటరిగా నున్నందున కలిగిన నా మనోకష్టాన్ని మఱచిపోగలిగాను. ఇండియానుంచి అక్షరాజ్యాల కేంద్రమయిన బెర్లిన్‌కు బోస్‌బాబు పరుగెత్తిపోవడములో కలిగిన సంఘటనలను సక్రమపద్ధతిని వ్రాసియుంచగలిగాను.

నేను ఏ జైలుకు పంపబడినా అచ్చట నాతో నున్న తోటి ఖైదీలు బోసుబాబు ఎలా ఇండియానుంచి తప్పించుకొన్నాడని తెలుసుకోవాలని ఆతురతపడేవారు. నేనీ పుస్తకము వ్రాయటానికి కారణము వారి ఆత్రాతురతే. మూడేండ్లపాటు విచారణలేకుండ నన్ను ఖైదులో ఉంచారు. ఈ మూడేండ్లలో అనేకమంది రాజకీయఖయిదీలను కలుసుకొనే అపూర్వఅవకాశము నాకు కలిగింది. మొదట నాపట్ల ఈరాజకీయ ఖయిదీల ప్రవర్తన సందేహాస్పదంగా నుండేది. వారు నన్ను అత్యంత అపాయకరమైన ఖయిదీగా భావించేవారని వారి నడవడియే స్పష్టపరిచేది. ఇందులో వారి తప్పేమీ లేదు. ప్రతిరాజకీయ ఖయిదీ దృష్టిలోను కేంద్రప్రభుత్వ డిటెన్యూ భయంకరంగానే కనపడుతాడు. అందులోను నా విషయము మరీ వింతైనది. నేను కేంద్రప్రభుత్వ ఖయిదీని. నన్ను పంజాబుకు మార్చకముందే లాహోరుకోటలో ఖయిదీగా సంపూర్ణానుభవాన్ని పొందియున్నాను. నా అరెస్టును గురించి, నా నిర్బంధాన్ని గురించి రాజకీయ ఖయిదీల అనుమానాలు వారికనేకయూహాలు కలిగించేవి. కొన్నాళ్లలో నే నరెస్టుచేయబడిన పరిస్థితులు వారికర్థమైనపుడు వారి ఆ అనుమానాలన్నీ పోయి నాపై వారికి జాలి కలిగింది. నాపై ఎంతో అనురాగము, ప్రేమ చూపేవారు. రాజకీయ ఖయిదీలు నా యెడ చూపిన ప్రేమ వాత్సల్యాలకు తగిన కృతజ్ఞత తెల్పజాలకున్నాను. సుభాస్ బోస్ అంతర్ధానగాథను వివరింపమని మరిమరి కోరేవారు. కాని, ప్రతివ్యక్తి ఈ సంఘటనలను వర్ణించడము దుస్సాధ్యమైన పని. ఎవరైనా ఈ గాథను వర్ణించమని మొండిపట్టుపడితే తప్పించుకోలేక, నా మనస్థితము కొలది, వారికీకథనంతను చెప్తుండేవాణ్ణి. స్వయంగా నాకీకథ చెప్పడ మిష్టములేదు. సుభాస్‌చంద్రబోసు అంతర్ధానగాథను ఆవిష్కరించడానికి తగినసమయ మింకా ఆసన్నము కాలేదు. జైళ్లలో నాచుట్టు కొందరు అనుమానాస్పదమైనవ్యక్తులు మూగుతారని, ఎవరితో గాని నిష్కపటంగా మాట్లాడడము తప్పని, (తత్ఫలితాలు అతి అపాయకరంగా నుంటవని) మిత్రులు నన్ను ముందుగానే హెచ్చరించారు. అందువల్ల సుభాస్‌బోస్ పలాయనగాథను జనబాహుళ్యానికి పుస్తకరూపముగా అందిచ్చేటందుకు ఓపికపట్టి యుండదలచుకున్నాను.

బోసుబాబు బెర్లినుకు కాబూలుమార్గంనుంచి తప్పించుకు పోయాడని విన్నవారంతా ఆశ్చర్యపోయారు. ఇండియన్ పోలీసుల కండ్లుమూసి, సర్వవ్యాప్తమైన బ్రిటిషు నిరంకుశాధికార ఉక్కుచేతులనుండి తప్పించుకొని, సర్వకాల సర్వావస్థలయందు కాపలా కాయబడుచున్న ఇండియా పొలిమేరలనుండి బోసుబాబు బయట పడడము అత్యంత సాహస కార్యము-ఇది ఒక విచిత్రమే! ఇదంతా ఎలా జరిగింది? ఇండియా పొలిమేర ప్రాంతాలలో (ట్రైబల్ ఏరియా) బోస్ బాబు ఎట్టికష్టాలను, అగచాట్లను అనుభవించారో? ఏ ఏ అడ్డదారులను నడిచారో? ఎట్టి దుష్కరపరిస్థితులను అనుభవింపవలసి వచ్చిందో? ఇండియా నుండి బయటికిపోవడానికి ప్రభుత్వము వారి పాస్‌పోర్టు లేదే! బోసుబాబు బెర్లిను ఎలా జేరుకున్నారు?........అన్నిటిలోకి అత్యాశ్చర్యకరమైన విషయమిదే. నిజంలో యింతకంటె ఆశ్చర్యకరమైనవిషయమేమున్నది? తన మాతృదేశ స్వాతంత్ర్యము కోసం తన సర్వస్వాన్ని త్యాగంచేసిన నాయకుని జీవితచరిత్రలో ఈ బెర్లిను పలాయనం అత్యాశ్చర్యకరమైనదే.

నమ్మలేనిపాఠకులు నేను చెప్పుచున్నదంతా నిజమా? యని యడుగవచ్చు. అందుకు నాజవాబు ఈసంఘటనలకుముందు జరిగిన నా జీవితమే. నా రాజకీయజీవితంనుంచి కొన్ని ఉదాహరణలనుజూపి, తద్వారా ఈకథ నిజమని నమ్మకం కలిగించడం సులభం.

నేను పెషావరు నివాసిని. పేరు గౌరవాలుగల యొక కుటుంబంలో పుట్టాను. దేశంలో సంపద అసమానంగా పంపబడియుండటం జూచి చిన్నప్పటినుంచి అసహ్యించికొనేవాడిని—ఆశ్చర్యపడేవాడిని. రోజంతా చెమటూడ్చి కష్టముచేసినా తమకు, తమకుటుంబాలకు చాలినంత సంపాదించుకోలేని పేదవారి నొకవైపు, తలుచుకున్నంత మాత్రాన కూర్చున్నచోటనే ఏ కష్టములేకుండ జీవితసౌఖ్యముల నన్నింటిని అనుభవింపగల ధనికులను మరొకవైపు చూస్తుండేవాణ్ణి. ఒకడు ధనికుడుగా నుండడం, మరొకడు నిరుపేదగానుండడం వాని వాని ఖర్మాన్నిబట్టి ఉంటుందని, భగవంతుడు మనకు యెంతరాసిపెడితే అంతేవస్తుందని, ఆవగింజంత ఎక్కువరాదని జనసామాన్యంలో నమ్మకమున్నది. భగవంతుడు ఇంత అన్యాయంగా ప్రవర్తిస్తాడని నేను నమ్మను.

1928 లోనో లేక 1929 లోనో అఖిలభారత కాంగ్రెస్ సంఘం వారు తమ శాఖను ఒకదానిని పెషావరులో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో నేను పాల్గొన్నాను. కాంగ్రెస్ ప్రణాళిక చదివినప్పుడు మన పేదరికానికి మూలకారణం బానిసత్వమేనని, భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందితీరాలని నేను గ్రహింపగలిగాను. కాంగ్రెస్ కరపత్రము నాలో కొంత చైతన్యాన్ని కల్గించింది. నేను కాంగ్రెసులో సావలా సభ్యుడుగా చేరాను.

కొంతకాలమైనతర్వాత పెషావరులో నవ జవాన్ భారతసభ అనే సభ ఒకటి ప్రారంభింపబడింది. ఈ సభను ప్రారంభించినవారు ఒక కరపత్రాన్ని వెలువరించారు. సంపద అసమానంగా పంపబడటానికి కారణం మన సాంఘికవ్యవస్థయే యని, మన సాంఘిక వ్యవస్థను మార్చివేసే ఈ లోటుపాట్లన్నీ సరిపడగలవని నవజవాన్ భారతసభ ప్రకటించిన కరపత్రంలో విశదీకరించారు. ఈ కరపత్రం చదివినతర్వాత ఆ సభా కార్యదర్శిని కలుసుకున్నాను. నన్ను కాంగ్రెస్‌లో సావలా సభ్యుడుగా నుంటూ నవజవాన్ భారతసభలో చేరవచ్చునన్నారు. అందుకు నేనెంతో సంతోషించాను. ఆ సభ సామ్యవాద సిద్ధాంతాలపైన నడుపబడుతుంది. తర్వాత నేనాసభలో సభ్యుడుగా చేరాను. అప్పటిలో నాకు 18 ఏండ్ల వయస్సు. దేశసేవ చేయాలన్న ఆశ నాలో అప్పుడే అంకురించింది.

1930 సంవత్సరంలో మహాత్మాగాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించినప్పుడు మా రాష్ట్రనాయకులు చాలామంది జైలులో నుంచబడ్డారు. నవజవాన్ భారత్ సభా కార్యదర్శి గారుకూడా జైలులో నుంచబడ్డారు. అంతట సభ్యులందరు నన్ను ఆసభ బాధ్యతను నిర్వహించమన్నారు. నేనాసభకు కార్యదర్శిగా పనిచేయవలసివచ్చింది. నాయకుల అరెస్టు ప్రజలలో అత్యంత ఆందోళనను కలుగజేసింది. కొద్ది కాలమయిన తర్వాత మరి యిద్దరు ముగ్గురు కాంగ్రెస్ నాయకులు అరెస్టు చేయబడ్డారు. ఈ నాయకులను పోలీసువారు పోలీసుస్టేషన్‌కు తీసుకువెళుతూంటే ప్రజలు నాయకుల వెంబడి ఊరేగింపులతో బయలుదేరారు.

అంతట పోలీసువారు ప్రజలను కాల్చటంలో అనేక దేశభక్తులు మరణించారు. ఆనాడు దేశభక్తులు కాల్చబడినచోటనే నేటివరకు ప్రతి సంవత్సరము ఆత్యాగుల జ్ఞాపకార్థము ప్రజలు ఉత్సవములు జరుపుతున్నారు.

ఈ ఉదంతానంతరము చాలామందిని అరెస్టు చేశారు. వారిలో నేనొకణ్ణి. కాంగ్రెసు, నవజవాన్ భారత్ సభ—రెండూకూడా చట్ట విరుద్ధమైన సంస్థలని ప్రకటింపబడింది. రెండు నెలలయిన తర్వాత మా విచారణ ప్రారంభమయింది. నాకు రెండేండ్లు కఠినశిక్ష విధించారు.

కాబూలులో మా వ్యాపారము 1942 సంవత్సరము వరకు సాగింది. 1941 జనవరిలో బోసుబాబు కాబూలు రావడము, బెర్లిన్ వెళ్ళే ముందు 43 రోజులు సందిగ్ధావస్థలో కాబూలులో గడపడము ఈ గ్రంథంలోని విషయాలు. బోసుబాబు బెర్లిన్ వెళ్ళిపోయి ఒక సంవత్సరమైంది. నేను కాబూలులో ఒకనాడు వార్తాపత్రిక చదువుకుంటూ కూర్చున్నాను. ఈ పుస్తకంలో బోసుబాబు సహచరుడని చెప్పబడిన వ్యక్తి కూడా ఆ సమయంలో నాయొద్దనేయున్నాడు. వార్తాపత్రికలోనుంచి ఇండియా ప్రభుత్వం ఒకవ్యక్తిని అరెస్టుచేసినట్లు చదివాను. అప్పటిలో ఈ అరెస్టుకు కారణం మేమిద్దరమే మూహించుకోలేకపోయినాము. కాని నాగతి క్షేమమయినది కాదనిమాత్రము అనుమానం కలిగింది.

1942 మే 25 వ తారీఖున అఫ్ఘనిస్థానాన్ని 48 గంటలలో వదలి వెళ్ళవలసిందని అఫ్ఘన్ ప్రభుత్వం నాకొక నోటీసు జారీచేసింది. గడచిన పదేండ్లుగా కాబూలులో వ్యాపారం చేస్తున్నాననీ, సాలీనా సుంకం కింద కొన్నివేలు అఫ్ఘన్ ప్రభుత్వానికి చెల్లిస్తున్నాననీ. 48 గంటలలో నాసరకులను అమ్ముకోటానికి గాని నాకు రావలసిన బాకీలు వసూలుచేయటానికిగాని మానవమాత్రునికి సాధ్యంకాదని అఫ్ఘన్ ప్రభుత్వానికి విన్నవించుకున్నాను. కాని నా ప్రయత్నాలన్నీ చెవిటికి శంఖూదినట్లయినవి. 48 గంటలు గడవగానే నన్నరెస్టుచేశారు. 1942 మే 27 వ తారీఖున నాచేతికి సంకెళ్లు తగిలించి అర్ధరాత్రివేళ నన్నొక లారీలో జలాలాబాద్ పంపారు. మరునాడు ప్రొద్దున జలాలాబాద్

చేరగానే నన్నొక ఇరుకైన గదిలో పెట్టి తాళము వేశారు. ఆగదిలో రెండు రోజులున్నాను. ఈ రెండు రోజులు నాకు ఆహార మేమీ ఇచ్చారు గారు. రాత్రి, పగలూ అని తెలిసికోలేనంత చీకటిగా నున్నదాగది. నన్నాగదిలోనుంచి బయటికి తీసికొచ్చినపుడు నాసమాధిలోనుంచే లేస్తున్నానా అని తోచింది. నాటినుంచి నన్ను విడుదలచేసేవరకు, పిల్లికూనలను త్రిప్పినట్లు, ఎన్నిజైళ్ళో నాకు చూపించారు.

నా విడుదలయిన తర్వాత పెషావరులోని 'హిందూస్థాన్' టైమ్స్ పత్రిక విలేఖరి నావ్రాతలను పుస్తకంగా ప్రచురించమని ప్రోత్సహించాడు. తత్ఫలితంగానే నాయీవ్యాసాలు న్యూఢిల్లీ ఆంగ్లదినపత్రిక 'హిందూస్థాన్ టైమ్సులో' ప్రచురింపబడినవి. న్యూఢిల్లీలోని ఆంగ్లపత్రిక 'హిందూస్థాన్ టైమ్స్', హిందీపత్రిక 'హిందూస్థాన్'; అలహాబాదులోని ఆంగ్లపత్రిక 'లీడర్', హిందీపత్రిక 'భారత్'; పాట్నాలోని ఆంగ్లపత్రిక 'సర్చిలైట్'—మొదట వీటిలోమాత్రమే ఈ వ్యాసాలను ప్రచురింపదలచుకున్నాను. కాని, తర్వాత అనేకమంది పత్రికాధిపతులు, తమ పత్రికలలో వేసుకొనవలెనని కోరుటచేత, 'హిందూస్థాన్ టైమ్స్' పత్రికా సంపాదకులైన దేవదాస్ గాంధిగారు నాకొకసలహా నిచ్చారు. వారి సలహా ననుసరించి ప్రతి పత్రిక కొంత మొత్తమిచ్చుకొనేటట్లు ఆ మొత్తంలో సగము ఆజాద్ హింద్ ఫౌజ్ సహాయనిధికి, మిగత సగము నాకు చెందులాగున పత్రికలన్నిటికి ఈ వ్యాసముల ప్రచురించుట కనుమతివ్వబడినది.

మొదట పత్రికలలోను, తరువాత పుస్తకరూపంగాను ఈ విషయాన్ని ప్రచురించటానికి నాకు సాయపడిన 'హిందూస్థాన్ టైమ్స్' సంపాదకులయిన దేవదాస్ గాంధిగారి కెంతయు కృతజ్ఞుణ్ణి. ఈ పుస్తకముయొక్క వ్రాతప్రతిని తయారుచేయడంలో నాకు సాయపడిన 'హిందూస్థాన్ టైమ్స్' 'హిందూస్థాన్' పత్రికలసహాయ సంపాదకుల కందరికి నాకృతజ్ఞతా పూర్వకవందనములు—జై హింద్.

ఉత్తమచంద్.

# 1

1941 ఫిబ్రవరినెలలో ఒకరోజు. తెల్లవారుతూవున్న సమయం. రక్తం గడ్డకట్టే దారుణమైన చలి. దూదిపింజలులాగ మంచు పడుతూవుంది. అఫ్ఘనిస్థాన్ రాజధానీ నగరం కాబూలులోని రోడ్లు, ఇంటికప్పులు, పరిసరప్రాంతాలలోని కొండలు మంచుమయంగా వున్నాయి. ఎటుచూచినా కళ్ళను జిగేలుమనిపించే తెల్లని మంచు కనిపిస్తూ వుంది. చలిగా వుండడంచేత బజారులో జనం ఎక్కువగా లేరు.

ఆ మధ్యాహ్నం నేను నీహార తుషారాన్ని పరధ్యానంగా పరికిస్తూ నా దుకాణంలో కూర్చున్నాను. అప్పుడు హిందుస్థాన్ ట్రేడ్ ఏజెన్సీనుంచి ఒక నౌకరు భారతదేశపు వార్తాపత్రికల కట్టను పట్టుకొచ్చియిచ్చాడు. వార్తాపత్రికలు కనిపిస్తే నాకు మహా హుషారు. నాకు పత్రిక చూడనిదే తోచదు. కలకత్తానుంచి సుభాస్ చంద్రబోస్ విచిత్రంగా అంతర్ధానమై పోవడంవల్ల భారతదేశం వార్తలకోసం మరీ ఆతురతపడుతున్నాను.

సుభాస్ చంద్రబోసు సాధువేషంలో హరిద్వార్‌లో పట్టుబడ్డాడని ఢిల్లీ రేడియోనుంచి ఆవేళ వుదయమే ఒకవార్త ప్రకటించబడింది, కాని, మధ్యాహ్నం బ్రాడ్‌కాస్టులో ఇందుకు విరుద్ధంగా, ఆసాధువు సుభాస్ చంద్రబోసు కాదని ప్రకటించబడింది.

నేను పత్రికలు తిరగవేస్తుండగా సర్దార్ శార్దూల్ సింగ్ కవీషర్ ఇచ్చిన ఒక ప్రకటన నా కంటపడింది. సుభాస్‌బోసు పారిపోవడానికి కొలది రోజుల క్రిందట ఆయనను శార్దూల్‌సింగు చూచివచ్చాడట. సుభాస్‌బోసు సన్యసించాలని ఆలోచిస్తున్నట్లు శార్దూలసింగ్ చెప్పాడు. "సుభాస్‌బోసు సాధువై పోయి, దక్షిణ భారతదేశంలో ఏపుణ్యక్షేత్రానికో వెళ్లిపోయి వుంటాడని అనుకుంటాను" అని సర్దార్ శార్దూల్‌సింగు కవీషర్ ప్రకటించాడు.

కాని, నా మనస్సుమాత్రం ఎందుచేతనో మరొక విధంగా పోయింది. సుభాస్‌బాబు రహస్యంగా ఏర్పాటుచేసుకొని జపానుకు పారిపోయి వుంటాడని నాకు అనిపించింది.

## కొ త్త వ్య క్తి

నేను పత్రికలు ఇంకా తిరగవేస్తూనే వున్నాను. ఎవరో కొత్తవ్యక్తి నా దుకాణంలోకి వచ్చాడు. "అస్సాలామ్ ఆలేకుమ్" అంటూ పుస్తో భాషలో అభినందించాడు. అతను పెషావర్ సాల్వార్ దుస్తులు ధరించాడు. కాకీచొక్కా తొడిగాడు. తోలు వెయిస్టు కోటు తొడిగాడు. పఠాను మాదిరిగా తలపాగా చుట్టాడు. పెషావరు జోళ్లు తొడిగాడు. అది సరిహద్దు ప్రాంతంలోని కొండజాతివారి వేషం.

"నావల్ల మీకు కావలసిన పనేమిటి ?" అని అడిగాను.

"ఉత్తమ్ చంద్ అంటే మీరేనా?" అని ఆవ్యక్తి తిరిగి, వెముదుతూ, ప్రశ్నించాడు.

నేను ఆశ్చర్యచకితుడనయినాను. "అవును. అదే నా పేరు" అన్నాను.

నా సమాధానానికి ఆ వ్యక్తి పెదవులపై చిరునవ్వు బయలుదేరింది.

నాతో మీకు పనేమిటని మళ్ళీ అడిగాను. ఆ వ్యక్తి నా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు. మా సంభాషణను ఆలకిస్తున్నవారు ఆ చుట్టుప్రక్కల ఎవరయినా వున్నారేమోనని యిటూ అటూ పరికించి చూచాడు. నాదుకాణంలో పనిచేస్తున్న 15 సంవత్సరాల కుర్రాడుమాత్రం వున్నాడు. వాని పేరు అమర్‌నాథ్. ఆ పెద్దమనిషి కూర్చోడానికి కుర్చీవెయ్యమని కుర్రవానితో చెప్పాను. ఆయన కూర్చున్నాడు గాని, నోటినుంచి ఒక్కమాటయినా బయటికి రావడంలేదు.

కొద్దినిమిషాలు ఏమీ పాలుపోకుండా నిశ్శబ్దంగా గడిచింది. అప్పుడు నేను, "మీరు ఏమి చెప్పదలచారో నిస్సంకోచంగా చెప్పండి. ఎందుకలాగ మాట్లాడకుండా వుండడం ? మీరు ఏదో పనిమీదగాని యిక్కడకు వచ్చి వుండరు" అని అన్నాను.


అప్పుడావ్యక్తి దుకాణాన్ని నలువైపులా తిలకించాడు. అమర్‌నాథ్ పై ఆయన దృష్టి నిలిపాడు. వెంటనే, అమర్‌నాథ్ వుండడం చేతనే

ఆయన మాట్లాడదంలేదని గ్రహించాను. అందుచేత, టీ తీసుకురావలసిందనే మిషతో వానిని పంపివేశాను.

వెంటనే ఆ వ్యక్తిలో ఉద్రేకం పుట్టుకొచ్చి యిలా అన్నాడు—

"నేను భారతీయుణ్ణి. రాజకీయ కార్యభారంపై యిక్కడకు వచ్చాను. కాని, కొన్ని చిక్కులలో పడ్డాను. మీ సహాయం కావాలి."

"అయితే మీరెవరు?" అని అడిగాను. "మీకు నాపేరెలా తెలిసింది? ఇక్కడకు మీరు వచ్చిన ఆపని ఏమిటి? మీకు వచ్చిన చిక్కులేమిటి?" అని అడిగాను.



[illegible]

ఆయన యిలా అన్నాడు—"నేను ముర్దాన్ జిల్లాఘల్లాఢేర్ నివాసిని. నాపేరు భగత్‌రామ్. పంజాబు గవర్నరును తుపాకితో కాల్చడానికి ప్రయత్నించిన ఒక యువకుని కథ మీకు తెలుసుకదూ? అతను నా సోదరుడు."

ఆయన తన పేరు, స్వస్థలం పేరు చెప్పగానే పులకాంకితుడనై ఆయన్ని కౌగలించుకున్నాను. నా మేనమామ అత్తవారి వూరు అది. మా అత్త పుట్టింటివారియిల్లు భగత్‌రామ్ యింటి ప్రక్కనేవుంది. అందుచేత, నా పేరు అతనికి ఎలా తెలిసిందో ఇప్పుడు నా కర్థమయింది

నేను 1930 లో నవజవాన్ భారత్‌సభ ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడు అరెస్టుచెయ్యబడదం ఈయన వినివుండాలి. ఎందు

కంటే, ఈ భగత్‌రామ్ కూడా తనజిల్లాలో నవజవాన్ భారత్‌సభలో ముఖ్యమైన సభ్యుడు. మా మేనమామకు కాబూలులో ఒక దుకాణం వున్నదనీ, నేను అందులో పనిచేశానని ఘల్లాఢేర్‌లో అందరికీ తెలుసు.

మా మేనమామనుకూడా భగత్‌రామ్‌కుతెలుసు. ఘల్లాఢేర్‌నుంచి కాబూలుకు వెళ్ళుతున్నప్పుడు మా మేనమామను తను చూచినట్టు భగత్‌రామ్ చెప్పాడు.

## కా ర్య భా రం

"అయితే, మీరు వచ్చిన రాజకీయ కార్యభారమేమిటో, నేను మీకు సహాయపడవలసిన దేమిటో ఇక చెప్పండి" అని అడిగాను.

ఆయన యిలా అన్నాడు - "అఫ్ఘనిస్థాన్ సరిహద్దు దాటించి రష్యాకు పంపివెయ్యాలని సుభాస్ చంద్రబోసును నాతో వెంటపెట్టుకొని వచ్చాను. ఇక యిప్పుడు...."అని ఆయన ఏమి చెబుదామా అని తడుము కుంటున్నాడు.

ఆయన సుభాస్‌చంద్రబోస్‌ను గురించి చెప్పగానే నిర్ఘాంతపోయాను. "సుభాస్‌బోస్!! ఇక్కడకు వచ్చాడా!!" అని ఆశ్చర్యంతో అన్నాను. నాగుండె ఎంతగా కొట్టుకుందో మితిలేదు. అప్పుడే ఒకమనిషి ఏదో కొనడానికి వచ్చాడు. వెంటనే, "నాదగ్గర అదిలేదు" అని చెప్పి పంపి వేశాను. చివరకు ఆశ్చర్యంనుంచి తేరుకొని "అయితే ఏమైంది" అని ఆతురతతో అడిగాను.

ఆయన యిలా అన్నాడు—"మేము ప్రస్తుతం ఒక సత్రంలో వున్నాము. కాని, ఒక కాబూలీ మమ్మల్ని వెంటాడుతున్నాడు. అతను అఫ్ఘన్ సి. ఐ. డి. అయివుంటాడని నా అనుమానం. అతడు మాప్రాణం తీస్తున్నాడు. అందుచేత, ఈ చిక్కునుంచిమమ్మల్ని తప్పించవలసిందిగా మిమ్మల్ని కోరడానికి బోస్‌బాబు నన్ను మీ దగ్గరకు పంపించాడు."

ఇంతలో అమరనాధ్ టీ పట్టుకొచ్చాడు. మేము పుస్తుభాష మాట్లాడడం మానివేసి ఉర్దుభాషలోకి దిగాము. ఉర్దుభాష అమరనాధ్‌కు తెలియదు.

నేను భగత్‌రామ్‌తో, "బోసుబాబు మిమ్మల్ని నాదగ్గరకు పంపాడంటు న్నారు. నే నెవరినో ఆయనకు తెలియనే తెలియదే. నేను యిక్కడ వున్నట్టు మీయిద్దరికీ ఎలా తెలుసు?" అని అడిగాను. భగత్‌రామ్, "మీరు నవజవాన్ భారత్‌సభలో పనిచేస్తున్నప్పటినుంచీ నాకు మీ పేరు తెలుసు. నేను ఆరోజులలో మర్దాన్ సభాసభ్యుడను. నేను ఒకసారి పెషావర్ సభ ఆఫీసుకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ మిమ్మల్ని రెండుసార్లో, మూడోసార్లో చూచాను. అంతేకాదు, 1930 ఉద్యమంలో మీకు రెండు సంవత్సరాల కఠినశిక్ష విధించబడిన సంగతికూడా నాకు తెలుసు. మీరు యిక్కడ వున్నట్టు మీ మేనమామద్వారా విన్నాను. ఆయనకు కాబూలులో షాపు వున్నదనీ, ఆయన మేనల్లుళ్ళు దానిని నడుపుతూ వుంటారని ఆ గ్రామంలో అందరికీ తెలుసు. మీ అన్నదమ్ము లిద్దరినీ నేను చాలాసార్లు చూచాను. మీ యిద్దరికీ చాలా పోలిక వుండడంచేత తరుచుగా నేను మీ సోదరుని చూచి మీరేమో అని భ్రమపడేవాణ్ణి. అందుకే మీరు అవునో కాదో? తెలుసుకోడానికే మీపేరు అడిగాను. మిమ్మల్నిగురించి నేను బోస్‌బాబుతో కొన్నిరోజులముందు చెప్పాను" అని అన్నాడు.

## క్లిష్ట పరిస్థితి

"మీ సంభాషణలో నాప్రసక్తి ఎలావచ్చింది" అని నేను అడగగా ఆయన మళ్ళీ యిలా అన్నాడు— "మీప్రసక్తి ప్రత్యేకంగా ఏసందర్భం లోనూ రాలేదు. కాని, మేము యిక్కడికివచ్చినతరువాత ఇరుకులో పడ్డా మని తెలుసుకొని, ఈగండంనుంచి తప్పించుకోడానికి ఎన్నిమార్గా లున్నాయో అన్నింటినీ యోచించాము. అప్పుడు మీరు జ్ఞాపకం వచ్చారు. అప్పుడు బోస్‌బాబుతో మిమ్మల్నిగురించి చెప్పాను. మీకు యిక్కడ దుకాణం వున్నట్టు, మీరు 1930 లో జెయిలుకు వెళ్ళినట్టు, అమితదేశ భక్తిగలవారనీ చెప్పాను. ఆ రోజునే మిమ్మల్ని కలుసుకోమని ఆయన చెప్పాడు. చివరకు ఈరోజున మిమ్మల్ని కలుసుకో గలిగాను. అయిదు

రోజులనుంచి ఒక సి. ఐ. డి. మమ్మల్ని వెంటాడుతున్నాడు. అతనిని చూచిన మొదటిరోజునే బోసుబాబుకు అనుమానం తగిలి, మిమ్మల్ని వెంటనే కలుసుకోవాలన్నాడు."

అప్పుడు నేను ఆయన్ని, "మీరు ఇన్నాళ్ళనుంచి యిక్కడున్నారు గదా. మీ ప్రయత్నం ఫలించినదేమో నాకు చెప్పవచ్చునా?" అని అడిగాను.

## రష్యన్ రాయబారి—నిరాశ

"మీకు చెప్పడానికి నాకు అభ్యంతరంలేదు. ఈవేళ ఫిబ్రవరి 3వ తేదీ అయివుండాలి. మేము యిక్కడకు వచ్చి పదమూడు రోజులయింది. లాహోరు దర్వాజా దగ్గరగావున్న సత్రంలో ఒక చిన్నగది తీసుకున్నాము. ఈ సత్రంలో ఆరోగ్యమనేది లేదు, భయం కలిగుతూ వుంటుంది. ఒంటెలు, కంచరగాడిదలు తోలుతూ కాబూలుకు వచ్చి వ్యాపారం చేసుకొనే వారందరికీ ఈ సత్రమే ఆశ్రయం.

"రష్యన్ రాయబారిని కలుసుకోవాలని మేము ఇన్నిదినాలనుంచి మా శక్తివంచనలేకుండా ప్రయత్నం చేశాము. కాని, రష్యన్ రాయబార కార్యాలయం ఆవరణలోకి క్రొత్తవారి నెవరినీ రానివ్వరు. అందుచేత మాకు ఆ పని సాధ్యపడలేదు.

"రష్యా జెండాతో ఒక మోటారుకారు వెళ్ళుతూవుండగా ఒక రోజున చూచాము. రాయబారులు మాత్రమే తమ మోటారులకు ఆవిధంగా తమ జాతీయ జెండా తగిలించుకొని వెళ్ళవచ్చునని నేను విన్నాను. అందుచేత, అది రష్యన్ రాయబారి మోటారు కారేనని నిశ్చయించుకున్నాను. కారు ఆగింది. కారులో ముందుసీటులో డ్రైవరు, వెనుకసీటులో ఒక వ్యక్తి వున్నారు. నేను వెనుకసీటులోకూర్చున్న ఆయనతో పర్ష్యన్ భాషలో తడబడుతూ బోసుబాబు గురించి చెప్పాను. నాకు పర్ష్యన్ భాష కొద్దిగా తెలుసు. ఆయన చెప్పినది నాకు తెలుస్తోంది. "మీరు చెప్పే ఆయన సుభాసుచంద్రబోసు అని నాకు ఎలా తెలుస్తుంది?" అని ఆ రాయ

బారి అడిగాడు. దానితో మా ఆశలన్నీ పటాపంచలయాయి. ఆయన బోసుబాబు అని రష్యన్‌రాయబారిని ఒప్పించలేక పోయాను. నేను మాట్లాడక వూరుకోగా ఆ రాయబారి వెళ్ళిపోయాడు."

అప్పుడు నేను భగత్‌రామ్‌తో యిలా అన్నాను—"మీకు పర్షియన్ భాష సరిగా రాకపోవడం, మీరు ఫలానా అని రాయబారికి పరిచయంచేసే వారు లేకపోవడం మీ ప్రయత్నం ఫలించకపోవడానికి కారణమైవుంటుంది."

అదే అయివుండాలని భగత్‌రామ్ అన్నాడు.

రాయబారులతో సరిగా వ్యవహారం చెయ్యడ మెలాగో తెలియని వ్యక్తినిచ్చి బోసు బాబును కాబూలుకు పంపినవారి తెలివి తేటలకు నాకు ఆశ్చర్యం కలిగింది. పర్షియన్, రష్యన్‌భాషలు బాగా తెలిసిన వారిని బోసు బాబుతో పంపివుండవలసింది. ఒకవేళ అటువంటివ్యక్తి లభించివుండక పోతే, రష్యన్ రాయబార కార్యాలయంతో సంబంధంగల వారినయినా పంపివుండ వలసింది.

## ఇటాలియన్ రాయబారి

తరువాత భగత్‌రామ్ తిరిగి యిలా సంభాషణ సాగించాడు—

"మేము రష్యన్ రాయబారిపై ఆశ వదులుకున్నప్పుడు ఇటాలియన్ రాయబారిని కలుసుకోవాలని ప్రయత్నించాము. ఈసారి మేము కృతకృత్యులమయాము. ఇది మేము ఎలా సాధించామో అదంతా ఒక పెద్దకథ. అది తరువాత విందురుకాని. ఇటాలియన్ రాయబారితో మాట్లాడడంలో కష్టంలేకపోయింది. ఇటాలియన్ రాయబారి మా ఆందోళన పోగొట్టి, "మాకు వీలు చిక్కగానే బోసును బెర్లినుకో, రోముకో పంపివేద్దాము" అని ధైర్యమిచ్చాడు.

"ఇప్పుడు నేను చెయ్యవలసిన సహాయమేమిటి" అని నేను అడిగాను.

"మేము సురక్షితంగా వుండడానికి ఒకప్రదేశం యేర్పాటు చెయ్యాలి. మీకు రష్యన్ రాయబారి కార్యాలయంలో ఏదయినా సంబంధం

వుంటే, బోసు బాబును మాస్కోకు పంపే యేర్పాటుచెయ్యండి. మేము ఇటలీ, జర్మనీలతో సంబంధం పెట్టుకోగలిగినా, అది బోసు బాబుకు ఇష్టంగా లేదు. బెర్లినుకుగాని, రోముకుగాని వెళ్ళడం ఆయనకు సమ్మతంగాలేదు."

"కావాలంటే మీరు మాయింట్లో వుండండి" అని నేను భగత్‌రామ్‌తో చెప్పాను. "కాని, మా యిల్లు సురక్షితమైనదని అనుకోను. ఎందుకంటే మా యింట్లోనే మరొక వ్యక్తి వుంటున్నాడు. అతను సకుటుంబంగా క్రింది భాగంలో వున్నాడు. మా యింటి ప్రక్కనున్నాయన పెషావరు నుంచి వచ్చినవాడు. ఇక్కడ వ్యాపారంచేస్తున్నాడు. వీటికితోడు, ఈ అపరిశుభ్ర నగరం అంతకూ బొత్తిగా అపరిశుభ్ర ప్రదేశమైన హిందు గుజార్‌లోవుంది మాయిల్లు. హిందువులువుండే పేటయిది. ఈ కారణం చేతకూడా బోసును మా యింట్లోవుంచడం నాకు ఇష్టంలేదు" అన్నాను.

భగత్‌రామ్ యిలా అన్నాడు—"మేము వున్న క్లిష్ట పరిస్థితిలో పరిశుభ్రంగురించి పట్టింపు ఎవడికి కావాలి? ఆలోచించ వలసినది మీ పొరుగింటి వ్యక్తిని గురించే."

నాకు మరొక ఆలోచన తట్టింది. నా ముస్లిం స్నేహితున కొకనికి మా యింటికి దగ్గరగానే మంచియిల్లు వుంది. అతనుకూడా సరిహద్దు రాష్ట్రంవాడే, అతను చిన్నతనంలో సైన్యంలో పనిచేస్తుండేవాడు. కాని, ఇంగ్లీషు సైనిక ఉద్యోగులతో పోట్లాడి 19 ఏండ్ల వయస్సులోనే సైనిక వృత్తికి స్వస్తి చెప్పాడు.

అప్పటినుంచి అతను చైనా, జపాను, అమెరికా, జర్మనీలలో చాలాకాలంగడిపి, ఒక జర్మన్ యువతిని వివాహమాడాడు. ఇప్పుడతను 70 వ పడిలో పడ్డాడు. బ్రిటిష్ వారంటే మండిపడుతాడు. అతను మక్కాకు కూడా వెళ్ళి రావడంచేత 'మేము హాజీ సాహెబ్' అని పిలుస్తూ వుండే వాళ్ళం.

అతను తన యింటిలో బనియనులు మొదలైనవి కుట్టే యంత్రాన్ని పెట్టి, అదే తన జీవితాధారంగా చేసుకున్నాడు. ఇండియానుంచి బోసు

బాబు పలాయనం చేసినప్పటినుంచి అతను బోస్ గురించి విశేషంగా అడుగుతూ వుండేవాడు.

"సుభాస్‌బోసు భారత సింహం" అని అతను అనే వాడు.

సుభాస్‌బోసును ఇతని యింట్లో పెట్టడానికి వీలవుతుందేమో అడుగుతానని భగత్‌రామ్‌తో చెప్పాను. "మమ్మల్ని అతను దగా చెయ్యని వాడైతే మా అభ్యంతరం వుండదు. ఒకవేళ అతను వీలుకాదంటే ఏమి చెయ్యడం?" అని భగత్‌రామ్ అడిగాడు.

"అతను నిరాకరించడని నా దృఢనమ్మకం. ఒకవేళ అతను నిరాకరిస్తే మా యిల్లు వుండనే వుంది" అని చెప్పాను.

"మీ యిల్లు శుభ్రంగా వుండదని మీరు ఏమీ సంకోచించకండి. బోసు బాబు ఆకుళ్ళ సత్రంలో ఉండగలిగినప్పుడు ఆయన యెక్కడైనా వుండగలడు. నేను పోయి, ఆయన సంగతి చూడాలి. నన్నుయేం చెయ్యమంటారో మీరు చెప్పండి. ఈరాత్రి సత్రంలో వుండడం మంచిదికాదు" అని భగత్‌రామ్ అడిగాడు.

మూడవమార్గం యేదయినా వున్నదేమో ఆలోచించడానికి నాకు వ్యవధికూడా లేదు. అందుచేత సాయంత్రం నాలుగు గంటలకు బోస్ బాబుతో సహా మాయింటికి రమ్మని చెప్పాను. ఈలోపుగా హాజీ సాహెబ్‌ను కలుసుకొని మాట్లాడుతానని చెప్పాను. "అతను అంగీకరిస్తే అతని యిల్లు—లేదంటే మాయిల్లు" అని భగత్‌రామ్‌కు చెప్పాను.

## జియాఉద్దీన్

భగత్‌రామ్ లేచి వెళ్ళిపోబోయాడు. "మీ పఠాన్ వేషానికి తగినట్టుగా మారుపేర్లు పెట్టుకున్నారా? లేదా?" అని అడిగాను.

"లేకపోతే ఎలాగ? నాపేరు రహమత్‌ఖాన్, బోస్‌బాబు పేరు జియావుద్దీన్. సరేగాని, సాయంత్రం 4 గంటలకు బోస్‌బాబుతో వస్తున్నాను" అని చెప్పి భగత్‌రామ్ వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళాడోలేదో, నన్ను అపరిమితంగా భయం ఆవరించింది. నాలో నేను యీ విధంగా అనుకున్నాను—.

"బ్రిటిష్‌వారు సుభాస్ బాబును వెంటాడుతూ వుండాలి. ఆయన కోసం వారు తెరిపిలేకుండా గాలిస్తూవుండాలి. ముఖ్యంగా, భారతదేశానికి సరిహద్దులలోగల దేశాలలో అన్వేషణ జరుపుతూవుంటారు. సుభాస్ బోసుకు హాజీ ఆశ్రయమియ్యక నా యింట్లో వుంచవలసివస్తే ఏమి చెయ్యడం? ఆయన నా యింట్లో వున్నట్లు తెలిసిపోతే ఏమిజరుగుతుంది? నాతోపాటు నా భార్యను కూడా అరెస్టుచేస్తే, ఈ పశుప్రాయమైనదేశంలో, నా పిల్లలగతి ఏమికావాలి? మా పిల్లలను ఆదుకోడానికి అఫ్ఘనిస్థాన్‌లోని భారతీయులెవరూ సాహసించలేరు. వారు అంతగా భయకంపితులై వున్నారు."

## హాజీ నిరుత్సాహం

అయితే, నా అధైర్యం ఆట్టేసేపు వుండలేదు. నేను దుకాణం నుంచి హాజీ యింటికి వెళ్ళాను. అతను యింట్లోలేడు. నేను తిరిగి వస్తుండగా అతనిని కలుసుకున్నాను. మా సంభాషణ ఎవరికీ వినపడకుండా చూచుకొని, ఈ విషయం అతనితో చెప్పాను. ఇండియానుంచి ఎవరో రాజకీయ వ్యవహారాలపై వచ్చారనీ, వారికి చోటు యివ్వాలనీ అన్నాను.

హాజీ సాహెబ్ పెద్ద నవ్వునవ్వి అన్నాడు——

"మీకు బొత్తిగా ముందువెనుకల ఆలోచనలేదు. ఇటువంటి పనుల వల్ల వచ్చే ప్రమాదంమీకు తెలియదు. నాకు ఇటువంటివి ఎన్నో తెలుసు. యూరోపులోవుండగా నేను ఎందరో భారతీయులకు సహాయంచేశాను. అందువల్ల ప్రయోజనం లేకపోవడం అలావుంచి, నేను చాలా బాధ పడడం జరిగింది. భగవంతుడు వచ్చినాసరే మాయింట్లో చోటుయివ్వను. ఎందుకంటే, భారతీయులను నమ్మలేము. అది అలావుంచు. నేనా ముసలి వాణ్ణి. రాజకీయమైన చిక్కులలో తగుల్కొనడం నాకు యిష్టంలేదు."

హాజీ సాహేబ్ సమాధానం నాకు బాధ కలిగించింది. భారత స్వాతంత్ర్యంగురించి తెగచెబుతు వుండిన ఈ మనిషి ఈ మాత్రానికే వెలితి పడ్డాదే అని అనుకున్నాను.

నేను ఎవరినిగురించి చెబుతున్నానో వారిని అతను అనుమానిస్తున్నందుకు కోప్పడ్డాను.

నన్ను శాంతిపటచడానికి ప్రయత్నిస్తూ హాజీసాహెబ్ యిలా అన్నాడు—

"చిరాకుపడకు, ఇటువంటిపనులు చెయ్యడంలో పండిపోయాను. అనేకమంది నన్ను మోసగించారు. నీదగ్గరకువచ్చిన మనిషి ఆ విధంగా చేసేవాడు కాకపోవచ్చు. అతని పేరుచెప్పు. అట్టివా డవునో కాదో చూద్దాం?"

"మీరు చోటుయివ్వనంటున్నప్పుడు మీతో ఆయనపేరు చెప్పి యేమిలాభం?" అన్నాను.

"ఆయన నిజంగా ప్రముఖ భారతనాయకుడై, విశ్వసించ దగిన వాడైతే ఆయనకు నేను ఆశ్రయం యివ్వవచ్చు. బోసుమాత్రం అయి వుండడు. అవునా?"

"సరే. బోసుబాబే అనుకోండి. అప్పుడో!" అని ఉత్సాహంగా అన్నాను.

హాజీ ఆశ్చర్య, సంభ్రమాలతో వివశుడై, సంతోషాతిరేకంతో "బోస్!! బోస్!!!" అన్నాడు,

"ఇప్పుడేమంటారు?" అన్నాను.

"ఎంతమాత్రం అభ్యంతరంలేదు. మీకు మా యిల్లు తెలుసుగదా. ఆయన్ని ఏగదిలో వుంచుదామో చెప్పండి?" అని అడిగాడు.

కుట్టుపని యంత్రంవున్న గదికి ప్రక్కనున్న గదిని యేర్పాటు చెయ్యమని చెప్పాను.

ఆయన ఇంకా యిలా అన్నాడు—

"మా యిల్లు ఒక ఫ్యాక్టరీ అనీ, ఎనిమిదిమంది కూలివాళ్ళు పని చేస్తూవుంటారనీకూడా మీరు జ్ఞాపకం వుంచుకోవాలి. నా జర్మన్ భార్యకు ఘోషాలేకపోవడంచేత, చిన్నగా యింట్లోకి వస్తూపోతూ వుండేవారు మరి కొందరుంటారనికూడా గుర్తువుంచుకోవాలి. ఇవన్నీ చూస్తే ఆయన్ని నా ఇంట్లో ఎలా వుంచమంటారో చెప్పండి. మీ యింటికంటె సురక్షిత మైన ప్రదేశం లేదనుకుంటాను."

మా యిల్లు ఎంత ఇరకాటంగా, కుళ్ళుకంపు కొడుతూ వుంటుందో హాజీకి చెప్పాను. మా పొరుగింటి మనిషిని గురించి చెప్పాను. "సరేలేండి. మీకు అభ్యంతరంగా వుందిగనుక, ఆయన్ని మా యింట్లో వుంచక తప్పదు" అని ఆయనతో చెప్పి, సెలవు పుచ్చుకొని షాపుకు వచ్చేశాను.

## 2

రహమత్ ఖాన్ (భగత్‌రామ్) తిరిగి నా షాపుకు వచ్చేటప్పటికి సాయంత్రం పదినిమిషాలు తక్కువగా నాలుగు గంట లయింది. అత నొక్కడే వచ్చాడు. బోసుబాబు ఏడీ అని అడిగాను. కాబూల్‌నది అవ తలి ఒడ్డున వున్నాడని చెప్పాడు. (కాబూలునది మా దుకాణం ముందు ప్రవహిస్తుంది.) "అదుగో ఆ కనిపిస్తున్నవాడే బోసుబాబు" అని రహ మత్ ఖాన్ అన్నాడుగాని, నాకెవరూ సరిగా కనిపించలేదు.

రహమత్‌ఖాన్ ఒక వ్యక్తివైపు చూపిస్తూ "అదుగో అతనే; కని పించడంలేదూ?" అన్నాడు. ఒక పఠాన్ మాదిరిగావున్న వ్యక్తి కనిపిం చాడు. "ఆయన్ని మీరు గుర్తుపట్టలేరు. ఆయన ఆకృతి, వేషం పూర్తిగా మారిపోయాయి" అని రహమత్‌ఖాన్ అన్నాడు.

రాత్రికి యిద్దరు అతిథులు భోజనానికి వస్తారని అమర్‌నాథుతో ఇంటికి కబురుపంపాను. దుకాణం మూసివేసి, రహమత్‌ఖాన్‌తో బయలు దేరాను.

మా దుకాణానికి సుమారు ఫర్లాంగుదూరంలో కాబూలునదిపై ఒక వంతెనవుంది. బోసుబాబు మమ్మల్ని అక్కడ కలుసుకోవాలని రహమత్ ఖాన్ముందే చెప్పివచ్చాడు. వారు అనుకున్న సమయానికి కొద్ది నిమిషాల ముందే మేము వంతెన చేరుకున్నాము. బోసు ఇంకా రాకపోవడంచేత, ఆయన వస్తున్న దిశగా బయలుదేరాం. ఆ సమయంలోనే కాబూలులోవి ఆఫీసులు మూసివెయ్యబడడంవల్ల వంతెనపై జనం ఎక్కువగా వున్నారు. మేము కొలదిదూరం వెళ్ళగానే బోసుబాబు ఎదురయాడు.

బోసుబాబు అక్షరాలా పఠాన్గా మారిపోయాడు. మురికి కాకీ సాల్వార్ తొడుక్కొని, మురికిచొక్కా తొడుక్కున్నాడు. రెండడుగుల లోతున మంచుగల రోడ్లలో నడిచివుండడంచేత బోసుబాబు తొడిగిన సాక్లు తడిసిపోయాయి.

ఆయన మూడు అంగుళాల గడ్డంపెంచాడు. ఆయన మామూలుగా ధరించే కళ్ళజోడును పెట్టుకోలేదు. పెద్ద తలపాగా చుట్టాడు. ఒక కొస వెనుకను, రెండవది ముందువైపు వేళ్ళాడుతున్నాయి.

ఆయన నిజంగా సుభాస్ చంద్రబోసేనా? అని ఆశ్చర్యపోతూ నిలబడి పోయాను. "ఇక్కడ నుంచొని ఏమిటి ఆలోచిస్తున్నావు? రా పోదాం" అని రహమమత్ఖాన్ నా భుజం తట్టేవరకు నేను తేరుకోలేదు. కొన్ని అడుగులువేసిన తరువాత రహమత్ఖాన్తో, "మీరు నా ప్రక్కనే నడిచి వస్తే ఎవరయినా అనుమానించవచ్చు. అందుచేత, నాకు కొన్ని అడుగుల వెనుకగా రండి. మీ వెనుక బోసుబాబు వస్తాడు" అన్నాను.

మా యిల్లు వంతెనకు సుమారు మైలుదూరంలోవుంది. రోడ్డు ఎగుడు దిగుడుగావుంది. అందులోనూ, ఇప్పుడు మంచుకప్పేసివుంది. బోసు బాబు చాలాచోట్ల కాలుజారాడు.

## మంచు మార్గాన ఇంటికి

బజారులోనుంచి జాగ్రత్తగావచ్చి, సందులో పడ్డాము. ఇళ్ళలో చేరిన మంచునంతనూ సందులోకి గెంటివేశారు. అందుచేత, సందులో

నడవడం కొంచెం ఇబ్బందిగావుంది. అక్కడ మేము ముగ్గురం తప్ప ఇంకెవ్వరూలేరు. సందులోకూడా గోతులు వున్నందున నేను బోసుబాబుకు సహాయంగా వచ్చాను. ఒకచోట బోసుబాబు కాలు ఒక గోతిలో పడి పోయిందికూడా. సమయానికి నేను సాయమువచ్చి ఆయన పడకుండా చేశాను. సరిగా అప్పుడే నన్ను ఎరిగున్న ఒక వ్యక్తి వస్తున్నాడు. బోసునుచూచి అతను నాతో ఇలా అన్నాడు—"పాపం ఈ అభాగ్య యాత్రీకుడు ఎక్కడనుంచి వచ్చాడో" (బోసుతో) "భాయీజీ! ఏ ధర్మ శాలకు వెళ్ళుతున్నావు?"

నేను ఇలా అన్నాను—"భాయీజీ! మన దారిన మనం పోదాం. ఆయనెక్కడకు పోతాడో మనకెందుకు? ఈ చలిలో ఆయన గొడవ మన కెందుకు! ఆయ నెవడో మనకేం తెలుసు!"

ఇలా అంటూ నేను నన్నెరిగున్న ఆయనతో కొంతదూరంపోయి, చెప్పులతాళ్లు ఊడిపోయాయనే మిషతో వెనక్కి ఆగిపోయాను. అతను ముందుకు సాగిపోయాడు. ఇంతలో రహమత్‌ఖాన్, బోసుబాబు ముందుకు వెళ్ళిపోయారు. ఎలా గయితేయేం, చివరకు మా యిల్లు చేరుకున్నాం. మేము ఇంట్లోకి వెళ్ళడం ఎవరూ చూడలేదు. చలి గజగజ వణికిస్తూ వుండడంచేత, మాఇంటి చుట్టుప్రక్కల వారందరు తలుపులు బిటాయించుకొని చలి కాచుకుంటున్నారు.

ఆఫ్ఘనిస్థానంలో చలికాలం చావు సిద్ధంగా వుంటుంది. చలి కాచుకోడానికి పెద్దపొయ్యి వుంటుంది. దుప్పట్లు కప్పుకొని దానిచుట్టూ కూచుంటారు. బోసు బాబు చలికాచుకోడానికి ఏర్పాటుచేసి, టీ కూడా తయారుచేయమని మా ఆవిడతో చెప్పాను.

"స్నానం చేస్తారా?" అని బోసుబాబు నడిగాను. ఆయన నవ్వుతూ యిప్పుడు కాదన్నాడు. "రేపుమాత్రం వేడినీళ్ళ స్నానం అవసరం. ఆఫ్ ఘనిస్థాన్‌లో అడుగుపెట్టిన తరువాత స్నానం యెరగను" అన్నాడాయన.

బోసుబాబుకు ఉన్ని బట్టలు యిచ్చాను. ఆయన వాటిని కట్టుకున్నాడు. కాబూలులో మొట్టమొదటిసారిగా ఆయన కళ్ళజోడు ధరించాడు. ఇప్పుడాయన్ని గుర్తుపట్ట గలిగాను.

ఆయనకు టీ యిస్తూ, "మా పేదయింట్లో మీకు సదుపాయంగా లేకపోతే మన్నించాలి" అని అన్నాను. "మీరు అమాయకంగా మాట్లాడుతున్నారు. నేను యిప్పుడున్న క్లిష్టపరిస్థితిలో మీరు చేసిన మేలు మరచిపోలేను. నేను మాయింట్లో ఉన్నట్టేవుంది" అని బోస్‌బాబు అన్నారు.



మేము టీ త్రాగడమయింది. సత్రంలో ఏమాత్రం సామానువున్నదని రహమత్‌ఖాన్‌ను అడిగాను. "అట్టేలేదు గాని, అయినప్పటికి కూలీ లేందే తీసుకురాలేము" అని అన్నాడు. "మనమే పట్టుకురావడం ప్రమాదం" అని కూడా అన్నాడు. "నేను కూలీచేత సామాను పట్టించుకొస్తే, ఆ సి. ఐ. డి. వెంట పడతాడేమో?" అని రహమత్‌ఖాన్ అన్నాడు.

"ఆ సంగతి నేను చూస్తానులెండి. మీరు అమర్‌నాథ్‌ను కూడా తీసుకువెళ్ళండి. మీతో అమర్‌నాథ్ వచ్చినట్లు సి. ఐ. డి. కి కనిపించకుండా చూచుకోండి. మొదట మీరు సత్రంలోకి వెళ్ళండి. కూలీని వెంటబెట్టుకొని అమర్‌నాథ్ మీ వెనుకనే వస్తాడు. మీరు మీ గదిదగ్గర నిల

బడండి. మిమ్మల్నిచూచి అమర్‌నాథ్ అక్కడకు వస్తాడు. కూలీ నెత్తిపై సామానుపెట్టించుకొని అమర్‌నాథ్ వచ్చేస్తాడు. ఆ తరువాత మీరు సత్రం గుమాస్తాకి అద్దె కట్టివేసి చక్కారండి" అని సలహా యిచ్చాను.

బోసుబాబు నేచెప్పిన సలహా బాగానే వున్నదని అన్నాడు. రహమత్‌ఖాన్‌కు ఆయన యిలా సలహా యిచ్చాడు—

"మిమ్మల్ని ఎవరూ అనుసరించకుండా చూచుకోండి. ఎవరైనా వెంటపడ్డట్టు అనుమానం తోచినట్టయితే, అతను మిమ్మల్ని తప్పిపోయే లాగ అటూయిటూ తిరిగి జాగ్రాత్తగా రండి."

నేను అమర్‌నాథ్‌ను పిలిచి, వాడు చెయ్యవలసినపనిచెప్పి, రహమత్ ఖాన్‌తో పంపించాను.

## నా భార్య అనుమానం

వారు వెళ్ళిపోయిన తరువాత, భోజనం సంగతి కనుక్కుందామని లోపలకు వెళ్ళాను. ఈ అతిథులెవరని మా ఆవిడ చెడ్డఅనుమానంతో అడిగింది. వీరు జలాలాబాద్ జిల్లాలోని ఒక గ్రామం లగ్‌మన్‌నుంచి వచ్చినట్టు చెప్పాను, ఆ వూళ్ళో మా బంధువులు, కాతాదార్లు చాలామంది వున్నారని మా ఆవిడకు తెలుసు.

"లగ్‌మన్‌నుంచి వచ్చేవారినందరినీ నే నెరుగుదునుగాని, ఈయన్ని నేనెప్పుడూ చూడలేదే!" అని మా ఆవిడ శంకించింది.

"ఆయన్ని పెషావరులో ఎలా చూడగలవు? ఆయన అక్కడకు ఒక్కసారేవచ్చాడు. అప్పుడు భోజనానికి రమ్మంటేకూడా ఏకారణం చేతనో మనింటికి రాలేకపోయాడు" అని అన్నాను.

"అయితే, ఇప్పుడెందుకు వచ్చాడు? ఇంతకీ ఆయనెవరు?" అని తరిచి, తరిచి అడిగింది. నేను నిజంచెప్పడం లేదనికూడా నిష్ఠూర్యంగా మాట్లాడింది.

"అయితే, నేను ఇంతవరకూ అబద్ధం చెబుతున్నానంటావు?" అని అన్నాను.

"అబద్ధం కాకపోతే మరేమిటి? ఒక ముస్లిమును తీసుకువచ్చి హిందువుడని నన్ను అనుకోమంటారుకదూ!" అన్నది మా ఆవిడ.

"నీకు మతిపోయింది" అంటూ మా ఆవిడను సమాధానపరుప జూచాను. "మీ యిష్టం వచ్చినట్టు కానివ్వండి, కొత్తమనిషిని గురించి అమర్‌నాథ్‌నాకు చెప్పినప్పటినుంచీ అనుమానంగానేవుంది" అని మా ఆవిడ అనగానే ఆవిడ అనుమానాని కంతకూ వాడే కారణమని నిర్ధారణ చేసుకున్నాను.

"అయితే అమర్‌నాథ్ ఏమన్నాడేమిటి?" అని అడిగాను.

గడ్డంలేని ఒకవ్యక్తి నా దగ్గరకు రావడం, ముస్లిము మాదిరిగా సలాముచెయ్యడం, నేను - ఆయన పుస్తూభాషలో మాట్లాడడం, ముస్లిం హోటలునుంచి టీ తీసుకురమ్మని నేను చెప్పడం-ఇవన్నీ చెప్పింది.

బోసుబాబు మా యింట్లో కొద్దిరోజులుమాత్రమే వుంటాడుగనుక, మా ఆవిడకు అసలుసంగతి తెల్పకుండా వుండాలని అనుకున్నాను. కాని, మా ఆవిడకు రహస్యం చెప్పకుండా వుండేమార్గం కనిపించలేదు.

"సరేలే, నీకు అసలు సంగతేమిటో తరువాత చెబుతానులే''అంటూ తిరుగి బోసుబాబు దగ్గరకు వచ్చివేశాను.

## సత్రంలో 13 రోజులు

అప్పుడు నేను, బోసుబాబు మాత్రమే వున్నాం. ఆఫ్ఘన్ సి. ఐ. డి. మిమ్మల్ని ఎలా అనుమానించి బాధపెట్టాడని ఆయన్ని అడిగాను.

బోసుబాబు ఆ సంగతినంతనూ ఇలా చెప్పాడు—

"ఈవేళ ఫిబ్రవరి 3 వ తేదీ. మేము యిక్కడికి వచ్చి పదమూడు రోజులయింది. నేను పెషావరునుంచి జనవరి 10 వ తేదీన బయలు దేరాను. పెషావరునుంచి యిక్కడకు రావడానికి మూడురోజులు పట్టింది.

"మేము యిక్కడికి వచ్చినప్పుడు చలి మహాదారుణంగావుంది. మంచు అపరిమితంగా కురుస్తూవుంది. నేను ఈ ప్రాంతాలకు కొత్తవాడను.

రహమత్‌ఖాన్‌కూడా అంతే. బస్సులో ఎక్కువగా యెక్కిన ప్రయాణీకులు పోలీసువారి కంటపడకుండా, డ్రైవర్లు ప్రయాణీకులను దింపివేసే ప్రదేశం మీకు తెలుసుగా ! అక్కడ టోల్‌గేట్‌కూడా వున్నట్టుంది. ఎందుకంటే ఎవరోవచ్చి మా సామానులను తనికీచేశారు."

"అదే లాహోరు దర్వాజా: ఒక పెద్ద మైదానానికి ఎదురుగా వుంటుంది" అని అన్నాను. సుభాస్‌బోసు మళ్ళీ యిలా సంభాషణ సాగించాడు —

"అవును. అదే. మంచుపడుతూ వుండడంచేత, ఆ సమయంలో లాహోర్ దర్వాజాదగ్గర ఒక పిల్లకి అయినా లేదు. ఆ సమయంలో మేము ఎటువెళ్లాలోకూడా మాకు తెలియలేదు. కొంతదూరంలోమాత్రం కొందరు మనుష్యులు కనిపిస్తున్నారు. అటువైపు నడక ప్రారంభించాం. మా కష్టాలకుతోడు బురద, మంచుకూడా మమ్మల్ని బాధిస్తున్నాయి.

"చివరకు ఒకబజారు చేరుకున్నాము. ఆ సమీపంలో సత్రం యేదయినావుందా అని రహమత్‌ఖాన్ అక్కడొక మనిషిని అడిగాడు. అతను ఒక సత్రం చూపించాడు. అందులో చాలా గదులు వుంటాయనీ, వాటిని ప్రయాణీకులకు అద్దెకు యిస్తుంటారనీ అతను చెప్పాడు.

"మేము సత్రాంలోకి వెళ్ళాం. సత్రంముందు ఒంటెలు, గుర్రాలు కట్టబడివున్నాయి. వసారాలో కొద్ది బళ్ళుకూడా వున్నాయి. ఇది మానవ మాత్రులు నివసించేప్రదేశం కాదని అనుకున్నాను.

"మేము లోపలికిపోయి అటూఇటూ చూచాము. ఎక్కడా కాళీ గదివున్నట్టు కనిపించలేదు. ఒకమనిషి సత్రంలోకి వస్తుండగా సత్రం గుమాస్తా ఎక్కడ ఉంటాడని రహమత్ ఖాన్ అడిగాడు. అతను తలబిరుసుగా సమాధానం చెప్పకుండా పోయాడు. ఆ తరువాత, అతనికి పుస్తూ భాషరాదని మాకు అర్థమయింది.

"ఆఫ్ఘనులను పుస్తూ భాషయే మాతృభాష అనుకునేవాళ్ళం. కాని, ఆఫ్ఘనుల మాతృభాష పర్ష్యన్ భాష అని ఇక్కడికి వచ్చిన తరువాత

తెలిసింది. ఇక్కడ పుస్తూ తెలిసినవారు బహుతక్కువ. అందుచేతకూడా మాకు చిక్కుగా వుంటూవచ్చింది. రహమత్‌ఖాన్‌కు పుస్తూ మాత్రమే తెలుసు.

## సత్రం కావలివాడు

"కొలది నిమిషాల తరువాత మేడమీద ఒక గదిలోనుంచి ఒక మనిషి మావైపు వచ్చాడు. సత్రం గుమాస్తా ఎక్కడుంటాడని అతనిని రహమత్‌ఖాన్ అడిగాడు. అతను సత్రం పెద్ద గుమ్మం దగ్గరగావున్న ఒక గదిని చూపిస్తూ, కాపలా మనిషివుండే ప్రదేశం అనీ, అతనిని అడగ వలసిందనీ చెప్పాడు.

"మేము అక్కడకు వెళ్ళాం. అతను కప్పుకునిపడుకుని, వున్నాడు.

"గూర్ఖాకువున్నట్టూ, చైనావానికివున్నట్టూ అతనిలో మాంగోలియన్ జాతి లక్షణాలు కనిపించాయి."

బోసుబాబు ఉద్దేశ మేమిటో నాకు అర్థమయింది. ఆ కాపలా దారుడు హిజారా కొండతెగవాడై వుండాలి. హిజరాప్రదేశం అఫ్ఘనిస్థాన్ లోనిదే. అక్కడ సంవత్సరంలో పన్నెండునెలలూ మంచు కురుస్తూనే వుంటుంది. హిజరాప్రజలు చాలా పేదవారు. వారిలో మంగోలియన్ లక్షణాలున్నాయి.

బోసుబాబు తిరిగి యిలా అందుకున్నాడు —"మీ కేమికావాలని ఆ కాపలావాడు పుస్తూ భాషలో అడిగాడు. మేము ప్రయాణీకులమనీ, ఆరాత్రికి సత్రంలో వుండాలనీ రహమత్‌ఖాన్ చెప్పాడు. ఏదయినా గది అద్దెకు యిమ్మని అడిగాడు.

"అతనికి పుస్తూభాష వచ్చినందుకు బ్రతికిపోయాము. కాపలావాడు మమ్మల్ని మేడమీదికి తీసుకువెళ్ళి, ఒక చీకటికొట్టు చూపించాడు. రోజు కొక ఆఫ్ఘన్ రూపాయి అద్దె అన్నాడు. జెయిళ్ళలో సత్ప్రవర్తనతో వుండనివారినికూడా అటువంటి చీకటికొట్లల్లో పడవెయ్యరు. తలుపు మూసి వేస్తే పగలో, రాత్రో తెలియదు.

"కాని, మేము వున్న క్లిష్టపరిస్థితిలో ఆ చీకటి కొట్టే ఆప్యాయ మైంది. మాకు కాళ్ళుపీకుతున్నాయి. నేల మంచు పలకగావుంది. దానిపై పండుకొనడం దుస్సాధ్యం. అందుచేత రెండు పరుపులు దొరకుతాయేమో కాపలావాణ్ణి కనుక్కోమని రహమత్ ఖాన్‌తో చెప్పాను. రోజువొకటికి పరుపువొకటికి అర్ధరూపాయి అద్దె తీసుకొని రెండు పరుపుల్ని కాపలా వాడు సంతోషంగా యిచ్చాడు. పరుపులు లభించాయి.

"రహమత్‌ఖాన్ వెళ్ళి, కొన్ని కట్టెలుకూడా తెచ్చాడు. అవి తడి ముద్దలు. వాటిని అంటిస్తే పొగతప్ప నిప్పు రాలేదు.

"బయట గాలి రివ్వున వీస్తూంది. అందుచేత తలుపు మూసివేశాం. గది అంతా పొగమయం. మాకు ఊపిరాడలేదు. అప్పుడు ఎలాగో తంటాలుపడి, కొన్ని ఎండు పుల్లలు సంపాదించి మంటచేసుకోగలిగాము.

''సాయంత్రం రహమత్‌ఖాన్ బజారుకువెళ్ళి, కొన్ని కొవ్వువత్తులు, రొట్టెలు మొదలైనవి తెచ్చాడు. ఆ రొట్టెల్ని నేను తినలేకపోయాను. రహమత్ అప్పుడు కప్పు టీ తెచ్చిపెట్టాడు. రొట్టెను అందులో ముంచు కుంటేగాని, అది గొంతుక దిగలేదు.

"ఆ రాత్రి మాకు బాగా నిద్రపట్టిపోయింది. ఉదయం మాకు మెల కువరాగానే మా కీళ్లు తెగనొప్పి పెడుతున్నాయి.

"ఉదయం రొట్టెలు తిన్న తరువాత, రహమత్ ఖాన్ రెండు తోలు వెయిస్ట్‌కోట్లులు, ఒక కెటిల్, రెండు చిన్న తివాసీలు కొనితెచ్చాడు. సత్రం యెదురుగా ఒక ముస్లిం దుకాణంవుంది. అక్కడ మేము రొట్టెలు మొదలైనవి కొనుక్కునేవాళ్ళం.

## 3

"ఆ విధంగా సత్రంలో రోజులు గడుపు తున్నాం. ఆరు రోజుల క్రిందట రహమత్‌ఖాన్‌వచ్చి, ముస్లిం దుకాణంలో ఒక వ్యక్తి తెల్లని

దుస్తులతో వుంటాడనీ, రహమత్‌ఖాన్ వెళ్ళినప్పుడాల్లా అతను కనిపిస్తుంటాడనీ, ఆవేళ తనను వెంటాడాడనీ చెప్పాడు. ఇతడు అప్ఘన్ సి. ఐ. డి. అయివుంటాడని రహమత్‌ఖాన్‌కు అనుమానం కలిగింది.

"మేము అప్పుడే భోజనం ముగించాం. ఆ సి. ఐ. డి. మా గది గుమ్మంలో ప్రత్యక్షమయాడు. పుస్తూ భాషలో, "మీ రెవరు?" అనీ, "ఇక్కడ కేందుకొచ్చారు?" అనీ గద్దిస్తూ అడిగాడు.

"మేము సరిహద్దు తెగకు చెందిన ప్రయాణీకులమని రహమత్‌ఖాన్ సమాధాన మిచ్చాడు. నా వైపు చూపిస్తూ యిలా అన్నాడు—ఇతను మా అన్నయ్య. ఇతను చెవిటివాడు. మూగవాడు కూడాను. పాపం, జబ్బుగా వున్నాడు. అందుచేత, సఖీసాహెబ్ దర్శనం చేయిద్దామని తీసుకుపోతున్నాను. సఖీసాహెబ్‌కు వెళ్ళే రోడ్డునిండా మంచుపడడంచేత ఆ రోడ్డున యెవ్వరిని పోనివ్వడంలేదు. రోడ్డును తెరిచేవరకు ఇక్కడ బసచేశాము.

"సి. ఐ. డి. యీ మాటల్ని నమ్మనన్నాడు. తనతో కొత్వాల్ (పోలీసు ఇన్‌స్పెక్టరు) దగ్గరకు రావాలన్నాడు. కథ అడ్డం తిరుగుతూంది. రహమత్‌ఖాన్ బ్రతిమాలుతూ యిలా అన్నాడు—"మావంటి ప్రయాణీకులను ఎందుకు యిబ్బంది పెట్టడం? ఈ చలిలో మా అన్నయ్య నడవనైనా నడవలేడు." ఆ కుంకకు జాలికలుగలేదు. అప్పుడు రహమత్‌ఖాన్ ధైర్యం తెచ్చుకుని యిలా అన్నాడు — "సరే పదవయ్యా, కొత్వాల్ దగ్గరకు నేను వస్తాను. మా అన్నయ్యకు జబ్బుగావుంది. అతను రాడు."

## పోలీసువాని పేరాశ

"రహమత్‌ఖాన్ అలా అనడంతో సి. ఐ. డి. కొంత మెత్తపడి యిలా అన్నాడు—"సరే, అతను జబ్బుగా వున్నాడు గనుకపోని. లేదంటే మీ యిద్దరినీ తీసుకుపోదును, మీరు ప్రయాణీకులు గనుక దయదలుస్తున్నా. సాధ్యమైనంత త్వరలో యిక్కడ నుంచి వెళ్ళిపోడానికి ప్రయత్నించండి."

"రోడ్డు సరిగావుంటే ఈవేళే వెళ్ళిపోతాము" అని రహమత్‌ఖాన్

అన్నాడు. "సరే, ఆలాగే చెయ్యండి. గాని, నేను టీ త్రాగడానికి చిల్లర యేమయినా యివ్వండి" అంటూ సి. ఐ. డి. చెయ్యిజాచాడు, రహమత్ అతనిచేతిలో పదిరూపాయల (అఫ్ఘన్) నోటు పెట్టాడు.

"మూడవరోజున ఆ సి. ఐ. డి. మళ్ళీ ప్రత్యక్షమయాడు. అప్పుడు నేను చీకటి కొట్టులో ఒక్కడనే వున్నాను. అతను పుస్తూలో ఏదో మాట్లాడాడు. నాకు చెవుడు, మూగవున్నట్టు నటించాను. దానితో అతను మాట్లాడక ఊరుకున్నాడు. కొద్ది నిమిషాలలో రహమత్‌ఖాన్ తిరిగి వచ్చాడు. ఈ సారి సి. ఐ. డి. ఎంతో యిష్టంగా మాట్లాడాడు. "మీకు ఇంకా సఖీ సాహిబ్‌కు వెళ్ళేబస్సు దొరకలేదా?" అని అడిగాడు. బస్సు దొరకడం కష్టంగావుందనీ, ఇప్పుడు అక్కడనుంచే వస్తున్నాననీ రహమత్ చెప్పాడు. ఈ నీచుడు ఇంకొకఅయిదు రూపాయల నోటుతో గాని మమ్మల్ని వదిలిపోలేదు.

"వీణ్ణి మనం ఎలాగయినా సరే సాధ్యమైనంత త్వరలో వదుల్చుకొని పోవాలని నేను రహమత్‌తో చెప్పాను. ఈ సి. ఐ. డి, ఒట్టి పీనాసి. వీడికి యీ విధంగా ఎన్నిదినాలు ముడుపు చెల్లించగలము? వేరే మార్గం లేక ఈ సత్రంనుంచి వెళ్ళిపోవా లనుకున్నాం.

"అక్కడకూడా ఈ సి. ఐ. డి, లలో మరొకడు దాపరిస్తే ఏమిటి చేయడం? అని మాకు సందేహం తోచింది. అప్పుడు మీ సంగతి జ్ఞాపకం వచ్చింది. అంతకుముందే రహమత్‌ఖాన్ మిమ్మల్నిగురించి చెప్పాడు. మీరు మాకు సహాయపడగలరని నాకు తోచింది.

"ముందుగా ఏ యేర్పాట్లు లేకుండా రాజకీయవ్యవహారంపై రావడ మేమిటి? అని, మీరు ఏమంటారో అంటూ రహమత్‌ఖాన్ మీ దగ్గరకు వెళ్ళడానికి ఇష్టపడలేదు. నాకు కోపంవచ్చింది. మనం అరెస్టు కావాలని నీ అభిప్రాయమా? అని అతనిని కోప్పడ్డాను. అసలు ఉత్తమ్‌చంద్ వూళ్లో వున్నాడోలేదో అని, అయినా వాకబుచెయ్యి అని అతనిని పంపాను.

# మళ్ళీ సి. ఐ. డి. పీడ

"మరునాడు మేము ఉదయం భోజనం చెయ్యబోతుండగా సి. ఐ. డి. వచ్చిపడ్డాడు. ఈసారి సరాసరి గదిలోకివచ్చి పరుపుమీద కూర్చున్నాడు.

"సఖీ సాహిబ్‌కు మీరు వెళ్ళడానికి ఆటంకమేమిటి?" అని అడిగాడు. ఆ ప్రదేశం దగ్గరగా లేదనీ, బస్సు దొరకడంలేదనీ రహమత్ సాకుచెప్పాడు.

"మీకు మాత్రమే ఎందుకు బస్సు దొరకదయ్యా?" అంటూ వాడు కస్సుబుస్సు మన్నాడు. "నిన్ననే ఒక బస్సు సఖీ సాహిబ్‌కు వెళ్ళినట్లు నాకు తెలుసు. అదీగాక, వారానికి రెండుసార్లు టపా'బస్సు అక్కడికి వెళ్ళుతుంది అన్నాడు."

"రహమత్‌ఖాన్ యిలా అన్నాడు—"నిన్నకూడా నేను బస్సుసంగతి కనుక్కున్నాను. నిన్న బస్సు వెళ్ళినట్టు నా కెవరూ చెప్పలేదే! టపాబస్సు గురించి నాకు అంతగా తెలియదు. ఈ వేళ మళ్ళీ ప్రయత్నిస్తాను. టపా బస్సుగాని, మరొకటిగాని దొరికితే మేము వెంటనే వెళ్ళిపోతాము."

"తరువాత సి. ఐ. డి. 'మిమ్మల్ని అనుమానిస్తున్నాను. మిమ్మల్ని ఆరురోజులనుంచి చూస్తున్నాను. మీరు మన్మంద్ తెగవారిలాగ వున్నారు (ఆఫ్ఘనిస్థాన్‌లో విప్లవకారుల తెగ). మిమ్మల్ని గురించి యీ వేళ మా సబ్‌ఇన్‌స్పెక్టరుతో చెప్పాను. మీయిద్దరినీ తీసుకురావాలని ఆయన చెప్పాడు. అందుచేత త్వరగా టీ త్రాగినాతోరండి, అన్నాడు.

"మా దగ్గరనుంచి ఇంకా డబ్బు గుంజడానికి ఇదొక పన్నాగమని తోచింది. ఇంతవరకు వాడు టీ త్రాగడానికంటూ డబ్బుపట్టుకు పోయాడు. ఇప్పుడు సబ్ ఇన్‌స్పెక్టరు పేరుతో డబ్బులాగా లనుకున్నాడు. రహమత్ ఖాన్ ప్రాధేయ పూర్వకంగా యిలా అన్నాడు—

"మేము ప్రయాణీకులము, ముస్లింభక్తులం. మమ్మల్ని యిబ్బంది పెట్టాలనుకుంటే, సరే కానియ్యండి. ఏముచేస్తాం? టీ అవగానే నేను మీతోవస్తాను."

"అలా వల్ల కాదట. నాకు చెప్పడయినాసరే, మీ యిద్దరినీ తీసుకు పోతానన్నాడు ఆ తుచ్ఛుడు. రహమత్‌ఖాన్ అయిదు రూపాయలనోటు యిచ్చి, సమాధాన పరిచ జూచాడు వానిని.

''వాడు ఆ నోటును జేబులో వేసుకుని యిలా అన్నాడు—అయిదు రూపాయల నోట్లతో నేను వూరుకోలేను. మా సబ్ఇన్‌స్పెక్టరు ఆజ్ఞను దాటలేను."

"రహమత్‌ఖాన్ మరొక అయిదు రూపాయల నోటు పడేశాడు. చివరకు 17 రూపాయలకు బేరంతెగింది. (ఆఫ్ఘనిస్థాన్‌లో పోలీసువాడి జీతం 30 రూపాయలు. ఇండియన్ రూపాయలలో ఆరు రూపాయి లన్నమాట).

"రేపు మీరు వెళ్ళకపోతే సబ్ఇన్‌స్పెక్టరు దగ్గరకు తీసుకువెళ్ళ వలసి వస్తుందని చెప్పాడు.

## రిస్టువాచికి తిలోదకాలు

"నా రిస్టువాచి రహమత్‌ఖాన్ చేతినివుంది. సి. ఐ. డి. కళ్ళు దానిపై పడ్డాయి. దాని ఖరీదెంత అని అడిగాడు. ఎంతోకాదని రహమత్ చెప్పగా, "అయితే దానిని నా కిచ్చివెయ్యి అని అడిగాడు". విధిలేక రహమత్ అదికూడా యిచ్చివేశాడు. సి. ఐ. డి. వెళ్ళిపోయిన తరువాత రహమత్‌ను మీ దగ్గరకుపంపాను. మీ కోసం రెండుసార్లు వచ్చాడు. రెండు సార్లుకూడా మీ దుకాణం కట్టివేసివున్న దన్నాడు. నిన్నంతా మేము ముళ్ళపై వున్నట్టువుంది. ఈ వేళ వుదయం రహమత్‌ఖాన్ మీకోసం బయలుదేరుతూ వుండగా ఆ శనిగాడు మళ్ళీవచ్చాడు. రిస్టువాచిని సబ్ ఇన్‌స్పెక్టరు లాక్కున్నాడట. మమ్మల్నిగురించి ఇన్‌స్పెక్టర్ అడగగా మేము మరొకసత్రానికి వెళ్ళిపోయినట్టు చెప్పాడట. ఇవన్నీ చెప్పి, చేబదులు అంటూ మరొక అయిదు రూపాయల నోటు చేతిలో పడేసుకుని పోయాడు.

"సి. ఐ. డి. వెళ్ళిపోయిన తరువాత రహమత్‌ఖాన్ సత్రం కాపలావానితో ఈ సంగతంతా చెప్పాడు. మేము మరొక సత్రానికి పోతున్నామనికూడా చెప్పాడు. కాపలావాడు యిలా అన్నాడు—"గత అయిదురోజుల నుంచి చూస్తూనే వున్నాను. ఈసారి వచ్చావంటే మాటదక్కదని అతినితో చెప్పాను. ఇంకరాడు లెండి.

"ఆ తరువాత రహమత్‌ఖాన్ మీ దగ్గరకువచ్చాడు. పిమ్మట ఏమి జరిగిందీ మీకు తెలుసు" అని బోసు ముగించాడు.

# 4

ఆఫ్ఘన్ సి. ఐ. డి. వెంటాడించిన వృత్తాంతాన్ని బోసుబాబు చెబుతూవుండగా, అమర్‌నాథ్ రహమత్‌ఖానులు సామానుతోసహా సత్రం నుంచి తిరిగివచ్చారు. మేమంతా భోజనాలు కానిచ్చి, రేడియోలో వార్తలు వింటున్నాం. అది అయిన తరవాత, గత రెండువారాలలో యుద్ధరంగాల విశేషాలను, ఇండియా గురించిన విశేషాలను చెప్పమని బోసుబాబు అడిగాడు జనవరి 19 వ తేదీ తరువాత అయనకు ఏవిధమైన వార్తలు తెలియలేదు.

నాకు జ్ఞాపకంవున్న సంగతుల నన్నింటినీ చెప్పాను. కాబూలులో బ్రిటిష్ రాయబారి కార్యాలయంనుంచి నాకు "సివిల్ అండ్ మిలిటరీ గెజెట్" మాత్రం వస్తూ వుంటుందని ఆయనకు చెప్పాను.

హరిద్వార్‌లో బోసుబాబు అనుకొని ఒక సాధువును పోలీసువారు అరెస్టు చెయ్యడం, ఇహలోకంలో సంబంధం త్రెంపుకొని సన్యసించినట్టుగా సర్దార్ శార్దూల్‌సింగ్ కవీశర్ ప్రకటించడం చెప్పగా ఆయనకు సరదా కలిగింది. ఇంక ఆ రాత్రికి ఆయన్ని ఇంకా ప్రశ్నించి విసుగెత్తించ దలచుకోలేదు. అప్పటికే పొద్దు పోవడంచేత ప్రక్కలమీద తలలు వాల్చాము.

నేను నా గదిలోకి వెళ్ళాను. మాఆవిడ ఇంకా మెలకువగా కూర్చునే వుంది. ఎంత నిద్రపోదామన్నా రావడం లేదని చెప్పింది. "ఇద్దరు విచిత్ర వ్యక్తులు ఇంటికొచ్చి కూర్చుంటే నిద్ర ఎలా పడుతుం దనుకున్నారు?" అని ప్రారంభించి ప్రశ్నలు కురిపించడం మొదలుపెట్టింది. "వారెవరా యిద్దరూ ? పోలీసువానినుండి తప్పించుకున్న కథఏమిటి ?" అన్నది మా ఆవిడ. "అంటే మా సంభాషణనంతా చెవులు విప్పి వింటున్నావన్న మాట. ఇంతకీ, ఆయనేదోపాతికథ చెబుతున్నాడుగాని మరేమి లేదే!" అని అన్నాను. మా ఆవిడఎంతకీ వినలేదు. వినక గొడవచెయ్యడం ప్రారం భించింది. "ఆ! అదీ, ఇప్పుడు నాకు తెలిసొచ్చింది" అంటూ గొంతెత్తి అరుస్తూంటే, నోరుమూసి అరవకని మొత్తుకున్నాను.

"వాళ్లిద్దరూ ఎవరో మాయమనుష్యులు.రాత్రిపగలుకూడా యిలా దాగుకుం టారు. నేను వొప్పుకోను. మీరు ఇంటిలో లేకుండా వాళ్ళిద్దరూ ఇక్కడే వుంటారంటే నేను వూరుకోను. వాళ్ళని దాచాలంటే మరొకదారి ఏదో చూసుకో వలసిందే. తురకాళ్ళను నా యింటిలో వుండనియ్యను" అన్నది.

## నిజం చెప్పివేశాను

మా ఆవిడకు అసలు రహస్యం తెలియనియ్యకుండా దాచేయవచ్చు ననుకొని ఇంతవరకు కాలక్షేపం చేశాను. కాని ఆమె ధోరణిచూస్తే, నిజం చెప్పివెయ్యడమే ఉత్తమంగా తోచింది. బోసుబాబు మా యింటిలోవుంటే చాలా రోజులు వుండడంకూడా జరగవచ్చు. అందుచేత, ఆమెకు నిజం తెలపడమే మేలుగా వుంటుందని ఆలోచించాను.

అదే ప్రకారం ఆమెకు పూసగుచ్చినట్టు సంగతంతా చెప్పాను. ఆమెను భయం ఆవేశించింది. "ఈ సంగతి బయటికి పొక్కిపోయిం దంటే మనకొంప మునగడం తప్ప ఇంకేమైనావుందా! అమ్మయ్యో! వాళ్ళని అరెస్టుచేస్తారు. ఆ తరువాత మనం ఎన్నిబాధ లనుభవించాలో చెప్పలేము" అంటూ మా ఆవిడ గజగజలాడడం ప్రారంభించింది.

మనం జాగ్రత్తగావుంటే బోసుబాబు మన ఇంట్లోవున్న సంగతి పరబ్రహ్మకుకూడా తెలియదని చెప్పాను. "బోసుబాబు మన ఇంట్లో అరెస్టు అయినాడంటే మనకు ఎంత అవమానం! ఆయన మన ఇంట్లో ఎంతకాలం వున్నాసరే, గాలికికూడా ఆయన కబురు తెలియకుండా చెయ్యవలసిందే" అని మా ఆవిడకు నచ్చచెప్పాను.

ఎప్పుడైతే ఈ సంగతి చెప్పానో మా ఆవిడ పూర్తిగా మారిపోయింది. "నా ప్రాణం పోయినాసరే బోసుబాబును కాపాడి తీరుతాను" అని శపథంచేసింది. "భగవంతుడు కటాక్షించాడు గనుక, ఈ విధంగా అయినా మన మాతృభూమికి సేవచేసే అవకాశం మనకు చిక్కింది" అని ధైర్యం తెచ్చుకుంది.

మా ఆవిడవైఖరి చూచి పరమానంద భరితుడ నయాను. ఆమె ఋణం నేను తీర్చుకోలేను. బోసు బాబును అన్నిరోజులు దాచగలిగామంటే ఆమె ధైర్యం, సమయస్ఫూర్తే కారణాలు. బోసుబాబు మాయింట్లో 48 రోజులు వున్నాడు. ఆయన వున్న సంగతి మా పొరుగువాళ్ళకు వాసన అయినా తగలకుండా మా ఆవిడ అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంది.

మరునాడు ఉదయం నేను బోసు బాబుకు సదుపాయాలు చెయ్యడంలో మామూలుప్రకారం దుకాణానికి వెళ్ళలేకపోయాను, మామూలుగా దుకాణానికి పొద్దున పది,పదిన్నరకు వెళ్లుతూ వుంటాను. ఆవేళ పన్నెండైపోయింది. బోసుబాబుకు ఇది ఇష్టంలేక పోయింది. "మామూలు ప్రకారం మీరు దుకాణానికి వెళ్ళుతూవుండాలి. నా భోజనం కోసమని మీరు వుండిపోకూడదు. మీరు దుకాణానికి ఆలస్యంగా వెళ్ళుతూవుంటే ఎవరికయినా అనుమానం కలగవచ్చు" అని ఆయన హితవుచెప్పాడు.

నేను షాపుకు వెళ్ళబోయేముందు నాదగ్గరున్న "సివిల్ అండ్ మిలిటరీ గెజెట్" పత్రికల నన్నింటినీ ఆయనకిచ్చాను. ఆయన్ని ఒక గదిలోపెట్టి, దానికి తాళంవేసి, తాళంచెవిని మా ఆవిడ కిచ్చి వెళ్ళిపోయాను.

పగటివేళల ఆయన్ని గదిలోపెట్టి తాళంవేసేవాళ్ళం. ఒకవేళ ఎప్పుడైనా బంధువులుగాని. పొరుగుయిళ్ళవారుగాని చటుక్కున వచ్చినా ఆ గదిలోకి వెళ్ళడానికి వీలుపడేదికాదు.

## కలకత్తానుంచి పలాయనగాథ

ఆ రాత్రి భోజనాలు చేస్తూ బాతాఖానీ ప్రారంభించాం. "మీరు ఇండియానుంచి ఏ విధంగా తప్పించుకొని వచ్చారో మీనోటినుండి వినాలని వుంది. అయితే, మీకు చికాకుగా వుండకపోతేనే సుమండీ" అని అడిగాను.

"మాస్కోకు వెళ్ళాలని చాలాకాలంనుంచి అనుకుంటున్నాను" అని ప్రారంభించి బోస్‌బాబు యీ విధంగా చెప్పుకొచ్చాడు—

"మాస్కోకు వెళ్ళాలని వుందేగాని, చాలా రోజులవరకు తగిన యేర్పాటులు జరగడానికి వీలు చిక్కిందికాదు. నన్ను ఇండియానుంచి మాస్కోకు దాటించివేస్తామని కొందరు మాటయిచ్చారు. రెండు నెలల క్రిందట వీరు నన్ను ఇండియానుంచి రహస్యంగా బయటికి తీసుకుపోవాలనుకున్నారు. కాని, అప్పుడు నాకు కదలడం వీలుపడలేదు. కలకత్తా కార్పొరేషనులో ఒక జరూరు వ్యవహారం వుండిపోయింది. అప్పటికి నేను గడ్డం పెంచడం జరగలేదు. ఈ రెండు కారణాలచేత నేను అప్పటిలో కలకత్తాదాటి రానన్నాను. కాని, అప్పుడే బయలుదేరివుంటే మాస్కోకు ఎప్పుడో వెళ్ళివుందును గదా! అని ఇప్పుడనుకుంటున్నాను. అప్పుడునాతో వస్తానన్న పెద్దమనిషి కాబూలులోని రష్యన్ రాయబార కార్యాలయంతో సంబంధం వున్నవాడు. నేను ఎప్పుడైతే రానన్నానో అతను వొంటరిగానే వెళ్ళిపోయాడు. ప్రస్తుతం అతను మాస్కోలో వున్నాడు.

"కలకత్తాలో ఒక నివేశనం గురించి పేచీ వచ్చింది. ఆ వ్యవహారం పరిష్కారమై పోయిన తరవాత, నా ఆరోగ్యం బాగాలేదని వంక పెట్టి ఇల్లు కదలడం మానుకున్నాను. డాక్టర్లు పరిపూర్ణ విశ్రాంతి తీసుకోవాలని నాకు సలహా యిచ్చారని కూడా నటించాను. నన్ను ఎవరూకూడా

చూడడానికి వీలులేదని ఖండితంగా చెప్పాను. నాతో ఎవరైనా మాట్లాడదల్చుకుంటే టెలిఫోన్‌లో మాట్లాడవలసిందే.

"నేను ఇక కొద్దిరోజులకు తప్పించుకొని పోతా ననగా, మా బంధువులను సయితం నా గదిలోకి రావడానికి వీలులేదని చెప్పాను. నా కోసం అన్నం తెచ్చే నౌకరు గది బయట టేబిలుపై అన్నం పెట్టి వెళ్ళిపోవాలని చెప్పాను.

"ఇవి యిలా జరుగుతూవుండగా, నేను తప్పించుకొని పోవడానికి తగు యేర్పాట్లు చెయ్యవలసిన వారికి వర్తమానాలు పంపాను. నేనుఎప్పుడు బయలుదేరేదీ తేదీని నిర్ధారణచేసుకుని వారికి కబురంపాను.

"ఆ వేళ జనవరి 15 వ తేదీ. అప్పటికి 40 రోజులనుంచి నా గడ్డం పెరుగుతూవుంది. రాత్రి 8 గంటలవేళ నేను మౌల్వీవేషంలో మోటారులో బయలుదేరాను. కలకత్తాకు 40 మైళ్ళదూరంలో వున్న ఒక స్టేషనును చేరుకున్నాను. (బోసు బాబు ఆ స్టేషనుపేరు కూడా చెప్పాడు గాని, నాకు ఇప్పుడది జ్ఞాపకంలేదు.) అక్కడ నేను పెషావరుకు రెండవ తరగతి టిక్కట్టుకొని మెయిలు యెక్కాను.

ఆ రాత్రి ప్రయాణం కులాసాగా జరిగిపోయింది. మరునాడు ఒక సిఖ్ఖు ప్రయాణీకుడు నా పెట్టెలోకి ఎక్కాడు. మేము ఒకరి కొకరు ఎదురుగానే కూర్చున్నాం.

"మా సంభాషణలలో నేను ఎక్కడినుంచి వస్తున్నాననీ, ఏం పనిమీద వెళ్ళుతున్నాననీ అడిగాడు. 'మాది లక్నో, నాపేరు జియావుద్దీన్, అని చెప్పి, 'ఇన్స్యూరెన్సు ఏజంటుగాపనిచేస్తూ రావల్పిండి వెళ్ళుతున్నాను' అని చెప్పాను. ఆ రోజంతా అతడు నాతోపాటు ఆ బండిలో వున్నాడు. స్టేషనులో రైలు ఆగినప్పుడల్లా ఏదో వొక వార్తాపత్రికతో ముఖం కప్పుకునేవాణ్ణి.

## అచ్చం మౌల్వీనే


"బిగువైన పైజామాలు తొడిగి, షేర్వానీ తొడుక్కొని, ఫెజ్ టోపీ పెట్టుకున్నాను. ఆ వేషంలో నన్ను గుర్తుపట్టడం మహా కష్టం.

గడ్డం పొడుగుగా ఎదిగిందేమో. అచ్చం మౌల్వీగా తయారయాను. ఈ ప్రయాణంలో చెప్పదగిన విశేషా లేమి లేవు. జనవరి 17 వ తేదీ ఉదయం 9 గంటలకు పెషావరు చేరుకున్నాను. స్టేషనుదగ్గర నాకోసం ఒక కారు సిద్ధంగా వుంది. తిన్నగా నేను వెళ్ళవలసినచోటుకు వెళ్ళిపోయాను. నా మిత్రులు కాబూలు ప్రయాణానికి ఏర్పాట్లు చెయ్యవలసి వుండడంచేత పెషావరులో రెండు రోజులు వుండవలసివచ్చింది. పెషావరు వరకు నేను మానవమాత్రుడికి తెలియకుండా రాగలిగిన యేర్పాట్లుచేసిన మిత్రులను ఎంతయినా కొనియాడాలి. పెషావరులో నేను రెండురోజులు వున్నప్పటికీ నాజాడ ఎవరికీ తెలియదు. జనవరి 19 వ తేదీన నా మిత్రులు నాకు పఠాన్‌దుస్తు లిచ్చారు. యు. పి. రాష్ట్రపు మౌల్వీగా కనబడడం కంటె పఠాన్‌గా కనబడడం ఆఫ్ఘనిస్థాన్‌లో సుకరంగా వుంటుందని ఆలోచించారు. రహమత్‌ఖాన్, మరొక మిత్రుడు, నేను మోటారులో పెషావరు నుంచి జమ్రుద్‌వెళ్లే రోడ్డుగుండా బయలుదేరాం. జమ్రుద్ కోటకుకొంచెం ఇవతలగా మరొక దిక్కుకు చిన్నరోడ్డు విడిపోతుంది ఈ చిన్నరోడ్డులో మోటారు నడిచింది. ఎల్లాగయితేం, చివరకు గర్హీ అనే గ్రామం చేరుకున్నాం. అక్కడినుంచి మోటారువెళ్ళడానికి రోడ్డులేదు. ఆ రాత్రికి గర్హీలోనే కాలక్షేపంచేసి, మరునాడు నేను, రహమత్‌ఖాన్, ఇంకో ఇద్దరు పఠానులు కాబూలుకు కాలినడకను బయలుదేరాం. మాతోవున్న పఠానులు తుపాకీలు పుచ్చుకున్నారు. పెషావరునుంచి మాతో వచ్చిన మిత్రుడు తిరిగి వెళ్ళిపోయాడు. ఇక, ఇదిమొదలుకొని నాకు చెవుడు, మూగ అని నటించా లన్నారు.

## సరిహద్దు ప్రాంతంలో

"మరునాడు సాయంత్రంఇండియా సరిహద్దును దాటినాము. దాటి, సరిహద్దులో వుండే కొండజాతివారి గ్రామం చేరుకున్నాం. అక్కడ అద్దాషరీఫ్ అనే ప్రఖ్యాత మసీదువుంది. అందులో ఒక మతగురువు వుంటాడు. మా

బసకు ఆయనే అన్ని యేర్పాట్లుచేశాడు. రాళ్ళనక, రప్పలనక రోడ్లలో తెగ నడిచి వుండడంచేత నరాలు పడిపోయాయి. ఆ రాత్రి మతగురువు మసీదులో నిద్రపోయాం. మాతో వచ్చిన పఠానులిద్దరూ ఇక్కడ విడి



పోయారు. మరునాటి ప్రయాణంలో మాకు ఇంకో ముగ్గురు పఠానులు తుపాకులతో తోడు వచ్చారు. ఈ సారి నడచిన మార్గం యమయాతన పెట్టింది. అలసటచేత తరుచు దారిలో ఆగుతూ వచ్చాం. రాత్రి 9 గంటలయేసరికి లాల్‌పురా చేరుకున్నాం. ఇక్కడకూడా మా కోసం ముందుగానే యేర్పాట్లుచెయ్యబడ్డాయి. ఆ రాత్రి సుఖంగా నిద్రపోయాం. ఇక్కడ మాకు ఆతిధ్యం యిచ్చిన వ్యక్తి ఒక ఖాన్. నిజానికి ఇక్కడ ఈయన [illegible]. ఆఫ్ఘన్ గవర్నమెంటు వుద్యోగులలో మంచి గౌరవం సంపాదించిన వాడు. ఇంతవరకు నడచిన నడకకు బొత్తిగా అలిసిపోయాను. కాని, కాబూలునది చేరుకోడానికి ఇంక కొద్దిమైళ్ళు మాత్రమే నడవాలన్నారు. కాబూలు నది దాటడంతోడనే కాబూలుకు వెళ్ళేబస్సులు కనిపిస్తాయని నాకు ధైర్యం కలిగించారు.

"మేము లాల్‌పూరానుంచి బయలుదేరకముందు మా ఆతిథేయి నాకు ఒక కాగితం వ్రాసియిచ్చాడు. దారిలో మమ్మల్ని ఎవరయినా అనుమానించి యిబ్బంది పెట్టబోతే ఆ కాగితం చూపమన్నాడు, ఆ కాగి

తంతో ఆఫ్ఘనిస్థాన్‌లో ఎవరివల్లనూ చిక్కు రాకుండా చేసుకోవచ్చునని ఆయనచెప్పాడు. ఆయన పర్షియన్ భాషలో వ్రాసియిచ్చిన కాగితాన్ని నేను చదివాను. అందులో యిలా వుంది—"రహమత్‌ఖాన్ జియావుద్దీన్‌లు కొండజాతివారు. సఖీసాహిబ్ మసీదుకు యాత్ర వెళ్ళుతున్నారు, వీరు సత్ప్రవర్తన గలవారని నేను హామీ యిస్తున్నాను. వీరిని ఏవరూ యిబ్బంది పెట్టకుండా వుండగలందులకు ఈ పరిచయవాక్యాలుగల కాగితం యిస్తున్నాను."

బోసుబాబు యీ సంగతి చెప్పగానే, "ఈ కాగితాన్ని సి. ఐ. డి.కి చూపకపోయారా?" అని అడిగాను. అప్పుడాయన యిలా అన్నాడు—"సి. ఐ. డి.కి. చూపడంచేతనే, వాడి బారినుంచి బయటపడ్డాం. వాడికి గడియారాన్ని సమర్పించుకోవలసి వచ్చినరోజున దీనిని చూపించాం. ఇది చూపకముందు మమ్మల్ని పీక్కుతిన్నాడు. ఇది చూపినతరువాత చల్లబడ్డాడు. కాని, వాడికి కావలసింది డబ్బుగాని, మా సత్ప్రవర్తన గురించిన సర్టిఫికేటుకాదు.

## కాబూల్ నదిని దాటుట

"మేము లాల్పురా నుంచి బయలుదేరినప్పుడు మాతో యిద్దరు సాయుధులు రక్షణగా వచ్చారు. కొద్దిమైళ్ళు నడిచిన తరువాత కాబూలునది చేరుకున్నాం. కాని, నదిని దాటడానికి అక్కడ పడవ కనిపించలేదు. నదిని దాటడానికి నీళ్ళుతెచ్చుకొనే తోలుసంచులను తాటితో కట్టి నదిలో పడవేసి వాటిపై యెక్కి దాటుతున్నారు. మొదట నాకు ఇది భయం కలిగించింది. కాని, మిగిలినవారు దాటడంచూచి నేనుకూడా ధైర్యంచేశాను. ఇప్పటికి ఆఫ్ఘన్ గడ్డలో అడుగుపెట్టాం. ఇక్కడ తుపాకులతో బహిరంగంగా తిరగడం నిషేధం. అందుచేత మాతోవచ్చిన పఠానులు నదికి ఆవలవుండి, తిరిగి వెళ్ళిపోయారు. ఈ విధంగా మేము దాకా తప్పించుకున్నాం. (దాకా అనేది పెషావరుకు 50 మైళ్ళ దూరంలో

వున్న గ్రామం. కాబూల్, పెషావరులమధ్య తిరిగే ప్రయాణీకులు యిక్కడ తమ పాస్‌పోర్టులు చూపించాలి. ఇక్కడ సామానులనుకూడా తనిఖీచేస్తారు.) పెషావరు దాకాల మధ్యనే మూడుచోట్ల తణిఖీ జరుగు తుందని అన్నారు. అందుచేత ఇవన్నీ దాటుకురావడానికి చుట్టుమార్గం పట్టివచ్చాం. ఒక్క రోజుతోపోయే ప్రయాణం బదులు మూడు రోజులు నడిచాం.

## అపాయాల రాత్రి

"కాబూలునది దాటిన తరువాత రోడ్డుకు దగ్గరగా ఘుంగి అనే ప్రదేశం వుంది. అదొకతోపు. కొన్నిచెట్లు గుబురుగా వున్నాయి. అక్కడే ఒక నుయ్యికూడా వుంది. బస్సుకోసం ఎదురుచూస్తూ, నేను చెట్లకింద పడుకున్నాను. రహమత్‌ఖాన్ మాత్రం కాబూలు దిశగావెళ్ళే ప్రతిబస్సునూ ఆపవలసిందని చెయ్యి ఊపుతున్నాడు. బస్సులవాళ్లు మా మాట పట్టించు కోవడంలేదు. అలసటచేత నేను నిద్రపోయాను. రహమత్‌ఖాన్ నన్ను నిద్రలేపేటప్పటికి ఇంచుమించు సాయంత్ర మయింది. నాకు దగ్గరగా ఒక లారీ ఆగింది. "నన్ను అందులోకి ఎక్కమనేటప్పటికి ఎలాగాఎక్కడనూ అని భయపడ్డాను. ఆ లారీనిండా పెట్టెలు వున్నాయి. కూర్చోడానికి స్థలం లేదు. క్లీనరు మమ్మల్ని పెట్టెలపైకి ఎక్కమని ఆజ్ఞాపించాడు. ఆ పనే చేశాం. మంచు దట్టంగాపడుతూవుంది. ఎటుచూచినా పెద్దమైదానం. రోడ్డు ప్రక్కలవున్న చెట్లకొమ్మలు ఎక్కడ తగులుకుంటాయో అని భయంగా వుంది. మధ్య మధ్య మేము బుర్రలువంచి చెట్లకొమ్మల దెబ్బ తప్పించు కోవలసి వచ్చింది. మొత్తంమీద ఈ లారీ ప్రయాణం బేజారెత్తించింది. "ఇంతకంటె మంచిబస్సు కనిపించలేదటోయ్" అని రహమత్ ఖాన్‌ను అడుగగా, "15 బస్సులుమనవైపు చూడనైనా చూడకుండా వెళ్ళి పోయాయి" అన్నాడు. "ఇందులోమనం ఎక్కివుండకపోతే రాత్రికి ఘుంగి లోనే వుండిపొయే వాళ్ళము" అన్నాడు. ఆరాత్రి అంతా లారీలో గడి

పాము. దారిలో చాలాచోట్ల వెచ్చదనంగావుంటుందని మాటిమాటికీ టీ తాగేవాళ్ళం.

"రెండవ రోజుకు ఖక్ అనే చోటు చేరుకున్నాం. ఇక్కడ పాస్ పోర్టులను తణిఖీ చేస్తారు. లంచాలుకూడా పుచ్చుకుంటారు. మేము ఏంపనిమీద బయలుదేరామని అడిగారు. నన్ను చూపిస్తూ రహమత్ ఖాన్ యిలా అన్నాడు—"ఇతను మా అన్నయ్యండి. ఇతనికి చెవుడు, మూగ కూడాను. సఖీ సాహిబ్‌కు యాత్ర చేయిస్తున్నాను. మేముకొండ ప్రాంతం లోని వాళ్ళం" అని చెప్పి లాల్ పురా ఖాన్ యిచ్చిన సర్టిఫికేటు చూపించాడు. దానితో ఆ ఆఫీసరు నోరు కట్టుబడింది.

"మేము మళ్ళీ టీ తాగి లారీలో బయలుదేరాం, సాయంత్రం నాలుగు, అయిదు గంటలమధ్య కాబూలు చేరుకున్నాం. లారీవాడికి డబ్బు యిచ్చివేశాం. ముందుగానే జాగ్రత్తపడి పెషావరునుంచి ఆఫ్ఘన్ డబ్బు తెచ్చుకున్నాం. ఇక మిగతా కథమీరు నిన్న విన్నదే."

బోసుబాబు ఇలా చెప్పి ముగించే సమయానికి మా ఆవిడ, మా చిన్నమ్మాయి అన్నం పట్టుకొచ్చారు. భోజనంచేస్తూ రేడియో విన్నాం.

## 5

రేడియో వార్తలు వినడం అయినతరువాత నేను బోసుబాబును యిలా అడిగాను—"మీరు యిక్కడి ఇటాలియన్ రాయబారితో మాట్లాడినట్లు రహమత్ ఖాన్ చెప్పాడు. అంటే, మీరు యింక మాస్కో వెళ్ళదల్చుకోలేదా? ఒకవేళ మాస్కో వెళ్ళదలుచుకుంటే, ఇటాలియనులతో ఎందుకు ఏర్పాట్లు చేస్తారు?"

మాస్కోకు వెళ్ళాలనే అభిప్రాయాన్ని ఇంకావదలుకోలేదని బోసుబాబు చెప్పి, తన అభిప్రాయాన్ని యిలా అన్నాడు—"మేము ఇటాలియను

లతో రాయబారాలు జరుపుతున్నామంటే, ఆఫ్ఘన్‌స్థాన్‌నుంచి త్వరలో వెళ్ళిపోవాలనే ఉద్దేశంతోనేగాని ఇటాలియనులపై అభిమానం చేతకాదు. నేను కాబూలువరకు రావడానికి మా స్నేహితులు అన్ని యేర్పాట్లు చేశారు. కాని, కాబూలులో మాకు తగిన సదుపాయాలు యేర్పాటు చెయ్యలేక పోయారు. ఈ ప్రదేశం నాకు ఎంతకొత్తదో, రహమత్ ఖాన్‌కు కూడా అంతేకొత్త. అతనికి వచ్చిన పుష్తోభాష అయినా ఇక్కడేమీ ఉపకరించ లేదు. అతనిని నాతో పంపినవారు, ఇక్కడ రష్యనులతో మేము మాట్లాడ డం కష్టమనే సంగతిని ఆలోచించలేదు. రష్యన్ రాయబారి కార్యాలయంలో ప్రవేశించడం సయితం వారికి తెలియదని స్పష్టపడింది. రష్యన్ రాయబార కార్యాలయంతలుపులు ఎప్పుడూ మూసేవుంటవి. ఆఫ్ఘన్ పోలీసులు అక్కడ రాత్రిం బగళ్ళు కాపలా కాస్తుంటారు. మా స్నేహితులు చాలాభ్రాంతి పడ్డారు. నేను కాబూలుకు వచ్చినట్టు రష్యనులకు తెలియగానే, వారు విమానం యేర్పాటుచేసి, నన్ను మాస్కోకు తీసుకుపోతారని మా స్నేహి తులు అనుకున్నారు. కాబూలు వచ్చిన మరునాడు ఉదయం భోజన మైన తరువాత మేము రష్యన్ రాయబార కార్యాలయం వెతుక్కుంటూ బయలుదేరాము. అయితే, ఇది ఎక్కడున్నదని మేము ఎవరినీ అడగ కూడదు. అందుచేత, ఊరంతా చుట్టుతున్నాము. మాకు ఇటాలియన్, ఈజిప్షియన్, ఇరానియన్, గ్రీక్ రాయబార కార్యాలయాలు కనిపించాయి. ప్రతి రాయబార కార్యాలయం ముందరకూడా ఆఫ్ఘన్ పోలీసులు కాపలా వుండడంచూచి ఆశ్చర్యపోయాము. యూరపులోమాత్రం ఇలా వుండదు. ఇక్కడ రాయబార కార్యాలయాలలోకి ఎవ రెవరు వెళ్ళుతున్నారా? అని ఆఫ్ఘన్ పోలీసులు ఆచూకీతీయను ప్రయత్నిస్తారుకూడా. కాని, యూరపులో ఎవరైనా సరే ఏ రాయబారి కార్యాలయంలోనికైనా సరే, నిరాక్షేపణగా వెళ్ళవచ్చు. ఇంతకి, మాకు రష్యన్‌రాయబారి కార్యాలయం కనిపించలేదు. ఇంక ఆవేళకి నడవలేక అలిసిపోయాము. కాళ్ల నరాలు బిగిసిపోయాయి. మా పెషావరు జోళ్ళతో మంచులోనడవడం దుర్భరమై పోయింది. అందు

చేత, తిరిగి సత్రం చేరుకున్నాం. ఆరాత్రి కర్రదుంగలులాగ నిద్రపోయాము నాకు మెలకువ వచ్చేసరికిబాగా' తెల్లవారింది. భోజనంచేసి తిరిగి రష్యన్ రాయబారి కార్యాలయంకోసం బయలుదేరాము. మిగతా రాయబారుల కార్యాలయాలన్నీవున్న ప్రాంతంలో సుమారు రెండు గంటలు తిరిగాము గాని, రష్యన్ రాయబారికార్యాలయం మాత్రం కనుక్కో లేకపోయాం.

"అక్కడినుంచి ఇతర వీధులకు బయలుదేరాం. ఒకచోట చటు క్కున నాకు ఎర్రజెండా ఎగురుతున్న భవనం కనిపించింది. అదే రష్యన్ రాయబారి కార్యాలయమని గట్టిగా తెలిసింది. పెద్దగేటు మూసివుంది ఆఫ్ఘన్ పోలీసు కాపలా కాస్తున్నాడు. ఇక యిప్పుడు ఏమిటి చెయ్యడమా అని ఆలోచనలోపడి కొంచెం దూరంగా కూర్చున్నాం. మొదట మేమెవ రమో చెబితేగాని లోపలికి వెళ్ళడానికి వీలుకాదు. మేము ధరించిన దుస్తు లలో మమ్మల్ని లోపలికి వెళ్ళనివ్వడమంటూ జరిగడమే కల్ల. అలాగే ఆలోచిస్తూ చాలాసేపు కూర్చుండి పోయాం. అంతసేపుకూడా నన్ను, నా పలాయనానికి సహాయపడ్డవాళ్ళనీ తిట్టుకుంటూనే వున్నాను. అధమం. రష్యనులతో ఇంతకుముందు పరిచయంవున్న ఎవరిని నాతో పంపివుండినా బాగుండిపోయేది. నిస్పృహచెంది తిరిగి సత్రం చేరుకున్నాము. ఈ ఆలో చనలతో నాకు ఆకలికూడా అనిపించలేదు.

"ఇప్పుడేమిటి చెయ్యడమా? అని ఆలోచిస్తూ, తర్కించుకుంటూ రాత్రి పొద్దుపోయేవరకు మెలకువగానే వున్నాం. చివరకు ఒక ఆలోచన తట్టింది. రేపు రష్యన్ రాయబారి కార్యాలయం ముందు కాచుకొనివుందాం ఏ సమయంలోనైనా రష్యన్ రాయబారి మోటారుకారు బయటికివస్తుందా, దానివి రోడ్డులో ఆపుదాం. ఆపి, ఆయనతో మాట్లాడుదాం. ఇంతకుతప్ప ఆయన్ని కలుసుకొనేమార్గం ఇంకేమీలేదు అని నిశ్చయించుకున్నాం.

## రష్యన్ రాయబారి

"ఇలాగ నిశ్చయించుకొని మరునాడు ఉదయం రష్యన్ రాయబారి కార్యాలయం దగ్గరకు వెళ్ళాం. అనేక మోటారుకార్లు లోపలికి వెళ్లుతూ

బయటకు వస్తున్నాయి. కాని, అందులోని వాళ్ళు రష్యనులవునో కాదో మాకు తెలియదు. సాయంత్రం 4-30 గంటలవరకు చూశాం. తిరిగి నిరాశతో సత్రంముఖం పట్టబోతున్నాం. ఇంతలో మళ్ళీ గేటు తెరుచుకుంది. ఒక చిన్న రష్యన్ జెండా తగిలించుకుని ఒక కారు బయటకు వస్తూవుంది. ఈ మోటారుకారులోనివాడు రష్యన్ రాయబారి అయి వుండాలని మాకు అనిపించింది. గత మూడురోజులలో మాకు, ఒక్క రాయబారి మాత్రమే తన మోటారుకారుకు జెండా కట్టుకోడానికి అధికారం వుంటుందని తెలిసింది. మోటారుకారు మా ప్రక్కనుంచి వెళ్తూవుండగా రహమత్‌ఖాన్ చెయ్యి వూపాడు. మోటారుకారు ఆగగానే, రహమత్‌ఖాన్ వచ్చీరాని పర్షియన్ భాషలో వెనుకసీటులో కూర్చున్న ఆయనకు నన్ను గురించి ఏదో చెప్పాడు. నేను మోటారుకారుకు కొద్దిదూరంలో నిలబడ్డాను. రహమత్‌ఖాన్ నన్ను ఆయనకు వేలుతో చూపించడం గమనించాను. అతరువాత, రాయబారితో తాను ఏమి మాట్లాడాడో రహమత్‌ఖాన్ చెప్పాడు.

"నాతో కాబూలుకు సుభాస్‌చంద్రబోసును తెచ్చాను అని రహమత్‌ఖాన్ అతడితో అన్నాడట. "బోసు మాస్కో వెళ్ళాలనుకుంటున్నాడు. మీరు ఆయన్ని అక్కడకు పంపగలరా?" అని రహమత్‌ఖాన్ అడిగాడు. రష్యన్ రాయబారి యిలా అన్నాడు—"ఆయన సుభాస్‌చంద్రబోసే అను నాకు నమ్మకం యెలాగ? ఆయన సుభాస్ చంద్రబోసే అన్నసంగతి తెలియకుండా ఆయనికి సహాయం చెయ్యడం యెలాగ?" ఈ ప్రశ్నలకు రహమత్‌ఖాన్ వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. దానితో మోటారుకారు ముందుకు సాగిపోయింది.

"రహమత్‌ఖాన్ ఇదంతా చెప్పగానే నాకు అమిత దుఃఖం కలిగింది. బంగారంవంటి అవకాశాన్ని జారవిడుచుకున్నాం. రహమత్‌ఖాన్‌కు పర్షియన్ భాష రాకపోవడంచేత, రష్యన్ రాయబారికి వెంటనే సమాధానం చెప్పలేక

పోయాడు. గత్యంతరంలేక సత్రం చేరుకున్నాం. 'పర్షయన్ బాగా వచ్చిన వాణ్ణి ఎవరినైనా పంపవలసిందని పెషావరుకు కబురు పంపుదామా?" అని రిహామత్‌ఖాన్ సలహాయిచ్చాడు. "మనం పంపే కబురును నమ్మకంగా తీసుకువెళ్ళేవాడు కనిపించాలిగదా ?"అన్నాను. "అటువంటివాడు దొరికి నప్పటికీ, కబురు పంపితేమాత్రం పెషావరులోని మన మిత్రు లేమిచెయ్య గలరు ?" అనికూడా అనుమానించాను. ఈ సంగతి వారికి ముందుగానే తెలిసివుంటే, మమ్మల్ని ఇలా వదిలేసివుండరు. ఏమైతే అయిందని, ఒక లారీ డ్రైవరుద్వారా సమాచారం పంపడానికి నిశ్చయించాము. మరునాడు రహమత్‌ఖాన్ లారీ డ్రైవరును ఏర్పాటు చెయ్యడానికి వెళ్ళాడు. కొంత సేపయిన తరువాత తిరిగివచ్చి, నమ్మకస్థుడైన లారీ డ్రైవరు ద్వారా పెషావరుకు కబురు పంపా నన్నాడు. ఆ సాయంత్రమే రిహామత్‌ఖాన్ సి. ఐ. డి. సమాచారం నాకు చెప్పడం జరిగింది. అది మీకు చెప్పనే చెప్పాను. గోరుచుట్టుమీద రోకటిపోటులాగ సి. ఐ. డి. వొకడు తగుల్కొ న్నాడు. ఈ పరిస్థితులలో మాకు ప్రాణం విసిగిపోయింది.

## ఇటాలియన్‌లతో సంబంధం

"పెషావరునుంచి సహాయం వస్తుందో లేదో తెలియదు. అందుచేత, కేవలం యెదురుచూస్తూ వుండక, ఏదో వొకమార్గం చూచుకోవలసివుంది.

"పెషావరుకు కబురు వెళ్ళిందిగాని, సమాధానం ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలుసు? రష్యన్ రాయబారి వల్లకాదని చెప్పివేసినట్లే అనుకోవాలి. నేను మాస్కోకు రావడం రష్యనులకు నిజంగా యిష్టంలేదో, లేక. నేను సుభాస్ బోసునే అనే నమ్మకం రష్యన్ రాయబారికి లేకనే అలా అన్నాడో నాకు బోధపడలేదు.

"సంగతిసందర్భాలు యీ విధంగా వుండడంచేత, ఇటాలియన్ రాయబారినో, జర్మన్ రాయబారినో కలుసుకొనడం మంచిదని అని పించింది. ఒకవేళ యీలోపుగా నేను రష్యాకు వెళ్ళడానికి మా స్నేహి

తులు యేర్పాటు చెయ్యగలిగితే మహాదాగే. అలా జరగలేదు అంటే, అక్షరాజ్యాల రాయబారులద్వారా ఇక్కడనుంచి ఎగిరిపోవచ్చు. నన్ను తమ దేశాలకు రానియ్యడానికి వాళ్లు సంకోచించరని నా తలంపు. మేము జర్మన్ రాయబారి కార్యాలయాన్ని ఇంకా చూడలేదు. పైగా, దానికోసం వెతికినాడా ప్రయోజనంలేదు. జర్మనీ ఎటువంటిదో ఇటలీకూడా అటు వంటిదే. ఒకరికొకరు తీసిపోరు.

"అందుచేత మీరు (ఉత్తమ్‌చంద్) ఇటాలియన్ రాయబారి కార్యా లయానికివెళ్ళి, అతనితో నన్నుగురించి చెప్పాలి. నేనిక్కడ వున్నానని తెలియగానే వాళ్ళు చంకలుకొట్టుకుంటూ, సాయపడ్తారని నా నమ్మకం. నా మాట వాళ్లు తోసివెయ్యరు. ప్రస్తుతంలో యూరోపుకు వెళ్ళాలంటే ఒకటే మార్గంవుంది. అది మాస్కోమీదుగా వున్నమార్గం. దారిలోనే మాస్కోలో ఆగిపోయినా ఆగిపోతాను. లేదా, బెర్లిన్, రోములలోని రష్యన్ రాయ బారులద్వారా మాస్కోకు వెళ్ళడానికి యేర్పాట్లు చేస్తాను.

"ఆరాత్రి ఈ యోచనలతో మేము నిద్రపోలేదు. నేను ఆఫ్ఘనిస్థాన్ నుంచి సాధ్యమైనంత త్వరలో వెళ్ళిపోవాలని రహమత్‌ఖాన్‌కూడా అభి ప్రాయపడ్డాడు. మరునాడతడు ఇటాలియన్ రాయబారిని కలుసుకోవాలని బయలుదేరాడు. కార్యాలయం గేటుముందు ఆఫ్ఘన్ పోలీసువాడు రహమత్ ఖాన్‌ను ఆపుచేశాడు. 'నేను జపాను రాయబారి కార్యాలయందగ్గర కాపలా వాణ్ణి' అంటూ అతను ఆ పోలీసును ఫల్టీ కొట్టించి లోపలికి వెళ్ళగలిగాడు. ఇటాలియన్ రాయబారి సీనార్ కారోనీ. అతనిని రహమత్‌ఖాన్‌కలుసుకొని నన్నుగురించి సవిస్తరంగా చెప్పాడు. అతను చాలా సంతోషించి, నన్ను రోమ్‌కో, బెర్లిన్‌కో పంపడానికి కొద్ది రోజులలోనే ఏర్పాట్లు చేస్తా నన్నాడు. ఈసారి ఎప్పుడు తనను కలుసుకోవా లన్నప్పటికి కాబూలులో హెర్ థామస్ అనే జర్మన్ వర్తకుని ఆఫీసులో కలుసుకోవచ్చునని సీనార్ కారోనీ సలహాయిచ్చాడు. రాయబారి కార్యాలయానికి పదేపదే రావడంలో

వున్న చిక్కులు గురించి రహమత్‌ఖాన్ అతనితో చెప్పడంచేత ఈ ఏర్పాటు చెప్పాడు.

"రహమత్‌ఖాన్ పిచ్చివేస్తుందనగా సీనార్ కారోనీ యిలా అన్నాడు 'బెర్లిన్‌నుంచిగాని, రోమునుంచిగాని రెండు రోజులలో నాకు సమాధానం వస్తుంది. అంతలోపల మీరు మా మిత్రుడైన హెర్ హాసన్‌ను కలుసుకోండి. అతనికి మీ కివ్వమని ఒక సిఫారసు కవరు యిస్తాను.'

"హెర్‌హాసన్ ఒక జర్మన్ వ్యక్తి. కొన్ని జర్మన్ కంపెనీల ప్రతినిధిగా ఆఫ్ఘనిస్థాన్ వచ్చాడు. అతను చాలా వ్యాపారాలు చేస్తూవుండడంచేత, ఎవరైనా సరే అతనిదగ్గరకు వెళ్ళవచ్చు. అనుమానం వుండదు. నిజానికి కాబూలులోవున్న జర్మనులందరు జర్మన్ సి. ఐ. డీలే. ఇటాలియన్ రాయబారి యిచ్చిన వాగ్దానం నాకు సంతోషమే కలిగించిందిగాని రోముకుగాని, బెర్లిన్‌కుగాని వెళ్ళడం నాకు యిష్టంలేదు. కాని, తప్పనిసరి అయింది. మేము చేసిన ఈ ప్రయత్నం కేవలం రెండోపక్షంగా మాత్రమే.

"మీరు (ఉత్తమ్‌చంద్) యిక్కడ చాలరోజుల నుంచి వుంటున్నారు. మీకు రష్యన్ రాయబారితో ఏవిధంగా సంపర్కంవున్నా, నన్ను ఆయన దగ్గరకు తీసుకు వెళ్ళేమార్గం చూడండి."

బోసుబాబు ఇలా అడగగానే, సోవియెట్ రాయబారి కార్యాలయంలో నాకు ఎవరితోనూ పరిచయంలేదని చెప్పాను.

ఇంకా ఇలా అన్నాను —"కాబూలులో రాజకీయ వ్యవహారం జరిపే తలంపు నాకు ఇదివరలో లేదు. రష్యన్ రాయబారి కార్యాలయంలోని వాళ్ళకు అనుమానం మహాజాస్తి అనికూడా వినేవాణ్ణి. కాని, ఇప్పుడు మీ పని వచ్చింది గనుక వాళ్ళతో పరిచయం చేసుకోడానికి ప్రయత్నిస్తాను."

బోసుబాబు యిలా అన్నాడు—"దయచేసి తప్పకుండా ప్రయత్నించండి. ఇటాలియనులు అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, రష్యనులు అంగీకరిస్తే మాస్కోకే వెళ్ళిపోతాను.

## అక్షరాజ్యాల ఆనందం

"సినార్ కారోనీ చెప్పినప్రకారం రహమత్‌ఖాన్ మూడవనాడు హెర్ థామస్ ఆఫీసుకు వెళ్ళాడు. అతను రహమత్‌ఖానుకు ఒక సీలు చేసిన కవరు యిచ్చాడు.

"అందులో యిలావుంది—'మీదగ్గరనుంచి ఉత్తరం అందినరోజునే నేను రోమ్, బెర్లిన్‌లకు మీరు యిక్కడవున్నట్టు తెలియపరచాను. అక్కడ బాధ్యతగలపెద్దలు మీసంగతి, సందర్భాలు విని సంతోషపడ్డారు. మీరు అద్భుతంగా తప్పించుకుని రాగలిగినందుకు అభినందనలు పంపారు. మీకు సహాయపడవలసిందిగా నాకు ఉత్తరవులు వచ్చాయి. కొద్దిరోజులలో సన్నాహాలు పూర్తికాగలవు'—మీ కారోనీ.

"మరునాడు నేను సినార్ కారోనీకి యీవిధంగా లేఖ పంపాను. 'మీ లేఖ చూచి ఆనందించాను. నాకు ప్యాస్‌పోర్టు యేర్పాటుచేస్తున్నందుకు మీకు కృతజ్ఞుణ్ణి. అది ఎంత త్వరలో వీలయితే అంతమంచిది. ఎందుకంటే, ఇక్కడ నేను వుండడం క్షేమంకాదు. బెర్లిన్, రోమ్‌లలోని పెద్దలకు నా ధన్యవాదాలు పంపండి."

## 6

ఫిబ్రవరి 5 వ తేదీన రహమత్‌ఖాన్ "పగలు, రాత్రి అనక ఆస్థానం ఇంట్లోకూర్చోవడం నాకు విసుగ్గావుంది" అని నాతో అన్నాడు. "ఈ వేళ నేనుకూడా మీతో బజారుకు వస్తాను. హెర్ థామస్ ఆఫీసుకు వెళ్ళి మాకోసం మరేదైనా సమాచారం వచ్చిందేమో కనుక్కుంటాను" అన్నాడు. కాని, బోసుబాబు ఇందుకు అంగీకరించలేదు. అంగీకరించక, యిలా అన్నాడు—"మీరు బజారుకు వెళ్ళడం మంచిదికాదు. హెర్ థామస్

ఆఫీసుకు ఉత్తమ్‌చంద్ వెళ్ళి, మనకేదైనా సమాచారంవుంటే ఆయన తెస్తాడు."

బజారుకు నాతో రావడంవల్ల ప్రమాదం రావడానికికూడా అవకాశం వున్నదని నేను కూడా సలహా యిచ్చాను, "మీరు కన్నుకప్పిన సి. ఐ. డి. మళ్ళీ మిమ్మల్ని చూస్తే ఏమవుతుంది? నేను హెర్ థామస్‌ను కలుసుకొనివస్తాలెండి" అన్నాను.

నేను రేడియోలనుకూడా అమ్ముతూవుంటాను. అందుచేత, రేడియో వ్యాపారంచేసే జర్మన్ కంపెనీ వొకటి కాబూలులోవుందని నాకు తెలుసు. కాని, అదే హెర్ థామస్ ఆఫీసు అనేసంగతి నాకు ఇంతకుముందు తెలియదు. హెర్ థామస్ అడ్రసు తీసుకున్నాను. 'ఇటలీ రాయబారి పంపే సమాచారాలను హెర్ థామస్ ఆఫీసుకు పంపడంకంటె మా షాపుకే పంపుతూ వుండవచ్చునుగదా!' అని నేను బోసుబాబుకు సలహా యిచ్చాను.

"ఇలాగ చెయ్యడంవలన మనకు బోలెడు శ్రమా తప్పుతుంది; ప్రమాదమూ వుండదు. హెర్ థామస్ షాపుకు అదేపనిగా వెళ్ళుతూవుంటే ఎవరయినా అనుమానించనూ అనుమానిస్తారు" అని అన్నాను.

నా సలహా భేషగ్గావుందన్నాడు బోసుబాబు. హెర్ థామస్‌దగ్గర ఒక భారతీయుడు నౌకరుగా వున్నాడనీ, వాడు బ్రిటిష్ వారికి సి. ఐ. డి. గా పనిచేస్తున్నాడనీ రహమత్‌ఖాన్ చెప్పాడు.

రహమత్‌ఖాన్ అతని ఆఫీసుకు వెళ్ళినప్పుడల్లా ఆ నౌకరు తేరిపారచూస్తూవుంటాడట. అది రహమత్‌ఖాన్‌కు గట్టిగా అనుమానం కలిగించింది.

"నన్ను ఎవరూ అనుమానించరు లెండి. ఎందుకంటే, నేను రేడియో వ్యాపారినని కాబూలులో అందరికీ తెలుసు" అన్నాను.

## ప్యాసుపోర్టుకోసం

మా సంభాషణ ఈ విధంగా జరిగిన తరువాత, సీనార్ కరోనీకి బోసుబాబు వుత్తరం వ్రాసి యిచ్చాడు. నేను దానిని తీసుకువెళ్ళి హెర్

థామస్‌కు అందచెయ్యాలి. ఆ వుత్తరంలో బోసుబాబు యిలా వ్రాశాడు—
"మమ్మల్ని సత్రంలో ఒక సి. ఐ. డి. వెంటాడిస్తుండగా, ప్రమాదం వస్తుందేమోననే తలంపుతో మా మకామును ఒక స్నేహితుని యింటికి మార్చాము. ఈయనకు నదిప్రక్కన 'న్యూ బిల్డింగ్' అనే మేడలో షాపు వుంది. రేడియోలలోనూ, ఇతర విధాలయిన సామానులలోనూ, వ్యాపారం చేస్తుంటాడు. రహమత్‌ఖాన్ హెర్ థామస్ ఆఫీసుకు రెండపసారి వెళ్ళాడు. కాని, ఇంతవరకు మీవద్దనుంచి ఏ వర్తమానం నాకు చేరలేదు. నాకు ప్యాస్‌పోర్టుకోసం మీరు ఏర్పాటులన్నీ పూర్తిచేశా రనుకుంటాను. మీరు త్వరలో ఏ సంగతి తెలియచేస్తే కృతజ్ఞుణ్ణి. ఇకమీద మీరు ఏ వర్తమానం పంపదలచినా నా స్నేహితుని దుకాణానికి పంపించండి. ప్రతి దినం ఎవరో వొకర్ని హెర్ థామస్ ఆఫీసుకు పంపడం క్షేమం కాదను కుంటాను."

బోసు యిచ్చిన లేఖను జేబులోపెట్టుకున్నాను. ఆయన్ని యథా ప్రకారం గదిలోపెట్టి తాళంవేసి, తాళం చెవిని మా ఆవిడకిచ్చి దుకాణానికి వచ్చాను. సుమారు 12 గంటలవేళ హెర్ థామస్ షాపుకు వెళ్ళాను. అతను అప్పుడే బయటికివచ్చి, ఇంటికి వెళ్ళబోతున్నాడు. నేను తిన్నగా అతని దగ్గరకే పోయి హెర్ థామస్‌ను చూడాలన్నాను. ఆయనతో అర్జెంటు పనివున్నదని చెప్పాను. హెర్ థామస్ నన్ను లోపలికి తీసుకు వెళ్ళాడు. "నేనే హెర్ థామస్‌ను" అన్నాడు. బోసుయిచ్చిన వుత్తరాన్ని ఆయన చేతికిచ్చి, "బోసుకోసం ఏదైనా వుత్తరం వచ్చిందా?" అని అడిగాను. ఏమీలేదన్నాడు.

ఆవేళ మధ్యాహ్నమే హాజీ మా షాపుకువచ్చాడు. బోసుబాబు యోగక్షేమాలు అడిగి, "ఒక్కసారయినా ఆయనదర్శనం చెయ్యనియ్యి" అని ప్రాధేయపడ్డాడు. బోసుబాబును హాజీ కలుసుకొనడం నాకు యిష్టం లేదు. కాని, బోసుబాబు మా యింట్లోవున్నసంగతి హాజీకి తెలుసు. అందు చేత హాజీకి అసంతృప్తి కలిగించకూడదు.

"మీరు అడగడం బాగానేవుందిగాని, బోసుబాబు ఏమంటాడో తెలుసుకొని చెబుతాను. ఆయన అంగీకరిస్తే, మిమ్మల్ని ఆయన దగ్గరకు రేపు తీసుకువెడతాను" అని చెప్పి ఆయన్ని పంపివేశాను.

ఆరాత్రి మేము మళ్ళీ రాజకీయాలనుగురించి చర్చించుకున్నాం. రేడియోలో వార్తలు విన్నాం. తలవని తలంపుగా కలకత్తా రేడియోస్టేషను బ్రాడ్‌కాస్టు విందామని మీటర్ తిప్పాను. ఆసమయంలో బెంగాలీపాటలు పాడుతున్నాయి. బోసుబాబు ఒకక్షణం మాత్రంవిని, అది మానివేసి మరొక రేడియో స్టేషనుకు తిప్పమన్నాడు. "సంగీతం బాగానే వుందే" అన్నాను. "బాగానే వుందిగాని, నాకు తప్ప ఇక్కడ ఇంకెవ్వరికీ ఈభాష రాదు. అందుచేత మీ పొరుగు యిళ్ళవారు అనుమానిస్తారేమో?" అని బోసు బాబు అన్నాడు.

## కొత్త చిక్కు

మరునాడు 6 వ తారీఖున మాకు అమితంగా కలత కలిగించిన సంఘటన జరిగింది. మేమంతా ఉదయాన టీ తీసుకుంటున్నాం. మా మేడ కింది భాగంలోవుంటున్న పెద్దమనిషి, మిద్దెమీదికి పోతూ మా భాగం లోకి రావడం తటస్థించింది. మేమంతా వసారాలో కూర్చున్నాం. ఆ ప్రక్కనుంచే మెట్లు పైకివున్నాయి. అతను మమ్మల్ని చూచిన తరువాత గాని అతను పైకి వచ్చిన సంగతి మాకు తెలియదు. ఈ తప్పు అంతా మా చిన్నమ్మాయిది. మేము బోసు వుంటున్న గది తలుపును ఎప్పుడూ మూసే వుంచేవాళ్ళం. ఆవేళమాత్రం మా చిన్నమ్మాయి తలుపు వెయ్యడం మరచిపోయింది.

మా క్రింది వాటాలో వుంటున్న పెద్దమనిషిని "ఆర్" అని పిలిచే వాళ్ళం. బోసు బాబును చూడగానే 'ఆర్' ముఖం తెల్లబడిపోయింది. ఒక క్షణం కొయ్యబొమ్మలాగ నిలబడిపోయాడు. అతను బోసుబాబును గుర్తు పట్టాడని నా నమ్మకం. బోసు బాబుకుకూడా జంకుపుట్టింది. 'తలుపుతెరచి వుంచడం పెద్ద పొరపాటు' అని బోసుబాబు విచారపడ్డాడు.

'ఆర్' గారిని నేను బాగా ఎరుగుదును. ఆయన బోసు బాబును గుర్తించివున్నప్పటికీ, మాకు అపకారం కలిగించేపని ఆయన చెయ్యడని నానమ్మకం. ఆయన నాతో చాలాసార్లు బోసు బాబు అంతర్ధానం గురించిన కథల ప్రసక్తి తెచ్చేవాడు. భారత స్వాతంత్ర్యం గురించి మేము ఎన్నో కబుర్లు చెప్పుకొనేవాళ్ళం. నిజానికి, బోసుబాబును గుర్తించడం ఎవరికయినా చాలాకష్టమే, గడ్డం పెంచాడు గనుక. కాని, ఆ సమయంలో బోసుబాబు కళ్ళజోడు పెట్టుకొని వుండడంచేత, ఆర్‌గారు ఆయన్ని గుర్తుపట్ట గలిగాడు.

నేను దుకాణానికి వెడుతూ దారిపొడుగునా "ఇందువల్ల ఏం ప్రమాదం వస్తుందో?" అని ఆలోచిస్తూనే వున్నాను. ఆర్‌గారు ఎవరినైనా సలహా అడగడానికి వెళ్ళాడాఅనికూడా భయపడ్డాను. ఆవేళనంతా బజారులో, కాలుకాలిన పిల్లిలాగ, తిరుగుతూ, ఎప్పుడూలేనిది ఆర్‌గారి స్నేహితులను చూచాను. వాళ్లుగాని నన్ను బోసుబాబు గురించి ఏమైనా అడుగుతారేమో చూద్దామని నా వుద్దేశం. కాని, వాళ్ళద్వారా నాకు ఏ సమాచారం తెలియలేదు.

## 'ఆర్' గారికి పెద్ద జబ్బు

ఆ సాయంత్రం బోసుబాబు దర్శనం చేయించడానికై హాజీని మా యింటికి తీసుకువచ్చాను. నేను ఇంటిలో అడుగుపెట్టానో లేదో, ఆర్‌గారు చాలా జబ్బుపడ్డాడని చెప్పారు. ఆయనను రక్తగ్రహణి పట్టుకున్నదనీ, కొంతసేపు స్పృహలేదనీ చెప్పారు.

ఫిబ్రవరి 7 వ తేదీ ఉదయం ఆర్‌గారువచ్చి, "ఈ యింటిలో ఒక్క క్షణం వుండలేను. నాకు భయంగావుంది. అందుకే జబ్బుపడ్డాను కూడా" అని అన్నాడు.

"మీరు భయపడ్డానికి ఈ యింటిలో ఏమీలేదే. ఇంతకీ, మనం ఈ యింటిలో చాలాకాలంగా వున్నాముగా" అని ధైర్యం చెప్పాను.

"ఈ యింటిలో ఏ దెయ్యమో వున్నట్లు అనిపిస్తూంది. దానికి ఆగ్రహంపచ్చేపని చేసివుంటాను" అన్నాడాయన.

నాకు దెయ్యాలూ భూతాలూ అంటే నమ్మకం లేదనీ, ఆయన భయానికి మరొక కారణం ఏదయినా వుండితీరాలనీ వాదించాను. ఆయన భయానికి కారణం బోసు అవునో, కాదో? అని తేల్చుకోవాలని నా వుద్దేశం.

"దెయ్యాలంటే మీకు నమ్మకం వుండక పోవచ్చుగాని, నాకు నమ్మకంవుంది" అని ఆయనంటే, "అది అంతా వుత్తదిగాని అసలు కారణం చెప్పండి" అంటూ బలవంతపెట్టాను.


"అసలు సంగతేమిటంటే, ఈ యిల్లువదిలివేసి మరొకచోటుకు పోదామని మా ఆవిడ వేపేస్తూంది. ఇప్పటికి మూడునాలుగు రోజుల నుంచి మీ యింట్లో యిద్దరు కొత్తమనుష్యులు వుంటున్నారట. అందు చేత, ఇంకెంతమాత్రం యిక్కడ వుండడానికి ఆమె కిష్టంలేదు" అని చెప్పాడు.

"అవును నిజమే మా యింటికి ఇద్దరు అతిథులు వచ్చారు. వాళ్లు లగ్మన్‌నుంచి వచ్చిన మా బంధువులు. వారిలో ఒకడు యిక్కడికి వైద్యంకోసం వచ్చాడు. అతనుమాత్రం అస్తమానం ఇంట్లోనే వుండాలి గాని పైకి రాకూడదు. వాళ్ళు కొద్దిరోజులలో వెళ్ళిపోతా రనుకుంటాను. ఇంక, మీ ఆవిడకువున్న అభ్యంతరంగురించో అంటారా, ఈ యింట్లో వున్న స్త్రీ ఆవిడమాత్రమే కాదుగదా! నాకూ పెళ్లాం, పిల్లలున్నారుగా."

ఇలాగ చెప్పినప్పటికి ఆర్‌గారికి సంతృప్తి కలగలేదు "మీరు కోప్పడవద్దు. మీరు ఇలాగ అంటారనే మీతో నిజం చెప్పలేదు. ప్రస్తుతంలో నా ఆరోగ్యం చెడిపోవడంబట్టి నేను ఇక్కడ ఒక్కరోజు వున్నప్పటికీప్రాణం పోతుందేమోకూడా. మీరు అద్దెపోతుందేమోఅని విచారించ వద్దు. ఎప్పటిలాగే మీ అద్దె మీకు యిస్తూ వుంటాను" అని అన్నాడు.

## తిరిగి సత్రం మకాం

ఆ తరువాత, ఆర్ గారు వెంటనే ఇల్లు కాళీచేశారు. ఆయన వెళ్ళిపోయినందుకు నాకు ఒక విధంగా సంతోషమూ అయింది. మరొక విధంగా దిగులూ కలిగింది. ఒకవేళ ఘమ్మల్ని ఆయన పోలీసులకు అప్ప చెబుతాడేమో! ఆర్ గారుకూడా ఇంట్లోవుండగానే అటువంటి దేదయినా జరిగితే ఆయనకుకూడా ప్రమాదం తప్పదు. ఇప్పుడాయన వెళ్ళిపోవడంబట్టి, ప్రమాదంరాదు అనే నమ్మకంతో వుండలేను. ఆయన వెళ్ళిపోయిన తరువాత, బోసు బాబు రహమత్‌ఖాన్ కలిసి కొద్దిరోజులపాటు ఏ సత్రంలోనో మకాంపెట్టడం మంచిదని మేము నిర్ణయించుకున్నాం. రెండు మూడు రోజులలో గనుక ఏ చిక్కూరాకపోతే, వాళ్ళిద్దరూ తిరిగి రావచ్చు. నేను ముఖ్యంగా అనుకున్నదేమంటే, ఆర్ గారు ఏకొంటిపని అయినా [illegible], బోసు బాబుకు, రహమత్‌ఖాన్‌కూ ప్రమాదం రాకూడదని.



ఏ సత్రంలోనయినా గదిని ఏర్పాటు చెయ్యడానికి అమర్‌నాధ్‌నిచ్చి రహమత్‌ను పంపించాను. వాళ్ళిద్దరూ మూడు సత్రములు తిరిగి, ఒక దానిలో గది కుదిర్చారు. కొద్ది సామాను పుచ్చుకొని బోస్, రహమత్‌లు సత్రానికి వెళ్ళారు.

ఆర్‌గారు ఇల్లు విడిచి వెళ్ళిన మర్నాడు ఆయన స్నేహితు డొకడు నా దగ్గరకొచ్చి, ఆర్‌గారు ఇల్లు విడిచిపోవడానికి కారణ మేమి టని ప్రశ్నలతో వేధించాడు. ఆయన నాతో పోట్లాడాడా? ఆడవాళ్లు పేచీ పెట్టారా? నా కివేమీ తెలియవనీ, వెళ్ళి ఆర్‌గారినే అడిగితెలుసుకో మని పంపివేశాను.

ఆవేళ రహమత్‌ఖాన్ నాకోసం మూడుసార్లు వచ్చాడు. ఇటలీ రాయబారి దగ్గరనుంచి కబురు వచ్చిందేమోనని అడిగాడు. వర్తమానం వస్తే అమర్‌నాథ్‌ద్వారా పంపుతానని చెప్పాను.

నేను సాయంత్రం యింటికివచ్చాను. ఆర్‌గారి భార్య ఆవేళ మా యింటికి వచ్చిందట. ఆవిడ, మా ఆవిడ లోకాభిరామాయణం చెప్పుకోవ డంలో, మా యింటి అతిథులను గురించికూడా అడిగిందట. 'మీరు యిల్లు విడిచి వెళ్ళిపోయినందుకు పాపం వాళ్ళిద్దరూ ఎంతో నొచ్చుకుని' ఆవే ళనే స్వగ్రామం వెళ్ళిపోయారు. మీ ఆయన ఆ విధంగా చెయ్యడం ఏం బాగా లేదుసుమండీ!" అని మా ఆవిడ చెప్పిందట.

"మీరు అంత నొచ్చుకొనేలాగ మా ఆయన ఏమన్నారండీ?" అని ఆమె అడిగింది.

మా ఆవిడ, "ఆయన అంతకంటే ఇంకేమనాలి? ఇక్కడ వుండటం ఇష్టంగాలేదని మీరు అన్నారట. పగలు సయితం ఇంట్లోకూర్చునే అతిథి మా యింట వుండడం మీకు సమ్మతం కాలేదట!" అని చెప్పింది. ఈ మాటలువిని ఆమె విస్తుపోయింది.

"నేనేమీ అలాగ అనలేదండీ! అదంతా మా ఆయన అన్నదేగాని నాకేమీ తెలియదంటే నమ్మండి. అసలు మీయింట్లో యిద్దరు బంధువు లున్నట్టుకూడా నాకు తెలియదు."

"నా మాటలు మీకు నమ్మకం లేకపోతే, ఇంటికి వెళ్ళిన తరువాత మీ ఆయన్ని అడగండి" అని మా ఆవిడ చెప్పిందట.

"అడుగుతాను. కాని ఆయన ఆ విధంగా చెప్పివుంటే మన్నించండి" అని ఆవిడ చెప్పి కొంతసేపు వూరుకుంది. మళ్ళీ యిలా ప్రారంభించింది—

"కలకత్తానుంచి పెద్ద పేరుగల ఒకాయన—ఆయన పేరేదో మరిచిపోయాను—పారిపోయాడట."

"నేను విన్నానులెండి. ఈ సంగతులు రేడియోద్వారా రోజూ తెలుస్తూనేవుంటాయి. అయితేఇంతకీ సంగతేమిటి?" అని మా ఆవిడ అడిగింది.

"అబ్బే, ఏమీలేదు. ఊరికేనే, జ్ఞాపకంవచ్చి అన్నాను. నేనుకూడా రేడియోలో విన్నదే" అని ఆవిడ జవాబు. "గవర్నమెంటు ఆయనకోసం వెతుకు తున్నారనికూడా విన్నాను" అంది.

"గవర్నమెంటు ఆయనకోసం వెతకడానికీ, నాకూ సంబంధమేముంది?" అని మా ఆవిడ అడిగింది. ఆర్‌గారి భార్య తిరిగి వెళ్ళిపోయేటప్పుడు ఆవిడకు ఇల్లంతా చూపించింది మా ఆవిడ. ఇంట్లో ఇంకా ఆ బంధువులు వున్నారో? లేరో?చూద్దామని ఆవిడ రాకుండా ఈ పని చేసింది.

## బోసుకు వర్తమానం

తరువాత, 9 వ తేదీన ఇటలీ రాయబారి భార్యసినోరా కరోనీ మా యింటికి వచ్చి నాపేరు అడిగింది. నాపేరు చెప్పినమీద ఒక సీల్డు కవరు యిచ్చి యిలా చెప్పింది—"నేను ఇటలీ రాయబారి భార్యను. ఈ కవరును మీ స్నేహితునికియ్యండి. ఆయన మీతో వుంటున్నందుకు మాకు సంతసంగావుంది. క్రిందటిసారి హేర్ థామస్‌దగ్గరనుంచి మీ స్నేహితునికి కవరు తీసుకువెళ్ళినవారు మీరే అనుకుంటాను; మీ స్నేహితుని సమాధానం కోసం ఎల్లుండి వస్తాను."

ఆమె తెచ్చిన పుత్తరంలో యిలావుంది—"మీ పుత్తరం చేరింది. మీరు సత్రంనుంచి మీ స్నేహితుని యింటికి బస మార్చినందుకు సంతోషం. మీరు కోరిన ప్రకారం వర్తమానాలను మీ స్నేహితుని దుకాణానికి పంపిస్తూవుంటాను."

నేను రహమత్‌ఖాన్‌కు కబురుపంపి, అతను సత్రంనుంచి రాగానే ఈ కవరు యిచ్చాను. మా ఆవిడకు, ఆర్‌గారి భార్యకు జరిగిన సంభాషణ కూడా తెలియపరచాను.

ఆవేళకి మాకు ఆర్‌గారి సంగతేమీ తెలియలేదు. ఆర్‌గారు మా యింటినుంచి అంత అకస్మాత్తుగా ఎందుకు వెళ్ళిపోయాడో మా యిద్దరినీ ఎరిగిన స్నేహితులకు ఇంకా ఏమీ అర్థం కాలేదు. ఆర్‌గారు అందరికీ, "నాకు అకస్మాత్తుగా జబ్బుచేస్తే వెళ్ళిపోయాను" అని ఒకే సమాధానం చెబుతున్నాడు. నాకు పట్టుకొన్న చింత, ఆడవాళ్ళిద్దరికీ జరిగిన సంభాషణలనుబట్టి ఆర్‌గారు తన భార్యకు యావత్తు వృత్తాంతం చెప్పినట్టు గ్రాహ్యమవుతూవుంది.

ఫిబ్రవరి 10 వ తేదీ వుదయం నేను బజారుకు రాగానే ఆర్‌గారు తన చిన్నకూతురును ఎత్తుకొని వస్తూ కనిపించాడు. "మీరు బొత్తిగా కనిపించడం మా నేశారే. రెండు రోజులనుంచి మీకోసం చూస్తున్నాను. మీరు ప్రస్తుతం ఏ యింటిలో వుంటున్నారు" అని పలకరించాను.

"కొత్తయింటికి వెళ్ళినప్పటినుంచి జబ్బుగావున్నాను" అని అన్నాడు. కొత్తయిల్లు ఫలానాచోట వున్నదన్నాడు.

"మీరు మాయిల్లు విడిచి ఎందుకు వెళ్ళిపోయారో నాకు తెలుసు. అయితే, అది మీరు చెొననరుగాని, మీ ఆవిడ మా ఆవిడతో చెప్పిన దానినిబట్టి చూడగా మీకు జంకు పట్టుకుంది. మీరు సుభాస్ బాబును గుర్తు పట్టగానే మీ ముఖం తెల్లబారిపోగానే నేను సంగతి గ్రహించాను" అని నేను దాపరికంలేకుండా అనేశాను.

ఆయన అన్నది యిది—"మీకు నేను నిజం ఎలాగ చెప్పగలను చెప్పండి! ఆవేళ మీరంతా టీ తీసుకొంటూవుండగా వెంటనే బోసు బాబును గుర్తుపట్టాను. ఆఫ్ఘనిస్థాన్ ఇండియాకు సరిహద్దులోవున్న దేశాలలో ఒకటి గనుక, అనేకమంది రాజకీయ ప్రచారకులు ఇండియానుంచి ఇక్క

డికి పారిపోయిరావడం, ఇక్కడినుంచి మాస్కోకు పోవడం జరిగింది. అందుచేత, బోసుబాబు కోసం ఇక్కడ ఎలుక కన్నాలు సయితం వెతుకుతూ వుంటారు. మీయింటిలో ఆయన పట్టుబడితే ఏమి జరుగుతుందో నాకు తెలుసు. నాకు పసిపిల్లలున్నారు. అందుచేత, ఏం ప్రమాదం వచ్చినా తట్టుకోలేను. మిమ్మల్ని, మీ ఆవిడను ఎంత మెచ్చుకుంటున్నానో చెప్పలేను."

అప్పుడు నేను ఆయనతో యిలా అన్నాను—"మీరు తొందరపడి చేసిన పనివల్ల మాకు ఎంతో అపకారం జరిగింది. బోసుబాబుకు ఏమీ తోచలేదు. చాలా బాధపడి, ఆవేళనే వెళ్ళిపోయాడు. ప్రస్తుతం ఎక్కడున్నాడో, పాపం ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో నాకు తెలియదు."

నా మాటలకు ఆర్‌గారు విచారించి, "అయ్యయ్యో. ఎంతపని జరిగింది! అయిందేదో అయిపోయింది. ఇప్పుడు నేను చెయ్యగలిగిందేమిటో చెప్పండి" అన్నాడు.

"ఏమిటి చెయ్యగలం? ఆయన మాయింటినుంచి వెళ్ళిపోయాడు. ఆయన వుంటే ఇంకా పూళ్ళోనే వుంటాడు. ఒక సంగతిమాత్రం మరవకండి. ఆయన్ని యిక్కడ అరెస్టుచెయ్యడం జరిగితే, అందుకు మీరే బాధ్యులు. ఆ అపకీర్తి అంతా మీదే."

## 7

ఆర్‌ గారితో మాట్లాడ్డం జరిగిన తరువాత నేను షాపుకు వెళ్ళేసరికి మధ్యాహ్నం 12 గంటలయింది. నేను వెళ్ళానో లేదో రహమత్ ఖాన్ చికాకు పడుతూ లోపలికి వచ్చాడు.

"మరేమీ చిక్కురాలేదుగదా?" అని రహమత్‌ను అడిగాను. "బోసు బాబుకు అకస్మాత్తుగా జబ్బుచేసింది. ఆయనకు రక్త గ్రహణి

పట్టుకుంది. బజారులో ఎండురొట్టెలు, కబాబ్ తప్ప మరేవీ దొరకడం లేదు. అవి ఆయనకు సరిపడడంలేదు. ఏమి చేయడమో నాకు పాలు పోవడంలేదు. అధమం డాక్టర్ దగ్గరకు తీసుకువెడదామన్నా వీలుకాదు. మీ సలహాకోసం వచ్చాను'' అని రహమత్‌ఖాన్ అన్నాడు.

నాకుకూడా ఏమీ పాలుపోక యిలా అన్నాను—''నేను చెప్పగలిగిందేముంది? ఆర్‌గారి సంగతంతా మీకు చెప్పనే చెప్పాను. ఆయన మూలంగా ఏమి ప్రమాదం వస్తుందో ఇంకా తేలకుండావుంది. పోతే, బోసుబాబును ఈ పరిస్థితిలో సత్రంలో వుంచడంకూడా క్షేమంకాదు. ఇంకా అక్కడేవుంటే ఆయన వొళ్ళు పూర్తిగా చెడిపోతుంది. అందుచేత, మీ రిద్దరూ మళ్ళీ మా యింటికి వచ్చివెయ్యండి. ఇంటిదగ్గరే ఆయనకు మనమేదయినా మందుయిస్తే ఆరోగ్యం కలగవచ్చు.''

రహమత్‌ఖాన్ సరే నన్నాడు. చీకటిపడ్డ తరువాత 7 గంటలకు బోసుబాబుతో వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. సుమారు 7-30 గంటలకు వాళ్ళిద్దరూవచ్చారు. మా యింటి చుట్టుప్రక్కలవారి కెవ్వరికీ ఈ సంగతి తెలియలేదు.

బోసుబాబు చాలానీరసపడ్డాడు. రక్తగ్రహణి ఆయన్ని పీల్చి, పిప్పి చేస్తూవుండాలి. ఏమయితేయేం, కొద్దిరోజులు ఇంటిలోనే మందు యివ్వగా ఆయన యథాస్థితికి వచ్చాడు. మళ్ళీ మా యింటికి చేరడంచేత, బోసుబాబు, రహమత్‌ఖాన్ చీకుచింతా లేకుండా వున్నారు. ఇదివరకులాగే, నేను ఇల్లువదలి వెళ్ళేటప్పుడు బోసుబాబును గదిలోపెట్టి తాళంవేసేవాణ్ణి. ఇరుగుపొరుగు వారికి అలికిడి తగలకుండా మా ఆవిడ అన్నివిధాలా జాగ్రత్తపడేది. బోసుబాబు ఎప్పుడయినా దగ్గడం జరిగితేకూడా మాఆవిడ ఏదో ఒక వంకలో పెద్ద చప్పుడు చేస్తూవుండేది. ఆ చప్పుడు బోసు బాబు దగ్గిన ధ్వనిని మింగివేసేది.

అప్పటికి కాబూలులో మంచుపడడం తగ్గిపోయిందిగాని, చలి మాత్రం ఎక్కువగానే వుంది. అందుచేత, చుట్టుప్రక్కల యిళ్ళలోని

ఆడవాళ్లు ఉదయం కాగానే డాబాలమీదికివచ్చి ఎండలో కూర్చునేవారు. బోసుబాబు దగ్గితే వాళ్ళకు అనుమానం కలిగే ప్రమాదం లేకపోలేదు. మా ఆవిడ యుక్తులు ఆ ప్రమాదం లేకుండా చేసేవి.

## మాస్కోలో పేచీ

ఈ విధంగా వారంరోజులు గడిచిపోయింది. ఇటాలియన్ రాయబారి దగ్గరనుంచి ఏ వర్తమానం రాలేదు. రాయబారి భార్య సీనారా కరోనీ ఒకటి రెండుసార్లు మా దుకాణానికి వచ్చిందిగాని, ఏవర్తమానం తీసుకు రాలేదు. ఆమె వచ్చినప్పుడల్లా ప్యాసుపోర్టు గురించి అడిగేవాణ్ణి. "ఇంత కాలం ఎందుకు ఆలస్యమౌతూవుందో నాకు తెలియడంలేదు"అనేది ఆవిడ. ''ప్రతిదినం రోముకు కబురుచేస్తున్నాముగాని, ఆలస్యానికి అసలు కారణ మేమిటో బోధపడడంలేదు'' అని చెబుతూవుండేది.

బోసు బాబు కులాసాగా వున్నతరువాత రహమత్‌ఖాన్ మళ్ళీ బజారు వెంటపడ్డాడు. ఇటలీ రాయబారినుంచి సరియైన సమాచారం రాకపోవడం చేత, బోసు బాబు వారంరోజుల తరువాత సీనార్ కరోనీకి అందచెయ్య మని ఒక వుత్తరాన్ని హెర్ థామస్‌కు పంపమన్నాడు. అందులో ఆయన ఇలా వ్రాశాడు—''మిమ్మల్ని కలుసుకొని మూడు వారాలు కావస్తూంది. ప్యాస్‌పోర్టు ఏర్పాటుచెయ్యండని మాస్కోలోని మీ రాయబారికి కబురు పంపినట్టుగా మీరు తెల్పి పదిహేనురోజు లయింది. ఇంత ఆలస్యం ఎందుకు కావాలో అర్ధంకావడంలేదు. ఇక్కడ నేను చాలారోజులు వుండడం క్షేమం కాదనే సంగతి మీకు తెలుసుననుకుంటాను. అందుచేత, దయచేసి సాధ్యమైనంత త్వరలో ప్యాస్‌పోర్టు ఏర్పాటుచెయ్యవలసింది."

ఆ మరునాడే సీనారా కరోనీ వచ్చింది. ఆమె చేతికి బోసు వుత్తరం ఇచ్చాను. రెండవరోజున ఆమె సమాధానం తెచ్చింది. ఆమెద్వారా సీనార్ కరోనీ పంపిన వుత్తరంలో ఇలావుంది—''మీరుపంపిన వుత్తరం నక లును రోమ్‌కు పంపించాను. మీరు తెల్పినట్లుగా, కాబూలులో మీరు

చాలా రోజులు వుండడం మంచిదికాదని గ్రహించాను. కాని, ఈ విష యంలో నేను సయితం చెయ్యగలదేమీలేదు. ప్యాస్టుపోర్టు గురించి మాస్కోలో పేచీ వచ్చిందేమోనని నా భయం. రెండు రోజులలో అసలు సంగతి తెలిసిపోతుంది. మాస్కోనుంచి సమాచారం రాగానే మీకు తెలియ జేస్తాను.''

బోసు బాబు ఈ వుత్తరం చదువుకున్న తరువాత, "రష్యన్ రాయ బారిని కలుసుకోడానికి మీ ప్రయత్న మేమయింది?''అని నన్ను అడిగాడు. నా శాయశక్తులా ప్రయత్నించానుగాని లాభం లేకపోయిందని చెప్పాను. బోసు బాబుకు జరిగిన సంగతిని చెప్పాను—"మా దుకాణంలో రేడియో సెట్టు కొనడానికి ఒక రష్యన్ వచ్చాడు. అతనితో ఈ విషయం ప్రస్తావించడానికి ప్రయత్నించాను. కాని, రాజకీయాలను గురించి మాట్లాడ నన్నాడు. నేను ఏ ప్రశ్న అడిగినా సరిగా సమాధానం చెప్పలేదు. రష్య నులు వస్తూపోతూవుండే ఒకరిద్దరు షాపులవారిని కలుసుకొని, రష్యన్ రాయబారిని కలుసుకునేమార్గం చూడమని చెప్పాను. వాళ్ళ ప్రయత్నం ఫలించిందని అనుకోను.''

## వృధా ప్రయత్నం

ఇదంతా విని బోసుబాబు యిలా అన్నాడు—"అయితే ఒకపని చెయ్యండి. ఆ షాపుల యజమానులు మీకు బాగా తెలిసినట్లయితే, వాళ్ళ ద్వారా నా వుత్తరాన్ని రష్యన్ రాయబారికి అందేలాగ చెయ్యండి. రష్య నులు తరుచు మీ దుకాణాలకు వస్తుంటారు గనుక నా వుత్తరాన్ని రష్యన్ రాయబారికి పట్టుకువెళ్ళడానికి వాళ్ళకు అభ్యంతరం వుండకపోవచ్చు. అయితే, ఆ మనిషి స్వయంగా రాయబారికి యిస్తాడని తోచినట్లయితేనే పంపండి.''

తను ఇండియానుంచి తప్పించుకొనివచ్చిన ఉదంతాన్ని బోసు బాబు పూసగుచ్చినట్లు వ్రాశాడు. రోడ్డులో రష్యన్ రాయబారి మోటారు

కారును ఆపడం గురించికూడా ఉదహరించాడు. రష్యన్ రాయబారి బోసుకు ఇంటర్వ్యూ యివ్వవలసిందనీ, సమాధానాన్ని మా దుకాణానికి పంపవలసిందనీ వ్రాసి వుత్తరం ముగించాడు.

మా స్నేహితుల దుకాణాలకు వచ్చే రష్యనులద్వారా ఆ వుత్తరాన్ని రాయబారికి పంపాలని శతవిధాల శ్రమపడడం అయిందేగాని రష్యనులలో ఒక్కడుకూడా వుత్తరం తీసుకువెళ్ళలేదు. అప్పటికి రష్యా జర్మనీలమధ్య ఇంకా యుద్ధం ప్రారంభం కాలేదు. జర్మనులు దేశం తరువాత దేశం చొప్పున యూరప్‌లో జైత్రయాత్ర జరుపుతున్నారు. ప్రతివారం జర్మన్ రాయబారి కార్యాలయంలో విజయోత్సవమో, విందో జరుగుతుంటుంది. వీటికి రష్యనులు, ఇటాలియనులు, జపానువారు, ఇంకా యితరులు హాజరవుతున్నారు. రష్యన్ రాయబారికూడా అప్పుడప్పుడు వాలాయితీ తీర్చడానికి విందు లిస్తున్నాడు.

ఆ రోజులలో ఒక జర్మన్ దేశస్థుడు కాబూలులో రంగుల వ్యాపారం చేస్తుండేవాడు. నా స్నేహితులలో వొక రంగుల వర్తకుడుకూడా వున్నాడు. ఈ స్నేహితునిద్వారా ఇతని సమాచారం తెలిసింది. రష్యన్ రాయబారి కార్యాలయంలో జరిగిన విందు కొకదానికి ఈ జర్మన్ వర్తకుడు హాజరుకావడం, మరొకదానికి హాజరు కానుండడం నా చెవిని పడింది. అందుచేత, రష్యన్ రాయబారికి వుత్తరం యివ్వగలవా అని అడిగితే, మొదట సరే నన్నాడు. మరునాడువచ్చి ''రష్యన్ రాయబారితో జర్మనులు ఏ సంపర్కం పెట్టుకో కూడదని మా రాయబారి అడ్డుపెట్టుతున్నాడు'' అని చెప్పాడు. "రష్యన్ రాయబారితో జర్మనులకు పనివుంటే తనద్వారా జరగాలని జర్మన్ రాయబారి ఉత్తరువు చేశాడట. మీకు యిష్టమైతే మా రాయబారి నడిగి చెబుతాను'' అని ఆ జర్మన్ వర్తకుడన్నాడు.

ఇది నాకు యిష్టం లేకపోయింది. ఎందుకంటే, రష్యనులను కలుసుకోవాలని తన అభిమతమైన సంగతి ఇటలీ, జర్మనీ రాయబారులకు తెలియకూడదని బోసుబాబు అభిప్రాయం.

## ఇటలీనుంచి దూతలు

రెండురోజులు గడిచిన తరువాత ఇటలీ రాయబారి దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. అతను పంపిన సమాచారం యిది—''ప్యాస్‌పోర్టు గురించి మాస్కోలో పేచీ వచ్చివుంటుందని నేను మొదట అనుమానించి నట్లుగానే జరిగింది. మాస్కోలోని ఇటలీ, జర్మనీ రాయబారులు మీరు మాస్కోమీదుగా బెర్లిన్‌కో, రోమ్‌కో వెళ్ళడానికి గట్టిప్రయత్నం చేస్తు న్నారు. కాని, మాస్కోమీదుగా మీరు వెళ్ళడానికి రష్యన్ ప్రభుత్వం అనుమతించడం లేదు. అతికష్టంమీద మా రాయబారాలు మీ ప్రయాణానికి సన్నాహాలు చెయ్యగలిగారు. మీ కోసం రోమునుంచి దూతలు రానున్నారు. వారు రాగానే మీరు బయలుదేరవచ్చు. ఇప్పుడింక ఆలస్యం వుండదని అనుకుంటున్నాను.''

''ఈ దూతలు'' యెవరని బోసుబాబును అడిగాను. తనకు ప్యాస్‌పోర్టు సంపాదించడానికి ఇటలీ రాయబారులకు దుస్సాధ్యమై వుంటుం దనీ, అందుచేత ఎవరినో కాబూలుకు పంపించి ఆవచ్చిన వాని వేషంతో తనను మాస్కోమీదుగా పంపడానికి సన్నాహం చేసివుంటారనీ బోసు బాబు అనుమానించాడు.

ఈ ఆలోచనలతో మరొకవారం గడిచింది. ఇటలీ రాయబారి సినార్ కరోనీ భార్య సెనోరా కరోనీ రెండుమూడు రోజులకొక పర్యాయం మా దుకాణానికివచ్చి బోసుబాబు యోగక్షేమాలు అడిగి వెళ్ళుతూవుండేది. దుకాణంలో ఇంకా యితరు లెవరైనా వున్నట్లయితే, కొనడానికి వచ్చి నట్లు ఆవీయివీ కొని పట్టుకువెళ్ళేది.

ఇన్ని రోజులనుంచి ఇంటిలోనే కూర్చుని వుండడంచేత బోసు బాబుకుకూడా బజారులోకి వెళ్ళాలని బుద్ధి పుట్టింది. రహమత్‌ఖాన్‌కు కాబూలులో అన్ని వీధులూ, ప్రదేశాలూ తెలిసిపోయాయి. బోసుబాబుకు పఠాను దుస్తులు తప్ప మరేవీ లేవు. కాబూలు వాసుల దుస్తులలో బయటకు

వెళ్ళడం మంచిదని ఆయనకు చెప్పాను. నా ఫ్లానల్ దుస్తులు ఆయన కిచ్చాను. అవి ఆయనకు సరిగ్గా సరిపోయాయి. నా కాలి జోళ్ళుకూడా యిచ్చాను. అవిమాత్రం ఆయనకు బిగువయాయి.

అందుచేత, బజారుకు వెళ్ళి మొదట కాలిజోళ్ళు కొంటానన్నాడు. నా ఆఫ్ఘన్ టోపీకూడా పెట్టుకోగా ఆయన అచ్చంగా ఆఫ్ఘనునిలా వున్నాడు.

రహమత్‌ఖాన్, బోసుబాబులు బజారుకువెళ్ళి, జోళ్లు కొనుక్కొని, ఆ రోజంతా వూళ్ళో తిరిగారు. సాయంత్ర మయేసరికి మా దుకాణానికి వచ్చారు. అందరం కలసి ఇంటికి చక్కావచ్చాం.

## "ప్రొఫెసర్ జియావుద్దీన్"

రాత్రి కబుర్లు చెప్పుకొనడంలో బోసుబాబు యిలా అన్నాడు—

"మేము జోళ్లుకొన్న దుకాణం ఒక భారతీయునిది. మేము మాట్లాడు కొనే ధోరణినిబట్టి మేముకూడా ఇండియానుంచి వచ్చిన వాళ్ళమని కని పెట్టాడు. 'మీరు ఇండియానుంచి వచ్చినవాళ్ళు కాదండీ?' అని అడిగాడు ఆ షాపువాడు. అవునన్నాను. హబీబియా కాలేజిలో ప్రొఫెసరుగా వుంటు న్నానని చెప్పాను. నా పేరు జియావుద్దీన్ అనికూడా చెప్పాను. అతనికి ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే, హబీబియా కాలేజిలోని ప్రొఫెసరు లందరూ అతనికి తెలుసునట. నన్నెప్పుడూ చూడనేలేదట. నేను కాబూలుకు కొద్దిరోజులక్రితమే వచ్చాననీ, కాబూలు భాష తెలియక పోవడంచేత, బయటకు ఎక్కువ రావడంలేదనీ చెప్పాను. నాతో మాటల ధోరణిలో పడిపోయి, అతను జోళ్లు యివ్వడంకూడా మరచిపోయాడు. అతనితో అంతగా మాట్లాడడం మంచిదికాదని అనుకొని, అర్జెంటు పని వున్నట్టు వంక పెట్టి, జోళ్లుపుచ్చుకొని వచ్చివేశాను. మేము షాపువదలి వస్తుంటే, 'కొంచెం టీ తాగుదురుగాని రండి' అన్నాడు. 'పనివుంది పోవాలి'అని వినయంగా చెప్పివచ్చేశాను. పాపం, అతను హబీబియా కాలే జికి వెళ్ళి ప్రొఫెసర్ జియావుద్దీన్ ఎక్కడవున్నాడని అడుగుతాడేమో!"

ఈ కబుర్లలో ఒకసారి నేను బోసును "మాస్కోకు వెళ్ళడంలో మీ వుద్దేశం యేమిటి?" అని అడిగాను.

ఆయన తన అభిప్రాయాన్ని యీ విధంగా వివరించి చెప్పాడు—"తమలో ఒకరిపై వొకరు యుద్ధం చేసుకొనరాదని రష్యా, జర్మనీలు ఇప్పుడే ఒక ఒడంబడిక చేసుకున్నాయి. జర్మనీ బ్రిటనుతో యుద్ధానికి దిగింది. బ్రిటనుకు రష్యా శత్రురాజ్యం. భారత స్వాతంత్ర్య సాధనకై రష్యాద్వారా ప్రయత్నం చెయ్యడానికి ఇదే తరుణం."

రష్యా, జర్మనీలు ప్రస్తుతం యుద్ధం చెయ్యకపోయినా, వాటి లక్ష్యాలకు ఎక్కడా సామ్యంలేదని అన్నాను. మైత్రిగా వుందాం అనే వంకతో అవి రెండూ యుద్ధ ప్రయత్నాలను రహస్యంగా చేసుకొనడం లేదనే నమ్మకమేముంది అని చెప్పి, "రష్యా జర్మనీలకు యుద్ధంవస్తే, మిమ్మల్ని రష్యాలో బ్రిటనుకు వ్యతిరేకప్రచారం చెయ్యనిస్తారా"? అని అడిగాను.

రష్యా, జర్మనీల మైత్రి ఆట్టేకాలం వుండక పోవచ్చుననీ, అవి రెండూ యుద్ధం చేసుకున్నా చేసుకోవచ్చుననీ బోసు అంగీకరించాడు. ఇంకా యిలా అన్నాడు—"కాని, ప్రపంచ రాజకీయ పరిస్థితులు అనుక్షణం మారిపోవచ్చు. రేపు యేమి జరుగుతుందో చెప్పడానికి సాధ్యంకానంత వాయువేగంతో రాజకీయ రంగం మారిపోతూవుంది. రష్యా, జర్మనీలు స్నేహపూర్వకమైన ఒడంబడిక చేసుకుంటాయని ఎవరూ అనుకోలేదు. కాని, అదే జరిగింది. ఒకవేళ రష్యా, జర్మనీలు ఒకరి నొకరు మోసం చెయ్యాలనే తలంపుతో వున్న వనుకున్నప్పటికీ, బ్రిటిష్‌వారు కూడా రష్యనులకు మిత్రులుకారు. బ్రిటనుపై నేను వ్యతిరేక ప్రచారం చెయ్యడానికి రష్యనులు అంగీకరిస్తారని నా నమ్మకం."

## ఐరిష్ సామ్యం

"కేవలం ప్రచారంద్వారా ఇండియాకు స్వాతంత్ర్యం వస్తుందని మీ నమ్మకమా?" అని అడిగాను.

అందుకు ఆయన ఇలా అన్నాడు—"ఇండియాలో విప్లవం బయలు దేరి, రక్తపాతం జరిగి, మెడపట్టి గెంటేవరకు బ్రిటిష్‌వారు ఇండియాను వదిలి వెళ్ళరని నా అభిప్రాయం. వారు మంచిగా, శాంతియుతంగా ఏదేశం నుంచీ వెళ్ళలేదు. ఐర్లెండు సంగతి యేమయిందో చూడండి. ఐరిష్ ప్రజలు, బ్రిటిష్‌ప్రజలు ఏక కుటుంబం వారని మరచిపోవద్దు. అయినప్పటికీ ఐరిష్ ప్రజలు 700 సంవత్సరాలు పోరాటం జరిపి, ప్రాణ త్యాగాలు చేసిన తరువాతగాని స్వాతంత్ర్యం పొందలేకపోయారు. అప్పటికికూడా బ్రిటిష్ వారు కొంచెం భాగం తమ వశంలోనే పెట్టుకున్నారు. అటువంటప్పుడు బ్రిటిష్‌వారు ఇండియాను తమంతట తామే విడిచి వెళ్ళిపోగలరా? విదేశాలలో బ్రిటిష్ వ్యతిరేక ప్రచారం మూలంగా మనకు స్వాతంత్ర్యం రాజాలదనేమాట వాస్తవం. కాని, వారు ప్రస్తుతం చావోబ్రతుకో తేల్చుకొనే యుద్ధంలో తగుల్కొన్నారు. అందుచేత, నా ప్రచారం బ్రిటిష్ వారికి విధిగా అపకారం చేసితీరుతుంది."

"ఐర్లెండులో వచ్చినట్లుగా భారతదేశంలో విప్లవం రాదని అను కుంటారా?" అని అడిగాను.

అందుకు ఆయన యిలా అన్నాడు—"ఇండియాలో బ్రిటిష్‌వారు ఎటువంటి పరిస్థితులు సృష్టించారంటే, ఐర్లెండుకు వచ్చినట్లుగా విప్లవం రావడం అసంభవ మనేటటువంటివి సృష్టించారు. అంతేకాదు. ఒకవేళ విప్లవం వచ్చినా విదేశ సహాయంలేనిదే రావడం కల్ల. రష్యాలో సయితం విప్లవం రావడానికి జర్మనీ కారణమైంది. అమెరికా స్వాతంత్ర్యం పొందిందీ అంటే అందుకు కారణం ఫ్రాన్సు."

"అయితే, భారత స్వాతంత్ర్యం సంపాదించే నిమిత్తం రష్యా సహాయం పొందడానికి వెళ్ళుతున్నా రంటారా?" అని అడిగాను.

"అదే నా ప్రధాన అభిప్రాయము" అని బోసుబాబు అన్నాడు. "భారత దేశానికి సహాయపడమని రష్యాను అర్థించడానికి వెళ్ళుతున్నాను. ఇది

నావల్ల కాలేదన్నప్పటికీ, బ్రిటిష్ వ్యతిరేక ప్రచారం చేస్తూ వుండగలను. నేను ఇండియాలోనే వుండిపోతే, గవర్నమెంటు నన్ను యుద్ధం జరిగినంత కాలం జెయిలులో పెట్టేది. దేశంలోని నాయకులందర్నీ జెయిలులో పెట్టి తీరుతుందని గట్టిగా చెప్పగలను. జెయిలులో మగ్గేకంటె, విదేశాలకు పారిపోయి నాజన్మభూమి దాస్య శృంఖలాల విచ్ఛేదనానికి చెయ్యగలదంతా చెయ్యడమే ఉత్తమమార్గ మనుకున్నాను.''

''అయితే, మీరు యిక్కడనుంచి సరాసరి మాస్కోకు వెళ్ళడానికి అనుమతి లభించకపోతే ఏమి చేస్తారు?'' అని అడిగాను.

బోసుబాబు తన ప్లానును యీ విధంగా తెలియచెప్పాడు—''నేను బెర్లిన్‌కు వెళ్ళేటప్పుడు మాస్కోలో దిగి, ఆగడానికి ప్రయత్నిస్తాను. అది సాధ్యపడకపోతే, రోమ్‌నుంచి గాని, బెర్లిన్‌నుంచిగాని రష్యన్ రాయబారులద్వారా యేర్పాటు చేస్తాను. అక్కడైతే, రాయబారులను కలుసుకొనడం సులువు. ఏమైనా, త్వరగా మాస్కో వెళ్లాలని నా ఉబలాటం.''

నాకువున్న అనుమానాలను బోసుబాబుకు చెప్పాను. ఇటలీ, జర్మనీలు ఆయన రష్యాకు వెళ్ళడం సమ్మతించక పోవచ్చుననీ, ఆయనవంటి భారత నాయకుడు ఈ యుద్ధసమయంలో తమ చే జిక్కినప్పుడు వారు తమ స్వప్రయోజనానికి వుపయోగించుకోవాలని చూస్తారుగాని, రష్యాకు వెళ్ళనియ్యరనీ చెప్పాను.

బోసుబాబు యిలా అన్నాడు—''ఇటలీ, జర్మనీలు నన్ను రష్యాకు అంత తేలికగా వెళ్ళనియ్యరని నాకూ తెలుసు. కాని, మాస్కోకు వెళ్ళడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఈనాడు భారత స్వాతంత్ర్య సాధనకు సాహాయ్య పడగల దేశం ఏదైనా వున్నదా అంటే అది రష్యా వొక్కటే. మరి యేదేశం మనకు సహాయం చెయ్యదు. అందుచేతనే రష్యాకు తప్ప మరేదేశం వెళ్ళడానికి నాకిష్టం లేకపోవడం. ఈ యుద్ధ సమయంలో ఇండియా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోలేకపోతే, రక్త

పాతం జరిగి, విప్లవం వచ్చినప్పుడుతప్ప, 50 సంవత్సరాల వరకు స్వాతంత్ర్యం సున్న."

## నియంత అవసరం

భారతదేశంలో మత విభేదాలు నాటుకొనడం గురించి నేను ప్రసక్తి తేగా ఆయన యిలా అన్నాడు—"ఇండియాలో మూడవ పక్షంవారు, అంటే బ్రిటిష్‌వారు, వున్నంతకాలం ఈ విభేదాలు, కలహాలు తొలగవు. ఇండియాను ఎవడయినా నియంత 20 సంవత్సరాలపాటు పరిపాలించినట్లయితే, ఈ విభేదాలు సమసిపోతాయి బ్రిటిష్‌వారు ఇండియానుంచి వైదొలగిన తరువాత అధమం కొద్ది సంవత్సరాలవరకు అయినా డిక్టేటరు వుండడం అవసరం ఇంతకుతప్ప రాజ్యాంగనిర్మాణం ఏ విధంగా జరిగినా లాభంలేదు. మొదట డిక్టేటరు పరిపాలన రావడం ఇండియా మంచికే. డిక్టేటరు తప్ప మరెవ్వరూ మతకలహాలు లేకుండా చెయ్యలేరు. ఇండియాకు పట్టిన జబ్బు ఒకటికాదు. అనేకమైన రాజకీయ వ్యాధులు దానిని పీడిస్తున్నాయి. నిర్దాక్షిణ్యంగా పరిపాలన సాగించే డిక్టేటరు మాత్రమే భారత రుగ్మతలను కుదర్చగల వైద్యుడు అవుతాడు. ఇండియాకు కెమాల్ పాషా వంటివాడు కావాలి!"

తరువాత, "రష్యన్ రాయబారి మీకు సహాయం చెయ్యనని తనంతట తానే నిరాకరించాడా? లేక తన ప్రభుత్వ విధానాన్ని అనుసరించి అలా చేశాడా?" అని అడిగి, "మీ అభిప్రాయ మేమిటి?" అన్నాను. ఆయన యిలా చెప్పాడు—"నాకు అది ఎలా తెలుస్తుంది? ఒక్కసారి అయినా ఆయన్ని కలుసుకొనివుంటే, రష్యన్ ప్రభుత్వం ధోరణి యేమిటో తెలిసేది. రష్యన్ రాయబారి తనంతట తానే యీ విధంగా చేశాడనుకుంటాను. కాని, దీనికంతకూ నేను పారిపోవడానికి యేర్పాట్లు చేసిన వారిదే పొరపాటు.

"సోవియెట్ రాయబారితో సంబంధం వున్నవానిని నా వెంట పంపివుంటే, ఆ రాయబారి యీ విధంగా అనేవాడు కాదని నా నమ్మకం. నన్ను

మాస్కో-మీదుగా వెళ్ళనియ్యడానికి రష్యన్ ప్రభుత్వం అంగీకరించ లేదనడంబట్టి నాకు అనుమానం కలుగుతూవుంది. రష్యనులు నేను మాస్కోమీదుగా వెళ్ళడానికి ఎందుకు అంగీకరించరా? అని నా అనుమానం. నన్ను రానియ్యకూడదని రష్యన్ ప్రభుత్వం నిర్ణయించుకొని వుండవచ్చు. అయితే, మరొక అనుమానంకూడా లేకపోలేదు. రహమత్‌ఖాన్ కలుసుకున్నప్పుడు రష్యన్ రాయబారి నాకు సహాయపడనన్నాడు. అంటే, ఈ విధంగా ఇతరులకు సహాయపడవద్దని రష్యన్ ప్రభుత్వం అంతకుముందు చెప్పివుండవచ్చు. ఆ తరువాత అతడు మాస్కోకు ఈ సమాచారం తెల్పివుండవచ్చు. అప్పుడు నాకు సహాయపడమని అతనికి కొత్త ఉత్తరువులు వచ్చివుండవచ్చు. నా అడ్రసు తెలియకపోవడంచేత అతను నాకు కబురు చెయ్యడానికి వీలు అయివుండదు. ఇటలీ, జర్మనీల రాయబారాలు రష్యాగుండా నా ప్రయాణం అనుమతించవలసిందని సోవియెట్ ప్రభుత్వాన్ని అడిగాయి. నేను బెర్లినుకో, రోమ్‌కో వెళ్ళడం యిష్టంలేక సోవియెట్ ప్రభుత్వం వారి కోరికలను తిరస్కరించి వుండవచ్చు. నేను మాస్కోకే రావాలని రష్యా అభిమతమై వుండవచ్చు. నాకు ఇదే సమంజసంగా కనిపిస్తుంది. కాని, నిజమేదో మనకు తెలియదు. అందుచేత ఊహించుకోవలసిందే."

బోసు బాబు నాతో 45 రోజులు వున్నాడు. ఇన్నిదినాలలో కూడా ఆయన అక్షరాజ్యాలపై ఒక్కటయినా సదభిప్రాయం వెలిబుచ్చడం నేను వినలేదు. బ్రిటిష్‌వారు అక్షరాజ్యాలను ఎంత అసహ్యించుకున్నారో ఆయనకూడా అంతగానూ అసహ్యించుకున్నాడు.

బోసు బాబు బెర్లిన్ చేరుకున్న తరువాతకూడా రష్యాకు వెళ్ళడానికి మరొకసారి ప్రయత్నంచేసి వుంటాడనే నా నమ్మకం. అయితే, ఆ ప్రయత్నం ఫలించివుండదు. చివరకు రష్యా-జర్మనీలమధ్య యుద్ధం రావడంవల్ల ఆయన ఆశ నిరాశ అయివుంటుంది. ఆయన 1941 మార్చి 28 వ తేదీన బెర్లిన్ చేరుకున్నాడు. జూన్ 22 వ తేదీన రష్యా, జర్మనీలమధ్య యుద్ధం ప్రారంభమైంది.

# 8

మరొకవారం గడిచినప్పటికీ ఇటాలియన్ రాయబారి దగ్గరనుంచి ఏ వర్తమానం రాలేదు. ఈ వారంరోజులలో ఇటలీ రాయబారి భార్య సీనోరా కరోనీ మా దుకాణానికి రెండుసార్లు వచ్చింది. రెండుసార్లు కూడా, ఇటలీనుంచి వస్తారనుకుంటున్న దూతలు రాలేదని చెప్పింది.



ఇటలీనుంచి దూతలు రావడంకూడా తెగ ఆలస్య మవుతున్నందుకు బోసుబాబు అమిత చికాకుపడుతున్నాడు. అయిన కేమీ పాలుపోవడం లేదు. పోనీ, కాస్త బజారులోకి వెళ్ళితే అయినా తోస్తుందేమోనని నేను చాలాసార్లు చెప్పిచూచానుగాని, ఆయన ససేమీ ఇల్లు కదలనన్నాడు.

ఒకరోజున హాజీవచ్చి బోసుబాబును తన యింటికి టీ తీసుకోడానికి ఆహ్వానించాడు. బోసుబాబు అది మొదలుకొని హాజీయింటికి తరుచు వెళ్ళుతూ కాలక్షేపం చేసుకొంటూ వుండేవాడు.

ఒకరోజున బోసుబాబు ఇలా అన్నాడు—"నేను ఇక్కడినుంచి వెళ్ళిపోవడానికి ఇటాలియనులు ఎప్పటికి ఏర్పాట్లు చేస్తారో తెలియకుండా వుంది. ఇదంతా చూస్తే ఆశ్చర్యం కూడా కలుగుతూవుంది. దూతలు ఇటలీనుంచి బయలుదేరనైనా బయలుదేరలేదు.

బోస్ బాబు పఠాన్ ఉడుపులలో.

నాకు చివరకు విసుగెత్తిపోతూంది. అసలు కాబూలుకు రావడంలోనే

పెద్ద పొరపాటు చేశానా ? అని అనిపిస్తూంది. ఏమైనా సరేగాని ఈ కూపం నుంచి బయటపడి తీరాలి. రష్యన్ సరిహద్దువరకు నాకు ఎవరినైనా తోడు పంప గలిగారంటే, ఏమైతే అయిందని సరిహద్దు దాటిపోతాను. ఒకవేళ రష్యనులు నన్ను జెయిలులో పెట్టినాసరే నాకు యిష్టమేగాని, ఇక్కడ పడి కుమిలి పోవటం దుర్భరంగా వుంది. రష్యన్ జెయిలులో వుంటేకూడా మాస్కో చేరగల అవకాశం లభించవచ్చు. మీరు ఎవరినైనా నాకు తోడు పంప గలిగితే చాలు. అతనికి ఎంతడబ్బు కావాలన్నా సరే సందేహించ కండి."

రష్యన్ సరిహద్దువరకు తోడు పంపడం ఒక పెద్ద పనికాదని చెప్పాను సరిహద్దుదాటి రష్యాలో దూరి, తిరిగి వచ్చినవాళ్ళను చాలా మందిని నే నెరుగుదును. అయితే, ఈ విధంగా తెగింపు చెయ్యడంలో ఎన్నో కష్టాలున్నాయని బోసుబాబుకు చెప్పాను.

"ఇంతకంటె అధ్వాన పరిస్థితిమాత్రం కలగదు" అని బోసుబాబు వెంటనే అన్నాడు. "రష్యనులు మహాచేస్తే నన్ను జెయిలులో పెడతారు. కాని, నేను జెయిలులోనున్న సంగతి రష్యన్ ప్రభుత్వానికి తెలియగానే నన్ను జెయిలునుంచి విడిచివేస్తారు" అన్నాడు.

ఈ సంగతి ఇదివరకే చెప్పివుంటే, రష్యాకు పారిపోవడం చాలా రోజుల క్రితమే జరిగివుండేదని చెప్పాను.

అంటే, బోసు యిలా చెప్పాడు—"ఇప్పుడైనా మించిపోయింది లేదు. మీరు నాకు తోడు చూడండి. రోడ్డు మ్యాపును పట్టుకు రావలసిందని రహమత్‌ఖాన్‌ను బజారుకు పంపించాను. మ్యాపు చూచుకొని రష్యన్ సరిహద్దుకు దగ్గరదారి తెలుసుకుంటాం."

## "ఎమ్" గారు

రష్యా, అఫ్ఘనిస్థాన్‌ల మధ్యసరిహద్దుగా హాంగోనది ప్రవహిస్తూంది. ఈ నదివరకు అనేకసార్లు వెళ్ళివచ్చిన ఒక మనిషిని నే నెరుగు

దును అయితే, ఇతను హాంగోనదిని దాటి రష్యన్ భాగంలోకి వెళ్ళిన వాడు కాదు. కాని, నదిని దాటి రష్యాలో దూరడం చాలా సులభమని నాతో చెబుతూవచ్చాడు. ఇతని పేరుకూడా నేను రహస్యంగా వుంచ వలసివుంది గనుక "ఎమ్" అని అంటాను.

నిజానికి 'ఎమ్' రష్యన్ సరిహద్దు ప్రాంతానికి చెందినవాడు. అక్కడ అతను ఎవరినో హత్యచేసి ఆఫ్ఘనిస్థాన్‌లో దాక్కున్నాడు. అతను ఆఫ్ఘనిస్థాన్‌కువచ్చి ఇరవై సంవత్సరాలయింది. ఇక్కడనే వివాహం చేసుకొని ఆఫ్ఘన్ పౌరుడైపోయాడు. ఒకప్పుడు ఎమ్ లారీలనుకూడా నడుపుతూ ఆఫ్ఘన్ సరిహద్దు ప్రదేశమైన పట్ కేసర్ అనే ప్రదేశంవరకు వేళ్లుతూ వుండేవాడు. ఈ ప్రదేశం హాంగోనదికి సమీపంలో వుంది.

అతను ఎంతో నమ్మకస్తుడు. కాని, ఆ సమయంలో డబ్బుకోసం చిక్కు పడుతున్నాడు ఆఫ్ఘన్ స్వాతంత్ర్య దినోత్సవాల సమయంలోచిన్న లాటరీ పెండాలుకట్టి, తద్వారా వచ్చిన డబ్బుతో ఆ సంవత్సరమంతా కాల క్షేపం చేస్తూండేవాడు. రాజకీయ పరిజ్ఞానం వున్న మనిషికంటె, ఇటు వంటి వాడే బోసుబాబుకు తోడుగా వెళ్ళడం క్షేమమని ఆలోచించాను.

ఎమ్ అప్పుడప్పుడు నన్నుచూచి పోతూవుండేవాడు, అతను ప్రపంచంలోని అనేక సంగతులు తెలిసినవాడు కావడంచేత, అతనితో మాట్లాడడం నాకు సరదాగానే వుండేది. ఎన్నోకథలు, విషయాలు చెబుతూ వుండేవాడు. నా దగ్గరకు ఎప్పుడువచ్చినా కాబూలు బజారులోవి తాజావార్తలు తెస్తూ వుండేవాడు.

సరిహద్దుదాటి రష్యాలోకి పారిపోవాలని బోసుబాబుచెప్పిన కొంత సేపటికే నేను బజారులో ఎమ్‌ను కలుసుకోవడం తటస్థించింది. నాతో అతవిని షాపువరకు తీసుకువెళ్ళి ఈ ప్రసక్తి తెచ్చాను. "ఆఫ్ఘన్‌స్థాన్‌లో మీరు ఏ యే ప్రదేశాలు చూచారండీ?" అంటూ ఆయనతో ఉపోద్ఘాతం ప్రారంభించాను.

"అదీ ఇదీ అననక్కరలేదు. ఆఫ్ఘనిస్థాన్‌లో నేను చూడని వూరు లేదు" అని తన సంగతి యెత్తుకొని, "స్వంతంగా లారీ వున్నవాడు ఆఫ్ఘనిస్థాన్‌లో అన్నిమూలలూ చూస్తాడు. నేను ఫతూర్, గజనీ, ఖాన బాద్, మొజర్ షరిఫ్, అంఖోయి, జలలాబాద్—యీ ప్రదేశాలన్నీ చూచాను" అంటూ తనుచూచిన మారుమూల ప్రదేశాల్ని వరసపెట్టి ఒక జాబితా అప్పచెప్పాడు.

"బాదక్‌షాన్ చూచారా?" అని అడిగాను.

## హాంగో నది

"అది చూడకేం. హాంగోనదివరకూ కూడా వెళ్లాను. ఆ నది అవతలనే రష్యా" అన్నాడు.

"అంటే అంఖోయి దిశగా ప్రవహిస్తుంది కాదూ? అది" అన్నాను.

"అవును అదే" అన్నాడు.

"అయితే, నది సమీపంగా నివసిస్తూ వుండేవారు తరుచు అటు నుంచియిటు, యిటునుంచి అటూ పారిపోతూ వుండాలి" అన్నాను.

"అవును. చాలామంది రష్యన్ భాగంలోకి పారిపోయి తిరిగి వచ్చేటప్పుడు బంగారం పట్టుకొస్తూ వుంటారు. ఆఫ్ఘన్‌స్థాన్‌నుంచి మేక తోళ్ళు ఎగుమతి చెయ్యడానికి వీలులేదని ఆఫ్ఘన్ ప్రభుత్వం నిషేధించిన సంగతి మీకు తెలుసుకదూ! కాని దొంగతనంగా సరిహద్దు ప్రాంతంలో ఈ తోళ్ళ ఎగుమతి జరుగుతూనే వుంటుంది. హాంగోనది ఇవతల నుంచుని అనేకసార్లు నేను రష్యన్ భాగాన్ని చూచేవాణ్ణి. దొంగతనంగా వ్యాపారం చేసేవాడు నాకొక స్నేహితుడు కూడా వున్నాడు. అతను అనేకసార్లు రష్యాలోకి వెళ్ళివచ్చాడు" అని ఎమ్ అన్నాడు.

"అంటే, రష్యాలోకి పారిపోవా లనుకున్నవాణ్ణి దొంగతనంగా పంపివెయ్యడానికి వీలువుంటుం దన్నమాటే" అన్నాను.

"ఓ. భేషుగ్గా పంపివెయ్యవచ్చు. మీకు వెళ్ళాలని వుంటే చెప్పండి. రెండు నిమిషాలలో మిమ్మల దాటేస్తాను. ఆ పూచీ నాది" అన్నాడు.

"అబ్బెబ్బె. నేను వెళ్ళాలని కాదు. నాకు అక్కడ పనేమి వుంటుంది? తెలుసుకుందామని అడుగుతున్నాను. అంతే. దానికేం గాని. రిష్యన్ సరిహద్దుకు దారులు ఏవేవి?" అనిఅడిగాను.

"ఒకదారి ఖనబార్ మీదుగా పీర్‌సాహెబ్ గోరీవరకు వెళ్లుతుంది. ఈ గోరీ హాంగోనదికి చాలా దగ్గరగా వుంటుంది. రెండవ దారి బుఖో మీదుగా వుంది. బుఖో అనేది హాంగో నదికి పది పన్నెండు మైళ్ళ దూరంలో మాత్రం వుంది" అన్నాడు.

"నదిమీద వంతెన వుందా? లేకపోతే, పడవలు వుంటాయా? నదిని ఏలాగ దాటుతూ వుంటారు?" అని అడిగాను.

"ఒక వంతెనవుంది. కాని. ప్యాస్‌పోర్టు లేనిదే దానిమీదనుంచి వెళ్ళడం కష్టం. సాధారణంగా రహస్యంగా వెళ్ళేవారు మషక్స్ (పెద్ద తోలు సంచులు) వరుసగాకట్టి, తెప్పమాదిరిగా తయారుచేసి, నదిని దాటుతూవుంటారు" అన్నాడు.

"ఈ విధంగా నదిని దాటడంలో పట్టు పడడంకూడా జరుగుతూ వుంటుందా?" అని ప్రశ్నించాను.

"చాలామంది ఇదేవిధంగా నదివి దాటుతూ, సరుకులను తీసుకొని పోతూనే వుంటారుగాని, ఇంతవరకు ఒక్కడుకూడా పట్టుబడినట్లు నాకు తెలియలేదు." అన్నాడు.

ఇంతవరకు సంభాషణ సాగించిన తరువాత అసలు విషయంలోకి వచ్చాను.

"ఇంత వివరంగా ఎందుకు అడుగుతున్నానో తెలుసా? కొద్దిరోజు లలో ఇక్కడికి నా స్నేహితు డొకడు ప్యాస్‌పోర్టులేకుండా వస్తాడు. అతనిని మీరు నది దాటించి, రష్యాలోకి పంపించి వెయ్యగలరా? మీరు

నాకు స్నేహితులు గనుక రహస్యం చెప్పాను. ఈ విషయాలు నాకు తెలియవు. మీ సలహా కావాలి" అని అడిగాను.

## గడ్డు ఘటం

"మరేమీ ఫరవాలేదు. మీ స్నేహితుని రమ్మని కబురు పంపండి. నాకంటె ఇటువంటి పనులు చాకచక్యంగా ఎవడు చెయ్యగలడు?" అన్నా డతను.

"మీరు ఎంతకైనా తగినవారని నాకు తెలుసు. కాని. ఈ పని మీరు అనుకుంటున్నంత సుళువైంది కాదు. ఆయన్ని అతిరహస్యంగా తీసుకు వెళ్ళాలి. పరమేశ్వరునికి సయితం అనుమానం తగలనియ్య కూడదు. నది దాటి రష్యన్ భాగంలో మా స్నేహితుడు అడుగుపెట్టేవరకు ఆయన్ని జాగ్రత్తగా తీసుకువెళ్ళాలి. చిక్కురానియ్యకూడదు. పొరపాటుగాని జరిగి పోయిందా అంటే మా స్నేహితుడు సర్వనాశనమైపోతాడు. అతనితోపాటు మీరుకూడా అరెస్టు అయితే, మీకు యావజ్జీవం జెయిలువాసం తప్పదు. మీ రివన్నీ ఆలోచించుకున్నారా? అని నా అనుమానం" అన్నాను.

ఇదంతా విన్నతరువాతకూడా ఎమ్ అతి ధీమాగా, "మీ స్నేహితుణ్ణి దాటించడం గురించి మీరేమీ ఖంగారుపడకండి" అన్నాడు.

భగవంతుడిపై భారంవేసి ఈపని చేద్దామన్నాడు. ఇందులో కష్ట మేమీలేదనీ, భగవంతుడు దయ తలిస్తే చిక్కులు రావనీ అన్నాడు.

"సరే. నా స్నేహితునికి కబురుపంపి యిక్కడకు రమ్మంటాను. అయితే, మీరు ఆయన్ని ఏ విధంగా తీసుకువెళ్లతారో చెప్పండి?" అన్నాను.

"మీ స్నేహితునికి పర్షియా భాషగాని, పుస్తో భాషగాని వచ్చునా?" అని అడిగాడు.

ఈదేశ భాష లేవీ ఆయనకు రావనీ, అయితే ఈ రెండింటిలో ఏదోవొక భాష వచ్చినవాణ్ణికూడా తీసుకురాగలడనీ చెప్పాను.

తరువాత యిలా అన్నాడు—"అది చాలు. పర్ష్యా భాషగాని, పష్తో గాని మాట్లాడగల ఆ మనిషికి హాజీవేషం వేస్తాను. నేను, మీ స్నేహితుడు కలిసి యుజ్బెక్ జాతి వారిలాగ వేషాలు వేస్తాం. మేము ముగ్గురం కలిసి యాత్రికులలాగ సజర్ షరీఫ్‌కు వెళ్లతాం. అక్కడ ఒకరాత్రి ఆగి, మరునాడు బుఖోకు బయలుదేరుతాం. బుఖోకు కొంచెం దూరంలో నాకు స్నేహితుడొక డున్నాడు. అతను రష్యనులతో వ్యాపారం చేస్తుంటాడు. మేము అతనిని కలుసుకుంటాం. ఇంక మిగతా పని అంతా అతను చేస్తాడు."

ఈ ప్లాను బాగా వుందనీ, నాకుకూడా ఇదేవిధంగా ఆలోచన తట్టిందనీ చెప్పి యిలా అన్నాను—"యుజ్బెక్‌ల వేషం మా స్నేహితునికి అతకదు. పఠాన్ వేషమైతే సరిపోతుంది. ఎందుకంటే, అతనితో కూడా వచ్చేమనిషికి పష్తోభాష మాత్రంవచ్చు. అయితే, ఖర్చులు ఏమాత్రం అవుతాయంటారు?" అని అడిగాను.

"లారీ ఖర్చులు, దారిలో సాదరు ఖర్చులు తప్ప మరేవీ కావు. అంఖోలీలో సయితం ఒక స్నేహితుని యింట్లో బసచేస్తాం. కాని, అతనికి మాత్రం ఏదైనా బహుమానం యిస్తే బాగుంటుంది. ఒక జత జోళ్ళు, ఒక లుంగీ కొని పట్టుకువెళ్ళుతాం. ఇవే ఖర్చులు. ఇంక, నాకు ఏదైనా యివ్వడం మీ యిష్టం. ప్రస్తుతం చిల్లిగవ్వయినా లేక యమయాతన పడుతున్నాను. నాకష్టం వుంచుకోకుని ఆశపడుతున్నాను" అన్నాడు ఎమ్.

## బేరం

ఆ తరువాత ఎమ్‌కు ఎంత యివ్వడమా? ఎలాగ యివ్వడమా? అనేది మాట్లాడుకున్నాం.

"బాగానేవుంది. ఇంత కష్టపడేటప్పుడు, మీకు యివ్వకపోతే యెలాగ? మీకు ఎంత కావాలో చెప్పండి?" అన్నాను.

"మీకు ఎంత న్యాయమని అనిపిస్తే అంత. కాని, ఏడువందల రూపాయలకో, ఆరువందల రూపాయలకో తగ్గకూడదు" అన్నాడు.

"ఏడువందల రూపాయలిస్తాను, కాని, ఒక షరతు. మొదట మీకు మూడు వందలిస్తాను. మా స్నేహితుడు హాంగోనదిని క్షేమంగా దాటినట్టు మీరు చీటీ పట్టుకురావాలి. అప్పుడు మిగతా డబ్బు యిస్తాను" అన్నాను.

"మీరు మొదట రెండువందలే యిచ్చినా ఇబ్బంది లేదు" అన్నాడతను.

అతను అలాగ అనడంతో నాకు మరింత ధైర్యం కలిగింది. "మీ యిష్టంవచ్చినట్టు కానియ్యండి అన్నాను. రేపటినుంచి ప్రతిరోజూ ఒక సారి కనిపిస్తూ వుండండి. ఎందుకంటే, మిమ్మల్ని ఇంకా అనేక సంగతులు అడగవలసి వుంటుంది" అని అన్నాను.

ఎమ్ సరేనని వెళ్ళిపోయాడు.

సాయంత్రం బోసుబాబుకు నేను ఎమ్‌తో మాట్లాడిన వృత్తాంతమంతా చెప్పాను. ఎమ్‌నుగురించి బోసుబాబు నన్ను ఎన్నోవిషయాలు అడిగాడు. ఆతని పని యేమిటి? ప్రవర్తన యెటువంటిది? బుద్ధి ఎలా పని చేస్తుంది? ఇత్యాది ప్రశ్నలడిగాడు. నాకు తెలిసినంతవరకు చెప్పాను. అప్పుడు బోసుబాబు యిలా అన్నాడు—"ఇటువంటివాడే మనల్ని రష్యాలోకి దాటించగలడు. ఇటువంటివాడు మనల్ని దగా చెయ్యడు."

రహమత్‌ఖాన్ బజారునుంచి ఆఫ్ఘనిస్థాన్ మ్యాపులు కొనితెచ్చాడు. ఇవి చూచిన తరువాత ఎమ్ చెప్పినమార్గం సరియైనదేనని మాకు నమ్మకం కలిగింది.

అందుచేత, ఇంక రెండుమూడు రోజులలో కాబూలునించి వెళ్ళిపోవాలని బోసుబాబు నిశ్చయించుకున్నాడు. రహమత్‌ఖాన్ స్వయంగా ఎమ్‌ను కలుసుకొని, అతను ఎటువంటివాడో కనిపెట్టాలని అనుకున్నాడు. అన్నివిధాలా జాగ్రత్తగా వుండాలని నాకుకూడా అనిపించింది. ఎందుకంటే, బోసు బాబుకు ఏమయినా ప్రమాదం జరిగితే నా జీవితకాలమంతా అవమానం భరించలేక కుమిలిపోవలసి వుంటుంది. అందుచేత, రహమత్‌ఖాన్‌కు ఎమ్‌ను చూపిస్తానని చెప్పాను.

# 9

ఎమ్‌ను కలుసుకోడానికి ఉదయం 11 గంటలకు బజారునకు రమ్మని రహమత్‌ఖాన్‌తో చెప్పాను. ఉదయం 10 గంటలకే ఎమ్ నా దుకాణానికి వస్తాడని నా ఉద్దేశం. రష్యన్ సరిహద్దు దాటించి రహస్యంగా పంపివెయ్య వలసిన నా యిద్దరు స్నేహితులలో ఒకడు అప్పుడే కాబూలుకు వచ్చాడని ఎమ్‌తో చెప్పాను.

"మిమ్మల్ని గురించి నా స్నేహితునితో చెప్పాను. అతను మిమ్మల్ని కలుసుకోవా లనుకుంటున్నాడు. అతను ఏ క్షణంలోనైనా ఇక్కడకు రావచ్చు. అతను వచ్చిన తరువాత మీరిద్దరు కలిసి ప్రయాణం గురించి ఆలోచించుకోవచ్చు. డబ్బుగురించి మీ రేమీ చింతపడవద్దు. ఎంతడబ్బు అవసరమైతే అంతా పట్టుకురావడానికి ప్రయత్నిస్తాను" అని ఎమ్‌తో చెప్పాను.

నేను ఎమ్‌తో యీ విధంగా భావికార్యక్రమం గురించి మాట్లాడుతున్న సమయంలో ఒక మోటారుకారు వచ్చి మా షాపుముందు ఆగింది. ఆ కారులోనుంచి సీనొరా కరోనీ వచ్చి, సరాసరి షాపులోకి వచ్చింది. ఈ సారి ఆమె వచ్చిన కారు చూడగా నాకు ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే, ఆమె ఎప్పుడు వచ్చినా, పసుపువర్ణం గల పెద్ద మోటారులో వచ్చేది. కాని, ఈసారి వచ్చిన కారు చిన్నది. పైగా, ఆమె స్వంతంగా డ్రైవ్ చేసుకొని వచ్చింది. సీనొరా కరోనీ బోసు యోగక్షేమాలు గురించి అడిగింది. ప్యాసుపోర్టు రాకపోవడం, దూతలు రాకపోవడం ఇవన్నీ బోసును పూర్తిగా విసిగించి వేశాయనీ, అసలు తను తప్పించుకొని పోవడానికి ఏర్పాట్లు జరుగుతాయా? జరగవా? అనికూడా సందేహిస్తున్నాడనీ ఆమెతో చెప్పాను.

"అబ్బెబ్బె. అలాగ అనుమానించడం పొరపాటు" అని ప్రారంభించి, ఆమె యిలా అంది—"మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. దూత

లను పంప వలసిందని మేము రోమ్‌కు ఎన్నో టెలిగ్రాములు పంపించాం. కాని, ఇంతవరకు సమాధానంరా లేదు. ఈ ఆలస్యమంతా ఎందుకు జరుగుతూవుందో మాకు తెలియకుండావుంది. ఇదంతా చూడగా, మా ఆయనకు (ఇటాలియన్ రాయబారి) కూడా చికాకు కలుగుతూవుంది. దయచేసి, మీరు బోసుతో చికాకు పడవద్దని చెప్పండి. కొద్దిరోజులలో యేర్పాట్లన్నీ పూర్తి అవుతాయి" అన్నది.

బోసుబాబు యిచ్చిన నోటును ఆమె చేతికిచ్చాను. అది తీసుకొని ఆమె వెళ్ళిపోయింది.

ఆ తరువాత 11-15 నిమిషాలకు రహమత్‌ఖాన్ వచ్చాడు. ఆయన్ని ఎమ్‌కు పరిచయం చేశాను.

వారి ప్రయాణంగురించి షాపులో మాట్లాడుకొనడం మంచిదికాదు. అందుచేత, రహస్యంగా మాట్లాడుకోడానికి వీలయిన చోటుకు వెళ్ళిపోయారు.

నేను సాయంత్రం యింటికి వచ్చిన తరువాత రహమత్‌ఖాన్ నాతో యిలా అన్నాడు—"నన్ను ఎమ్ తనయింటికి తీసుకువెళ్ళాడు. అక్కడ మా ప్రయాణంగురించి వ్యూహం నిర్ణయించుకున్నాం. సరిహద్దును రహస్యంగా దాటవలసిన ఇంకొక ఆయన మూడు రోజులలో యిక్కడకు వస్తాడని నేనుకూడా ఎమ్‌కు చెప్పాను. ఆయన వచ్చిన మరునాడు బయలుదేరి వెళ్ళుదాం అని చెప్పాను".

ఆ మరునాడు ఎమ్ మా దుకాణానికి వచ్చాడు. తనూ, రహమత్‌ఖాన్ కలిసి నిర్ణయించుకున్న ప్లానుగురించి చెప్పాడు.

ఎమ్‌కు నేను కొద్దిగా డబ్బుయిచ్చి, అంఖోలీలోవున్న అతని మిత్రునికి బహుమతి యివ్వడానికై జోళ్ళు, లుంగీ కొనమన్నాను.

## కొత్త సమస్య

ఆవేళ సాయంత్రమే మరొక సమస్య వచ్చిపడింది. నన్ను చూడడానికి పెషావరునుంచి ఒక స్నేహితుడు దుకాణానికి వచ్చాడు. అసలు ఆ

వేళనే పెషావరునుంచి వచ్చాడు. అతనిపేరు జీవన్‌లాల్. ఎండుద్రాక్ష పళ్ళు మొదలైనవి కాబూలునుంచి పట్టుకువెళ్ళి, ఇండియాలో వ్యాపారం చేస్తుంటాడు. ప్రతి సంవత్సరం సరిగా ఈ ఋతువులో వస్తుంటాడు.

మా సంభాషణలో "బోసు అంతర్ధానం గురించి ఇండియాలో ఏమనుకుంటున్నారు?" అని అతనిని అడిగాను. జీవన్‌లాల్ చదువు సంధ్యలు తెలిసినవాడు కాకపోవడంచేత, రాజకీయాలంటే ఆసక్తి వున్నవాడుకాడు. కాని, బోసు అంతర్ధానం గురించి మాత్రం ఇండియాలో ఆసక్తి లేనివాడెవడూ లేడు.

జీవన్‌లాల్ యిలా అన్నాడు—"బోసును బ్రిటిష్‌వారు జెయిలులో పెట్టివుంటారని నావుద్దేశం. బోసు ఎక్కడికో పారిపోయాడని బ్రిటిష్‌వారే ప్రచారం చేస్తున్నారని నా అనుమానం. ఎందుకంటే, ప్రజలు అది నిజమే అనుకుంటారు. ఆ విధంగా బోసును తాము ఏమిచేసినా యిబ్బంది వుండదని బ్రిటిష్‌వారి తలంపు అయివుంటుంది."

షాపును మూసివెయ్యడానికి వేళకూడా అయింది. కాని, జీవన్‌లాల్‌ను పంపివేసి ఇంటికి పోదామని షాపును మూసివెయ్యకుండా వుంచాను. జీవన్‌లాల్ ఎంతకీ వెళ్ళేటట్టు కనిపించలేదు. చివరికి షాపు కట్టివేసి, ఇంటివైపు దారి తీశాను. ఇదివరలో జీవన్‌లాల్ ఎప్పుడు వచ్చినా మా యింటికివచ్చి భోజనం చెయ్యమనేవాణ్ణి. అదేవిధంగా నేను మా యింటికి రమ్మంటానేమో నని వెంటపడ్డాడు. ఈసారిమాత్రం అతనిని ఆహ్వానించే పరిస్థితిలో లేను. ఈసంగతి అతనికి తెలియాలనిచూచాముగా, "ఈ రోజులలో భోజనానికి నాకు చెడ్డ యిబ్బందిగావుంది" అన్నాను.

"మా ఆవిడ జబ్బుపడింది. అందుచేత హోటలు నుంచి భోజనం పట్టుకు పోవాలి" అని అన్నాను. జీవన్‌లాల్‌కు అర్థమయింది.

మా యిల్లు చేరుకున్న తరువాత "లోపలికి రండి" అని మాటవరుసకు అన్నాను. "పాపం, మీ ఆవిడ జబ్బుపడివుంటే నేనుకూడా మీకు బాధ కలిగించలేను" అనిచెప్పి వెళ్ళిపోయాడు.

సరిహద్దుదాటి వెళ్ళిపోయే ప్లానులను గురించి ఇంకా ఆలోచించ డానికి రహమత్‌ఖాన్ మరునాడుకూడా ఎమ్‌ను కలుసుకుంటా నన్నాడు.

మరునాడు నేను దుకాణం తలుపు తెరిచానో లేదో, ఎమ్ వచ్చి రహమత్‌ఖాన్ ఎక్కడున్నాడని అడిగాడు. ఈ లోపుగా జీవన్‌లాల్ కూడా తయారయాడు. ఇంతకుముందే జీవన్‌లాల్‌కు ఎమ్‌కు పరిచయం వుంది. అందుచేత ఇద్దరు కలిసి సుమారు గంటసేపు లోకాభిరామాయణం చెప్పుకున్నారు. ఆ తరువాత రహమత్‌ఖాన్ వచ్చాడు. రహమత్‌ఖాన్ వచ్చి జీవన్‌లాల్‌ను చూడడంతోనే, నాకు కొత్తమనిషిగా నటించడం మొదలుపెట్టాడు. "అస్సలాం ఆలేకుం" అని నన్ను అభినందించి ఎమ్‌తో కలిసి వెళ్ళిపోయాడు.

ఎమ్ జూదగాడని జీవన్‌లాల్‌కు బాగాతెలుసు. కాని, రహమత్ ఖాన్ ఎవరో తెలియదు. అతనిని గురించి తెలుసుకోవాలని ఉబలాట పడుతున్నాడు. అతనెవరో చెప్పవలసిందని నన్ను అడుగగా, నాకేమీ తెలియదనీ, ఇంతకు ముందెప్పుడూ రహమత్‌ఖాన్‌ను చూడలేదనీ అన్నాను.

అందుపై జీవన్‌లాల్ యిలా అన్నాడు—"అతను ఎమ్‌కు స్నేహి తుడై వుండాలి. ఎమ్ విషయంలోమాత్రం జాగ్రత్త. అతనికి జూదమాడ డమే వృత్తి. ఇంక ఆ రెండవ వాడుకూడా జూదగాడులాగే వున్నాడు. వాళ్ళిద్దరూ కలిసి నిన్ను దగాచేసి డబ్బు లాగుతారేమో సుమీ!"

"నా విషయంలో నువ్వు విచారపడనక్కరలేదు"అని చెప్పాను, జీవన్‌లాల్‌కు.

మధ్యాహ్నం కాగా జీవన్‌లాల్ భోజనం చెయ్యడానికి వెళ్ళి పోయాడు. ఆ తరువాతనే రహమత్‌ఖాన్, ఎమ్‌లు తిరిగివచ్చారు. 'మేము జోళ్ళు, లుంగీ కొన్నాము, అన్నారు. తరువాత మేము ముగ్గురమూ కలిసి సత్రానికి సమీపంగావున్న బస్సు స్టాండుకు వెళ్ళాం. నజర్ షరీఫ్‌కు

బస్సులు ఎప్పుడు బయలుదేరుతాయో వాకబు చేశాం. ఒక బస్సు ఆవేళనే వెళ్ళిపోయిందనీ, మరొక బస్సు సుమారు మూడు రోజులలో బయలుదేరుతుందనీ చెప్పారు.

## జీవన్‌లాల్ తెచ్చిన పేచీ

నేను ఎమ్‌కు నూరురూపాయల నోటు యిస్తూవున్న సమయంలో జీవన్‌లాల్ చూడడం తటస్థించింది. నేను ఎమ్‌కు అంత డబ్బు యివ్వడంచూచి అతను నివ్వెరపోయాడు. వాళ్ళు అక్కడవుండగానే జీవన్‌లాల్ నన్ను చివాట్లుపెట్టడం ప్రారంభించాడు—"ఈ జూదగాళ్ళ మాయలో పడకు సుమీ! నీకు చెప్పలేమూ?" అని కసిరాడు. "నామాట నీకు లక్ష్యం లేదని తెలిసిపోయిందిలే. పోనీలే: నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. నీబాగు నీకే తెలుసుగాని. స్నేహితుణ్ణి గనుక నీకు చెప్పడంమాత్రమే నావిధి."


జీవన్‌లాల్ మాటలకు ఎమ్‌కు, రహమత్‌ఖాన్‌కు కూడా కష్టం వేసింది. అందుచేత, వెంటనే చిరాకుపడుతూ షాపునుంచి వెళ్ళిపోయారు. కాని, జీవన్‌లాల్‌మాత్రం నన్ను చివాట్లుపెట్టడం మానలేదు.

రహమత్‌ఖాన్ కూడా నిజంగా జూదగాడే అని జీవన్‌లాల్ నమ్మకం. నాకుమాత్రం 'ఇదేమి పీడరా?' అనిపించింది.

రహమత్‌ఖాన్ ఎవరో అతనికి నిజం చెప్పనా? వద్దా? అని నాలో నేనే తర్కించుకున్నాను. రహమత్‌ఖాన్ నాతో వుంటున్నసంగతి జీవన్‌లాల్‌కు చెప్పకపోతే ఒక ప్రమాదంవుంది. ఎందుకంటే మా ఇంటినుంచి దుకాణానికి వచ్చేదారిలోనే జీవన్‌లాల్ బసచేసే ఇల్లు వుంది. అందుచేత, మా ఇంటి చుట్టుప్రక్కల రహమత్‌ఖాన్ మరొకసారి జీవన్‌లాల్ కంట పడకపోడు. ఆప్రాంతంలో రహమత్‌ఖాన్ ఎందుకు వుంటున్నాడా? అని జీవన్‌లాల్‌కు మరింత అనుమానం కూడా కలగకపోదు. రహమత్‌ఖాన్ సంగతి సందర్భాలు నాకేమీ తెలియవని నటిస్తూవుంటే, నేను జూదగాళ్ళతో స్నేహం చేస్తున్నానని జీవన్‌లాల్ కాబూలులోని ఇతర భారతీయు

లతో చెప్పి, వాళ్ళకి రహమత్‌ఖాన్‌ను వేలుపెట్టి చూపిస్తాడేమో? మా యింటిలో అద్దెకువుండి వెళ్ళిపోయిన ఆర్‌గారు కూడా రహమత్‌ఖాన్‌ను చూచినవాడే. అందుచేత, రహస్య మనుకుంటున్నదంతా బట్టబయలు అయిపోవచ్చు.

ఆ పైన జీవన్‌లాల్ ఈ అనుమానాలతో మాదుకాణంనుంచి కదల కుండావుంటే, నేనుపని చేసుకోలేకుండా, ఊపిరి పీల్చుకోలేకుండా కావ వలసి వస్తుంది. ఈ విధంగా ముందు వెనుకలన్నీ ఆలోచించుకొని, జీవన్‌లాల్‌తో యిలా అన్నాను—"వాళ్ళ సంగతి సందర్భాలు తెలుసుకోకుండా, వాళ్ళ ముఖంమీదనే జూదగాళ్ళు అనడం పెద్ద మనిషి తరహాకాదు. ఎమ్ జూదగాడంటే ఒప్పుకుంటాను. కాని, ఆ కొత్తమనిషి గురించి నీకేమి తెలుసు? అతనికి నేను నూరురూపాయల నోటుయివ్వడం నువ్వు చూచి నంతమాత్రాన అతను దగాకోరని అనుకోవచ్చునా?"



జీవన్‌లాల్ యిలా అన్నాడు—"నేను మొదటిసారి చూచినప్పుడే ఎమ్ జూదగాడని నాకు తెలుసు. అతని స్నేహితుని ముఖలక్షణాలు కూడా జూదగాడని చెబుతున్నాయి. నేను నీ మంచికే చెప్పానుగాని, మరొకందుకు కాదు. మంచికిపోతే చెడ్డ యెదురువచ్చినట్టు, నీకు కష్టంగా వుంటే, నీ వ్యవహారాలలో జోక్యం కలిగించుకోనులే! నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో. నా కెందుకు?" అని ముఖం ముడుచుకున్నాడు.

"నా వ్యవహారాలలో నువ్వు కలగచేసుకున్నా సరే, కలగచేసుకోక పోయినాసరే, ఫరవాలేదుగాని, పాపం ఆ పెద్దమనిషిని ఆ విధంగా అవమానించడం మాత్రం బాగాలేదు."

"అయితే, అతను ఎవరో తెలియదని నువ్వు అనలేదూ? ఇప్పుడేమో అతను పెద్దమనిషి అంటూన్నావు. ఇంతకీ, అతనెవరు? అతనికి నువ్వు నూరురూపాయల నోటు ఎందు కిచ్చినట్లు?"

"అతనినిగురించి నీకు చెప్పకూడదు గనుక, అత నెవరో నాకు తెలియదని అన్నాను. ఏదో పనివుండి అతనికి డబ్బుయిచ్చాను. ఆ పనితో నీకు నిమిత్తం లేదనికూడా నాకు తెలుసు గనుక, నీకు అతనిని గురించి చెప్పలేదు" అన్నాను.

## పరమరహస్యం

అతను నిర్ఘాంతపోయి, ఒక్క క్షణం మాట్లాడలేక, తరువాత యిలా అన్నాడు—"ఇంతవరకు నువ్వు నా దగ్గర ఏ రహస్యం దాచలేదు. ఇది నాకు సయితం చెప్పకుండా దాస్తున్నావు గనుక, పరమరహస్యమై వుండాలి."

"అవును. పరమరహస్యమే. పైగా, నీకు చెప్పడం మూలంగా నాకు, చెప్పలేనంత అపకారం జరగవచ్చు. ఈ రహస్యం తెలుసుకున్నందువల్ల, నీకు లాభమూలేదు; పైగా, ఇది నీకు సంబంధించినదీ కాదు" అన్నాను.

ఇదంతా వినిన ఫలితంగా జీవన్‌లాల్‌కు మరింత అనుమానం కలిగింది. తాను ఎవ్వరికీ చెప్పనని, ఆ సంగతేమిటో తనకు చెప్పవలసింది అని మరీమరీ బ్రతిమాలాడు.

"సరే. బాగానేవుంది. చెబుతానుగాని, ఈరాత్రికి నన్ను ఆలోచించుకోనియ్యి. రేపు చెబుతాను" అన్నాను.

సాయంత్రం నేను ఇంటికి వెళ్ళిన తరువాత ఈ సంగతంతా బోసుబాబుతో చెప్పాను. ఆయన జీవన్‌లాల్ గురించి నన్ను ఇంకా వివరాలు

అడిగిన తరువాత యిలా అన్నాడు—"అతను వొట్టి మూఢుడులా వున్నాడు. అటువంటివాణ్ణి ఎన్నడూ నమ్మలేము."

కాని, అతనికి రహస్యం చెప్పకుండా వుంచడంలో ఏమి ప్రమాదం వుందో బోసు బాబుకు వివరించి చెప్పగా, యిలా అన్నాడు—

"అయితే మీ యిష్టంవచ్చినట్టు చెయ్యండి. గాని నాకు మాత్రం యిష్టం లేదు. నేను యిక్కడ మాహా వుంటే ఇంక రెండురోజులు మాత్రం వుంటాను. అతనికి ఈ సంగతంతా చెప్పక తప్పదు అంటే, నేను వెళ్ళి పోయిన తరవాత చెప్పండి."

నేను వెంటనే "సరే" అన్నాను. ఎప్పను కలుసుకోడానికి ఇంక నా దుకాణానికి రావద్దనీ, మరొక రహస్య స్థలం చూచుకోమనీ రహమత్ ఖాన్‌తో చెప్పాను.

మరునాడు జీవన్‌లాల్ మళ్ళీ మా దుకాణానికి వచ్చి రహస్యం చెప్పమని పట్టుకున్నాడు. "మా ఆవిడకు జబ్బుగా వుండడంచేత ఆలోచించుకోడానికి టైము లేకపోయింది" అని అతను మాట్లాడకుండా చెయ్యగలిగాను. గాని, అతనికి నా సమాధానం కోపం కలిగించిన సంగతి స్పష్టంగా కనిపించింది.

సాయంత్రం ఇంటికి వచ్చిన తరవాత, అప్పటికి మూడవరోజున కాబూలునుంచి బయలుదేరి వెళ్ళడానికి సన్నాహాలు పూర్తి అయాయని రహమత్‌ఖాన్ అన్నాడు. ప్రయాణానికి బస్సులలో సీట్లు రిజర్వు చేయించడమే తరువాయి.

జీవన్‌లాల్ మా దుకాణానికి మళ్ళీ మరునాడు వచ్చాడు. వచ్చి, రహస్యం చెప్పమంటూ వేధించడం మొదలుపెట్టాడు. నన్ను వేధించవద్దనీ, రహస్యం చెప్పకుండా వుండననీ అన్నాను.

## ఇటాలియన్ వర్తమానం

మేము ఈవిధంగా మాట్లాడుకుంటూ వుండగా సినొరా కరోనీ మా దుకాణానికి వచ్చింది. ఆమె నా చేతిలో రహస్యంగా కాగితం పెట్టడం

జీవన్‌లాల్ గమనించాడు. ఆమె చాలా ఉత్సాహంగా కనిపించడం చూచి, "ఏమిటివిశేషం" అని అడిగాను.

"ఈ కాగితంలోవున్న విషయం చదువుకున్న తరువాత మీకే తెలుస్తుంది" అన్నది.

"ఏర్పాట్లు అన్నీ పూర్తి అయాయా?" అని అడిగాను. అయాయని చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

సినొరా కరోనీ రాక జీవన్‌లాల్‌కు మరీ ఆసక్తి కలిగించింది. ఈ వ్యవహారమంతా యేమిటో తెలుసుకోవాలని అతని మనస్సు ఎంత పీకిందో చెప్పడానికి వీలులేదు.

సినొరా కరోని గురించి తెలుసుకోవాలని ప్రశ్నల వర్షం కురిపించి చివరకు యిలా అడిగాడు—"ఆమె నీ చేతికిచ్చిన కాగితం యేమిటి?"

"ఆమె నాకేమి కాగితం యిచ్చింది? ఆమె నాకేమి యివ్వలేదే! నీకు నిద్ర మత్తుగావుందా? లేక కలగంటున్నావా?" అన్నాను.

"నేను కలగనడంలేదు. తాగివున్నానేమో అనుకుంటే అదీలేదు. కాని, నేను యిక్కడికి వచ్చినప్పటినుంచి చూస్తున్న దానినిబట్టి నీవు చాలా మారిపోయినట్టు కనిపిస్తున్నది. నీవు చేసేపని నాకేమీ అర్థం కావడంలేదు. నీ సంగతంతా విచిత్రంగావుంది" అన్నాడు.

"నేను యిదివరకు లాగేవున్నాను. ఏమీ మారిపోలేదు. నీవు లేని పోనివన్నీ ఊహించుకొని బాధ పడుతున్నట్టున్నావు" అన్నాను.

జీవన్‌లాల్ బొత్తిగా వుండబట్టలేక, కొద్ది నిమిషాలలో వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోయినందుకు చాలా సంతోషించాను. ఎందుకంటే, సినొరా కరోనీయిచ్చిన వుత్తరంలో ఏమివుందో? అని నాలో తహతహ ఎక్కువయింది. అందులో ఇలావుంది—"మీకు నేను వర్తమానం పంపి చాలా రోజులయింది. విశేషాలు లేకపోవడంచేత, మీకు ఏమీ వ్రాసి పంపలేదు. కాని, ఈవేళ రోమ్‌నుంచి మంచి సమాచారం వచ్చింది.

దూతలు రోమ్‌నుంచి బయలుదేరారు. ఒక వారంరోజులలో యిక్కడకు రాగలరు. మీకు ప్యాసుపోర్టు యేర్పాటు చెయ్యడానికి మీ ఫోటో కావాలి గనుక, ఎల్లుండి ఉదయం 11 గంటలకు దరబ్‌మాన్ రోడ్డుకు రావలసింది. అక్కడ మీకోసం ఫలానా నంబరు గల కారు ఆగివుంటుంది. కారులో ఒక వ్యక్తి వుంటాడు. అతనితో ఏమీ మాట్లాడకుండా కారులో ఎక్కండి. కారు మిమ్మల్ని ఒక సురక్షిత ప్రదేశానికి తీసుకువెళ్ళుతుంది. అక్కడ మీ ఫోటోను తీస్తారు. తరువాత ఆకారు మిమ్మల్ని యథాస్థానంలో దిగబెడుతుంది. ఫోటో తీసినచోట మీరు డబ్బు యివ్వనక్కరలేదు."

నేను యిది చదువుతూవుండగా, ఎమ్ వచ్చాడు. రెండవ స్నేహితుడుకూడా (అంటే, బోసుబాబు) వచ్చాడా? అని అడిగాడు.

అతను ఇంకా రాలేదనీ, సాయంత్రానికి వస్తాడనీ చెప్పాను.

రేపే బయలుదేరవలసివుంటే, బస్సులో యీవేళనే సీట్లు సిద్ధం చేయించుకోవాలని చెప్పాడు.

ఆ స్నేహితుడు జబ్బుపడినట్టు కబురు వచ్చిందనీ, అందుచేత వెంటనే బయలుదేరడంకూడా మంచిదికాదనీ, అతను వచ్చిన తరువాత ఆలోచించుకుందామనీ ఎమ్‌తో చెప్పాను.

## 10

సాయంత్రం కొంచెం పొద్దుపోయిన తరువాత ఇల్లు చేరుకున్నాను. ఇటలీ రాయబారి పంపిన వుత్తరాన్ని బోసుబాబు కిచ్చాను.

బోసుబాబు ఉత్తరం చదువుకుని నా అభిప్రాయ మేమిటని అడిగాడు. "ఇటలీనుంచి దూతలు వచ్చేవరకు ఆగడమా? లేక ఎమ్‌తో సరిహద్దు దాటి రష్యాలో ప్రవేశించడమా? ఈ రెండింటిలో ఏమార్గం ఉత్తమమో

మీకే తెలుసు. పోనీ, ఎమ్‌తో వెళ్ళిపోడానికే నిశ్చయించుకున్నప్పటికీ మీరు ఇంకా మూడు రోజులు ఆగవలసివుంది" అని చెప్పాను.

మూడు రోజులు ఆగవలసిన అవసరమేమిటో బోసుబాబు అడిగాడు. నేను యిలా అన్నాను—"లారీలో సీట్లను ఈవేళనే రిజర్వుచేసి వుంటే రేపే మీరు వెళ్ళిపో గలిగేవారు. కాని, ఈ వర్తమానం వచ్చింది గదా అని ఆ పనిచేయలేము."

మేముచేసిన పనికి బోసు మెచ్చుకుని యిలా అన్నాడు—"అవును లెండి, మీరు మంచిపనే చేశారు. ఇంకా మూడురోజులు వుండవలసిన పక్షంలో ఇటలీ రాయబారికి నా ఫోటోగ్రాఫు యిచ్చినప్పటికీ ప్రమాదం వుండ దనుకుంటాను. ఏమార్గం అనుసరించడమో ఆలోచించుకోడానికి కావలసినంత వ్యవధివుంది. ఇటలీనుంచి మాటలు వచ్చేవరకు ఆగాలంటే ఇంకా పదిపన్నెండు రోజులయినా పడుతుంది. ఇటలీ రాయబారికి వచ్చిన వర్తమానంబట్టి చూస్తే, వాళ్ళు వారంరోజులలో వస్తారు. వాళ్ళు యిక్కడి నుంచి తిరిగి వెళ్ళిపోవడానికి మూడు నాలుగు రోజులయినా వ్యవధి వుంటుంది."

మాసంభాషణకు రహమత్‌ఖాన్ అడ్డువచ్చి, "ఈ ఆలోచన ఇంతటితో మానివేద్దాం. ఏ విధంగా వెళ్ళిపోవడమో ఆలోచించుకోడానికి మూడురోజుల సైమువుందిగా!" అన్నాడు.

అదే నేనూ అన్నాను. వెంటనే అందుకుని, "ప్రస్తుతం పట్టుకున్న సమస్య జీవన్‌లాల్‌ను తప్పించుకొనడం ఎలాగ అనేది. ఈ వేళ వాడు సీనోరా కరోనీని కూడా చూడడం జరిగింది. ఆమె నా చేతిలో ఈ పుత్తరాన్ని రహస్యంగా పెట్టడం కనిపెట్టి, అసలు సంగతేమిటో చెప్పమని జలగలాగ పట్టుకున్నాడు. అంతులేనన్ని ప్రశ్నలడిగాడు. నేను ఏ సంగతీ చెప్పక పోవడంచేత చిర్రూబుర్రూమంటూ కోపగించి చక్కాపోయాడు. వాడు వొట్టి తుంట, మనకొంప ముంచుతాడేమోకూడా" అన్నాను.

జీవన్‌లాల్‌ను నమ్మడం తన కెంతమాత్రం ఇష్టంలేదని బోసుబాబు చెప్పాడు. "ఇక్కడ ఎల్లాగనూ ఇంకా కొన్నిరోజులు వుండాలి గనుక ఏది మంచిదో అది చెయ్యండి. కాదూ కూడదు అతనికి చెప్పితీరాలి అంటే, చెప్పండి" అన్నాడు.

## జీవన్‌లాల్‌కు రహస్యం చెప్పాను

మరునాడు జీవన్‌లాల్ మా దుకాణానికి వచ్చాడు. "ఇంతవరకు రాకుండా వుండిపోయావే?" అని అన్నాను.

"ఎందుకు? వచ్చిమాత్రం ఏమి లాభం? ఆ రహస్య మేమిటో చెప్పనంటున్నావు. ఇప్పుడు నిన్ను ఇంకొక సంగతి అడుగుదామని వచ్చాను" అన్నాడు.

"అది ఏదయినా కొత్త సంగతా?"అని అడిగితే యిలా అన్నాడు—

"కొత్తది కాదు. ఆవేళ ఎమ్‌తో వచ్చాడే ఆ మనిషిగురించి అడుగుతున్నాను. ఈవేళ అతనిని హిందూ గుజార్‌లో చూశాను. అతను మీ యింటికి వచ్చాడా?"

దానిపై నేను యిలా చెప్పాను—"అతనిని గురించి నీవు మళ్ళీ అడగ వనుకున్నాను. అలాగ అనుకొనడం నాదే తప్పు. ఆ సంగతంతా నువ్వు అడగక వదలివేస్తే ఎంతయినా మంచిది. కాని, నీకు ఆరోజుకారోజు మతి పోతున్నట్టుంది. నీకు అనుమానం ఎక్కువవుతూంది. అసలు ఈ రహస్యమంతా ఒక రాజకీయ వ్యవహారానికి చెందిందని గుర్తుంచుకో. ఇందులో నువ్వు వేలు పెట్టావంటే జెయిలుకుకూడా పోగలవు. నీకు రాజకీయాలంటే ఆసక్తిలేదు గనుక ఆవిషయం అడిగకుండావుంటే నీకు క్షేమం. అది నీకు చెప్పడంవల్ల మనకిద్దరికి ప్రమాదం జరిగినా జరగవచ్చు. నీకు చెప్పడానికి భయపడుతున్నాను గనుకనే ఈ రహస్యం దాచాను. ఏదో ఒకరోజున నువ్వు నోరుజారి ఈసంగతి బయటపెట్టవని ఎవరికి నమ్మకం?"

తనకు ఎటువంటి ప్రమాదం వచ్చినాసరే, ఈ రహస్యం బయట పెట్టనని జీవన్‌లాల్ ప్రమాణం చేశాడు.

చిట్టచివరకు, బోసుబాబు నాతో వుంటున్నాడని జీవన్‌లాల్‌కు చెప్పివేశాను. హిందూ గుజార్‌లో అతనుచూచిన వ్యక్తి బోసుబాబు స్నేహితుడని చెప్పాను.

బోసుబాబు నాతో వుంటున్నాడనగానే జీవన్‌లాల్ ఆశ్చర్య చకితుడయాడు. నామాటల్ని నమ్మలేకపోయాడు.

"నిజమే? నిజమే?" అని ఆశ్చర్యపోతూ, సంగతంతా క్లుప్తంగా చెప్పమని పట్టుబట్టాడు. అతనికి ఎంతవరకు చెబితే సరిపోతుందో అంతవరకు చెప్పాను.

ఇదంతా విని జీవన్‌లాల్ బోసుబాబు దర్శనం చేయించమని ప్రాధేయ పడ్డాడు.

"ఆయన్ని చూపించమంటావని నాకు తెలుసు. అందుకే నీకు ఏసంగతీ చెప్పనన్నాను. అటువంటి మహావ్యక్తి ఎవరికిపడితే వారికి దర్శనమియ్యాలని నువ్వు పట్టుపట్టడం బాగుందా? నువ్వు మాటాడక ఊరుకుంటే మంచిది. నేను ఈ రహస్యం నీకు చెప్పినట్టు ఆయనకు తెలిస్తే ఇంకేమన్నావుందా?" అన్నాను.

కాని, జీవన్‌లాల్ మొండి ఘటం. బోసుబాబును చూపించితీరాలని ఒకటే పట్టుపట్టాడు. బోసుబాబు అంగీకరిస్తే అలాగే చేస్తామని అతనికి మాట యిచ్చాను.

## రెండు ప్రత్యామ్నాయాలు

ఆ రాత్రి పొద్దుపోయేవరకు నేను, బోసుబాబు, రహమత్‌ఖాన్ కలిసి ఏ మార్గం అనుసరించి కాబూలునుంచి పోవడమా? అని ఆలోచించుకున్నాం. ఇటలీ రాయబారి సహాయం తీసుకుని వెళ్ళడం మంచిదా? ఎమ్‌తో వెళ్ళి సరిహద్దుదాటి రష్యాలో దూరడం మంచిదా? ఇంతకుముందు ఈ

ప్రశ్న వచ్చినప్పుడల్లా బోసుబాబు యిలా అనేవాడు—"నేను మాస్కోకు తప్ప ఇంకెక్కడకూ వెళ్ళను."

ఆ రాత్రి మాత్రం బోసుబాబు మనస్సు కొద్దిగా మారినట్టు నాకు అనిపించింది. చివరకు మేము ఏదీ నిర్ణయించుకోకుండా రేపురాత్రి మళ్ళీ ఆలోచించుదా మనుకున్నాం.

తెల్లవారిన తరువాత బోసుబాబు రహమత్‌ఖాన్‌తోకలిసి ఫోటోగ్రాఫు తీయించుకోడానికి బయలుదేరాడు. బోసుబాబు మధ్యాహ్నం రెండు గంటలకు నా దుకాణానికి తిరిగివచ్చాడు. "హాజీ మిమల్ని టీ కి రమ్మన్నాడు" అని ఆయనతో చెప్పాను.

హాజీయింటికి వెళ్ళవలసిన టైము సాయంత్రం గం॥ 4-30 నిమిషాలు. ఇంకా సుమారు రెండుగంటలసేపు బోసుబాబు అటూ యిటూ తిరుగుతూ కాలక్షేపం చెయ్యవచ్చు. సాయంత్రానికి బోసుబాబు, రహమత్‌ఖాన్ కలిసి హాజీయింటికి వెళ్ళారు. ఆ తరువాత కొంతసేపటికి నేను వెళ్ళాను. నేను వెళ్ళిన సమయంలో బోసుబాబు హాజీ భార్యతో జర్మన్ బాషలో మాట్లాడుతున్నాడు. టీ తాగడం అయిన తరువాత హాజీ దంపతుల శెలవు తీసుకొని తిరిగివచ్చాం.

## 11

ఆరాత్రి మళ్ళీ ఆలోచన ప్రారంభించాం. ఎమ్‌తో వెళ్ళడం మంచిదని నేను, రహమత్‌ఖాన్‌కూడా బోసుబాబుకు సలహాయిచ్చాం.

రహమత్‌ఖాన్ యిచ్చిన సలహాయిది—"సరిహద్దుదాటి రష్యాలోకి వెళ్ళడం అనేక కష్టాలతో కూడుకున్న దనడంలో సందేహంలేదు. చాలా కాలం మీరు రష్యన్ జెయిలులో పడివుండవలసి రావచ్చు కూడా. కాని, ఈ విధంగా ఎన్నిచిక్కులు పడినప్పటికీ రష్యన్ ప్రభుత్వంతో సంబంధం పెట్టుకోడానికి మాత్రం అవకాశం వుంటుంది. మీరు రష్యన్ జెయిలులోవున్న

సంగతి తెలియగానే రష్యన్ ప్రభుత్వం మిమ్మల్ని మాస్కోకు తీసుకు పోతుంది. కాని, మీరు జర్మనీగాని, ఇటలీగాని వెళ్ళితే వారు మిమ్మల్ని రష్యాకు పోనిస్తారని నాకు నమ్మకంలేదు.

## బోసు నిర్ణయం

మా సలహా విన్నతరువాత బోసుబాబు యిలా అన్నాడు—"ఇటలీ రాయబారి దగ్గరనుంచి ఈ తాజా వర్తమానం రాకుండావుంటే, నేను ముమ్మాటికీ ఎమ్‌తో వెళ్ళిపోయి వుండేవాణ్ణి. కాని. నా ప్రయాణం గురించి ఇప్పుడు వాళ్ళు సన్నాహాలను పూర్తిచేస్తున్నారు. అటువంటప్పుడు వాళ్ళను దగాచెయ్యడం సమంజసం కాదు. అదీకాక, ఎమ్‌తో ప్రయాణం చెయ్యడంలో అనేక చిక్కులున్నాయి. రష్యన్ సరిహద్దు చేరకముందే నేను అరెస్టు అయిపోయినా అయిపోవచ్చును. ఇంక ఇటలీ, జర్మనీలో అంటే, నాపై ఈగవాలకుండా సురక్షితంగా తీసుకుపోగలవు. ఒకవేళ ఇక్కడ ఇంకా పదిరోజులు వుండిపోవలసి వచ్చినప్పటికీ ఇదే మంచిది కాదా? అంటాను. ఇంక, జర్మనీ, ఇటలీలు నన్ను మాస్కోకు వెళ్ళనియ్యవని మీ రిద్దరూ అంటున్నారు. మీకు అటువంటి పిచ్చి నమ్మకాలు వద్దు. నేను వెళ్ళక తప్పదు అనుకుంటున్నది మాస్కో. ఇక్కడనుంచి కంటె బెర్లిన్‌నుంచిగాని, రోమ్‌నుంచిగాని మాస్కో వెళ్ళడం సులువు. పోతే, మరొక ముఖ్య విషయంకూడావుంది. ఇక్కడి రష్యన్ రాయబారి నాకు సహాయపడ నన్నాడు. నేను రష్యామీదుగా వెళ్ళడానికి వల్ల కాదని రష్యన్ ప్రభుత్వం నిరాకరించింది. అందుచేత నేను రష్యాకు వెళ్ళడం వాళ్ళకు ఇష్టంలేదని కూడా అనుకోవచ్చు. అందుచేత వాళ్లు నేను రష్యాలో వుండడానికి అంగీరించకపోవచ్చు. అందుచేత, బెర్లిన్‌లోనో, రోమ్‌లోనో రష్యన్ రాయబారిని కలుసుకొని, నన్ను మాస్కోకు పంపగల రేమో కనుక్కుంటాను. వాళ్ళుకూడ వీల్లేదంటే నేను అక్షరాజ్యాలలో వుండక తప్పదు."

బోసుబాబు ప్లానుతో రహమత్‌ఖాన్ ఏకీభవించాడు. "మీరు చెప్పినది నిజమే. మీరు రష్యాలో వుండకూడదని వారని రష్యనులు భావిస్తే మీరు అక్కడకు వెళ్ళడం మంచిదికాదు" అన్నాడు.

చివరకు అక్షరాజ్యాలలోకి వెళ్ళడానికే బోసుబాబు నిశ్చయించుకున్నాడు. అందుచేత, ప్రయాణం నిలిచిపోయిందని ఎమ్‌కు తగిన కారణాలతో చెప్పాలన్నాను. ఏమైనాసరే అతనికి అనుమానం కలగకూడదని చెప్పాను. ఇకమీద రహమత్‌ఖాన్ ఎమ్‌ను కలునుకోకూడదు. "కాబూలుకు రావలసివున్న మిత్రుడికి జబ్బు మరీ ఎక్కువయింది. అందుచేత, ఇక్కడికి వచ్చిన అతనుకూడా వెనక్కి వెళ్ళపోయాడు" అని ఎమ్‌తో చెబుతా నన్నాను. "వారిద్దరూ తిరిగివచ్చిన తరువాత మరొకసారి ప్రయాణంగురించి మాట్లాడుకుందాం" అనికూడ ఎమ్‌కు నచ్చ చెబుతా నన్నాను. ఇది బాగానే వుందని బోసుబాబు అన్నాడు.

యథాప్రకారం మరునాడు ఉదయం 11 గంటలకు నేను దుకాణానికి వెళ్ళినతరువాత సీనోరా కరోనీ వచ్చింది. అదే సమయంలో జీవన్‌లాల్ కూడా అక్కడ వుండడం తటస్థించింది.

ఆమె నాకొక వుత్తరం యిచ్చి, బోసుబాబు ఫోటో సరిగానే పడ్డదని చెప్పింది.

## ప్యాసుపోర్టు సిద్ధం

ఇంతవరకు నేను జీవన్‌లాల్‌కు సీనోరా కరోనీ యెవరో చెప్పలేదు. ఇప్పు డామెనుగురించి కూడా చెప్పవలసి వచ్చింది, ఇటాలియన్ రాయబారి పంపిన ఈ వుత్తరంబట్టి బోసుబాబుకు ప్యాసుపోర్టు సిద్ధంగా వున్నట్లు తెలిసింది. కాని, ఇటాలియన్ దూతల కోసం మాత్రమే ఎదురు చూస్తున్నామని రాయబారి వ్రాశాడు. దూతలు మూడు నాలుగు రోజులలో రాగలరనీ, బోసుబాబు ప్రయాణానికి సిద్ధంగా వుండాలనీ అందులోవుంది.

ఇవి యిలా వుండగా జీవన్‌లాల్ నన్ను సైతానులాగ పట్టుకొని, బోసుబాబు దర్శనం చేయించ మంటున్నాడు. ఈ రోజులలో బోసుబాబు

ఎవరికీ కనిపించ నంటున్నాడని చెప్పాను. "కాని, నీవిషయమై ఆయనతో ఎంతో నొక్కి చెప్పి వొప్పించాను" అనే సరికి జీవన్‌లాల్ సంతోషం పట్టలేకపోయాడు. బోసుబాబుకు యివ్వడానికి కొన్నిపళ్ళు కూడా కొనితెచ్చి నాతో యింటికి వచ్చాడు. తను ఒక శుంఠలాగ బోసుబాబు దగ్గర ప్రవర్తించాడు.

ఇంకమొదలుకొని జీవన్‌లాల్ చాలాభాగం మాతోనే వుంటూ వచ్చాడు ప్రతిసంగతి చెప్పమని వేధిస్తూ వుండేవాడు. కాని, నీవువెళ్ళి ఈపని చేసుకురా! అని ఏదైనా చెబితే మాత్రం దానిని ఎగగొట్టే సాకు చెబుతూ వుండేవాడు. బోసుబాబు, రహమత్‌ఖాన్‌లతో కలిసి బజారుకు వెళ్ళడమంటేకూడా కంపించేవాడు. కాని, సినోరా కరోనీ మా దుకాణానికి వచ్చినప్పుడు మాత్రం తనకుకూడా బోసుబాబు వ్యవహారంతో సంబంధం వున్నట్టు డాబులు కొట్టేవాడు. నేను అరెస్టుకావడం, నన్నుఆఫ్ఘన్ ప్రభుత్వం దేశంనుంచి వెళ్ళగొట్టడం జరిగిన తరువాత కాబూలులోని వాళ్లు జీవన్‌లాల్‌ను బెదరగొట్టేవారు. అతను నా స్నేహితుడు గనుక, ఆఫ్ఘన్ ప్రభుత్వం అతనినికూడా వెళ్ళగొట్టవచ్చుననీ, అందుచేత కాబూలు నుంచి ఉడాయించమనీ సలహాయిచ్చేవారు. నేను ఇండియాకు చేరిన ఎనిమిది రోజుల తరువాత, అతనుకూడా ఇండియాకు రావడం, పోలీసువారు అతనిని జెయిలులో పడివెయ్యడం జరిగింది.

మేము బోసుబాబుకు సరిపోయేవి రెండు సూట్లు కుట్టించాలి. ఆయనకు నచ్చుతా యనుకున్నవి కొన్నిబట్టలు బజారునుంచి తెచ్చాము. వాటి నుంచి ఆయన రెండు ఏరుకున్నాడు. హాజీ ఎరిగున్న ఒక కుట్టుపు వాడి చేత సూట్లు కుట్టించాలని ఏర్పాటుచేశాం.

మరునాడు బోసుబాబు మాతో బజారుకువచ్చి ఒంటి గంటవరకు వున్నాడు. తరువాత హాజీయింటికివెళ్ళాం. కుట్టుపనివాడు వచ్చి బోసుబాబు కొలతలు తీసుకున్నాడు. కుట్టుపనివాడు ఒక్క వెయిస్టుకోటు తప్ప మిగ

లినవన్నీ సకాలంలోనే యిచ్చాడు. అందుచేత వెయిస్టుకోటును పార్సిలు చేసి జర్మనీలోని తన చెల్లెలి ద్వారా బోసుబాబుకు పంపిస్తానని హాజీ భార్య చెప్పింది. ఆమె అదేవిధంగా దానిని పంపించింది. ఆ తరువాత రెండు రోజులలోనూ మేము బోసు ప్రయాణానికి కావలసిన సరుకులన్నీ కొన్నాము.

## తుది సమాచారం

ఆ మరునాడు బోసుబాబు పుత్తరాన్ని రహమత్‌ఖాన్ తీసుకువెళ్ళి ఇటాలియన్ రాయబారికి పంపించాడు. అదేరోజున ఇటాలియన్ రాయబారి తన భార్యతో కూడా మా దుకాణానికి వచ్చారు. సీనోరా కరోనీ నాకొక వుత్తరంయిచ్చి "ఇదే ఆఖరు వుత్తరం" అని చెప్పింది.



బోసుబాబు తన వస్తువులన్నింటినీ ఒక సూటుకేసులో పెట్టి, మా దుకాణానికి పంపాలనీ, మార్చి 16వ తేదీన ఒక వ్యక్తి మధ్యాహ్నం 2 గంటలకు వచ్చి దానిని తీసుకువెళతాడనీ ఆ వుత్తరంలో వుంది.

"బోసుబాబు మార్చి 18 వ తేదీన బయలుదేరాలి" అని వుత్తరంలో వుంది. అందుచేత ఆమె నాతో యిలా అన్నది—

"మీరిద్దరు (నేను, బోసు) మా చిత్రకారుని దృష్టిలో కన్నద్దాయిలేని బోసుబాబు యింటికి మార్చి 17 వ తేదీ రాత్రి 8 గంటలకు రావాలి. అక్కడే భోజనం చెయ్యవచ్చు. ఆ తరువాత ప్రయాణం గురించి యితర వివరాలు చెబుతాం."

ఈ వుత్తరం వచ్చినప్పుడు బోసుబాబు హాజీ యింటిలో వున్నాడు. అక్కడకు ఈ వుత్తరం తీసుకువెళ్ళాను.

నేను చలోక్తిగా," నాకు ఏదైనా మంచి మిఠాయి పెడితే మీకు మంచి కబురు చెబుతాను" అన్నాను.

"ఈ రొట్టెముక్క తప్ప ఇంకేమీ లేదు" అని బోసుబాబు రొట్టె ముక్క పెట్టాడు.

"ఇక్కడ మీరు పడుతున్న యమయాతన ముగిసింది" అంటూ ఆ వుత్తరం యిచ్చాను.

ఆ వుత్తరం చదువుకున్న తరువాత బోసుబాబు "పరమానంద మైంది" అన్నాడు.

నేను ఇన్నాళ్ళనుంచి ఆయనకు సహాయపడ్డానని నన్ను ఎంతో మెచ్చుకున్నాడు. నేను ఆయన పాదాలపైపడి, ఆయనకు ఏమయినా అసౌకర్యాలు కలిగించి వుంటే మమ్మల్ని మన్నించమని వేడాను.

బోసుబాబు నవ్వి యిలా అన్నాడు—"అవును. నాకు బలే కోపంగా వుంది. ఎవరిమీద? మీ చిన్నమ్మాయిమీద. నేను భోజనం చేసేటప్పు డల్లా ఆ పాపాయి నా విస్తట్లో అంతులేకుండా రొట్టెలు గుమ్మరించేది. నేను రెండుతిని వూరుకుందామంటే నాచేత అయిదు తినిపించేది."

మేము హాజీ యింటినుంచి తిరిగి వచ్చేటప్పటికి రాత్రి పొద్దు పోయింది. మేము తిరిగి వచ్చేటప్పుడు హాజీ 17 వ తేదీన మళ్ళీ భోజ నానికి రమ్మని కోరాడు. బోసు అంగీకరించాడు.

మరునాడు (మార్చి 16) బోసుబాబు సామానులు ఒక సూటు కేసులోపెట్టి, నేను దుకాణానికి వచ్చేటప్పుడు తెచ్చాను.

ఆ వారంలో ఎమ్ మా దుకాణానికి రెండుసార్లు వచ్చాడు. మేము ఎదురుచూస్తున్న స్నేహితుడు వచ్చాడా? అని నన్ను వాకబుచేశాడు. ఈసారి మళ్ళీవచ్చి అడిగినప్పుడు, అతనికి జబ్బు మరీ ఎక్కువయిందనీ

రహమత్ ఖాన్ కూడా ఇండియాకు పోదా మనుకుంటున్నాడనీ, అందుచేత ప్లానులను మానుకున్నామనీ చెప్పాను. "నేను నీకు 400 రూపాయ లిచ్చాను.. కాలిజోళ్ళు, ఒక లుంగీమాత్రం కొన్నావు గనుక మిగిలిన డబ్బు యివ్వవలసింది" అని ఎమ్మెను అడిగాను.

అయితే, అతను తిరిగి యివ్వడం కల్ల అని నాకు తెలుసు. కాని "మిత్రుని పోగొట్టుకోవాలంటే అతనికి అప్పయిస్తే సరి" అనే సామెత ప్రకారం అతనిని వదిలించుకోవాలని నా యెత్తు.

సరిగా మధ్యాహ్నం 2 గంటలకు సీనొరా కరోనీ మా దుకాణానికి వచ్చి, సూటుకేసు అడిగింది. దానిని ఆమె కారులో పెట్టాను దానితో ఆమె వెళ్ళిపోయింది.

బోసుబాబు మా యింటిలో నిద్రపోయిన ఆఖరురాత్రి ఆపేళనే.

## 12

మరునాడు ఉదయం బోసుబాబు ప్రాతఃకాలపు భోజనంచేసి, మా పిల్లల్ని ముద్దులాడి పదకొండు గంటలకు ఇంటినుంచి బయలుదేరాడు. ఇక ఆవేళ మిగతా పొద్దంతా హాజీయింటిలో కాలక్షేపం చేశాడు.

హాజీయింటినుంచి సీనార్ కరోనీ యిల్లు చెరుకోడానికి పూర్వం బోసుబాబు తనటోపీ నాకుయిచ్చి, నేను పెట్టుకున్న కారాకలీ టోపీని తీసుకున్నాడు. ఎందుకంటే, ఆ టోపీ పెట్టుకున్నట్లయితే ఎవరూ ఆయనవైపు పరకాయించి చూడరు.

సీనార్ కరోనీ యింటిదగ్గర నేను ఆయనకు నమస్కారంచేసి యింటికి తిరిగివచ్చాను.

"జాగరూకులై వుండండి"—ఇదే ఆయన నాకిచ్చిన తుదిసలహా. తను బెర్లిన్ చేరుకున్నతరువాత బోసుబాబు నాకు తనప్రయాణం వివరాల్ని వ్రాస్తా నన్నాడు.

ఆ మరునాడు మార్చి 18 వ తేదీ ఉదయం 10 గంటలకు రహమత్‌ఖాన్ మా దుకాణానికివచ్చి. 9 గంటలకే బోసుబాబు కాబూలు నుంచి వెళ్ళిపోయినట్టు చెప్పాడు. బోసుబాబుతోకూడా ఇద్దరు జర్మనులు, ఒక ఇటలీవాడు వెళ్ళారు. బోసుబాబుకు యిచ్చిన ప్యాసుపోర్టులో ఆయన పేరు మజొట్టా అన్నారు.

బోసుబాబుతో కూడా వెళ్ళిన జర్మనులలో ఒకని పేరు డాక్టర్ వెల్లర్. అతను బహు తెలివితేటలైనవాడని హాజీద్వారా తెలుసుకున్నాను. అతనిని బోసుబాబుతో పంపడం బట్టి. ఆయన్ని జర్మనులు వదలిపెట్టరనీ, ఇటలీకి వెళ్ళనివ్వరనీ అర్థమయింది. ఇటాలియనులు, జర్మనులు మిత్రులుగా వుంటున్నప్పటికీ, మనస్సులలో మాత్రం ఒకరంటే ఇంకొకరికి పడదు. బోసుబాబు కాబూలువిడిచి వెళ్ళిపోయిన తరువాత, జర్మనులు, ఇటాలియనులను పూర్తిగా విడిచిపుచ్చి ఏదైనా విషయముంటే తమతోనే చెప్పవలసిందని మాకు చెప్పారు.

## మాస్కో మార్గాన బెర్లిన్‌కు

డాక్టర్ వెల్లర్ బోసుబాబును తిన్నగా బెర్లిన్‌కు తీసుకువెళ్ళాడు. వీరంతా మొదట కాబూలునుంచి రష్యన్ సరిహద్దువరకు మోటారు కారులో వెళ్ళారని సీనోరా కరోనీ చెప్పింది. ఆరాత్రి గడపను దారిలో బోసుబాబు. ఆగతాముగ్గురు పుల్‌ఖుమ్రి అనే చోట ఆగారు. ఇది కాబూలుకు రష్యన్ సరిహద్దుకు మధ్యవుంది. అప్ఘనిస్థాన్‌లోవున్న ఒకేఒక బట్టల మిల్లు ఇక్కడేవుంది మరునాడు వుదయం వీరు రష్యన్ సరిహద్దు దాటారు. మార్చి 20 వ తేదీన బోసుబాబు మాస్కోకు రైలులో బయలు దేరాడు. ఆవేళనే రహమత్‌ఖాన్ కాబూలునుంచి ఇండియాకు బయలు దేరాడు.

కొద్దిరోజులు పోయినతరువాత, కాబూలులోని జర్మన్ రాయబార కార్యాలయానికి బెర్లిన్‌నుంచి వచ్చిన ఒక పత్రికలో, బోసుబాబు బెర్లిన్

చేరినట్టు వార్తవుంది. దీనిని జర్మనులు నాకు హాజీద్వారా పంపించారు. పత్రికలో బోసుబాబు ఫోటో వుంది. దానికింద జర్మన్ భాషలో ఏదో వ్రాశారు. హాజీభార్య దానిని అనువదించి యిలా చెప్పింది—"ప్రముఖ భారత నాయకుడు, భారత జాతీయ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అయిన సుభాస్ చంద్ర బోసు కొద్దిరోజుల క్రిందట భారతదేశంనుంచి విచిత్రంగా తప్పించుకుని మార్చి 27 వ తేదీన క్షేమంగా బెర్లిన్ చేరాడు."

కొద్దిరోజుల తరువాత సీనోరా కరోనీ మా దుకాణానికి వచ్చింది. బోసుబాబు మాస్కోనుంచి బెర్లినుకు విమానంలో వెళ్ళాడని చెప్పింది. బోసుబాబు ఇంకా రోమ్‌కు వెళ్ళలేదనీ, కొద్దిరోజులలో వెళ్ళుతాడనీ చెప్పింది.

## బ్రిటిష్ సి. ఐ. డీ. దర్యాప్తులు

బోసుబాబు కాబూలునుంచి వెళ్ళిన కొద్దిరోజుల తరువాత ఒకవ్యక్తి నాకు బజారులో తటస్థపడ్డాడు. అతను బ్రిటిష్ సి. ఐ డీ. శాఖకు చెందిన వాడని ప్రతీతి. అతను నాతో యిలా అన్నాడు—"మీతో నాకు అత్యవసరమైన పనివుంది. నేను ఇప్పుడు మీ షాపుకే వెళుతున్నాను. వెతకబోయిన తీగ కాలికి తగిలినట్టు మీరే ఎదురయారు."


అతని మాటలకు నేను ఆశ్చర్యపడ్డాను. నాతో అతనికి పనియేమిటా? అని బిత్తరపోయాను. అతను కాబూలు రాజు ఆస్థానంలో పనిచేస్తున్న వాడు. పేరు బషీ సాహెబ్.

"నాతో పనేమిటండీ?" అన్నాను. "చాలా ముఖ్యమైన పనే. అయితే, అంత అగత్యమైనదికాదనీ చెప్పవచ్చులెండి. కాని, మీరు తప్ప ఇంకెవరూ నాకు ఈ సహాయం చెయ్యలేరు" అన్నాడతను.

అతను ఇలాగ అనడంతో నేను మరింత గాభరాపడ్డాను. అతను ఇంకా యిలా అన్నాడు—"ఈపని చేసి పెట్టవలసిందని ఇంకో యిద్దరు భారతీయులను అడిగాను. కాని, తమవల్ల కాదని అన్నారు. మీద్వారా ఈపని జరిగ గలదని వాళ్ళిద్దరూ చెప్పారు."

ఆ యిద్దరి పేర్లు చెప్పమని అతనిని అడిగాను. అతను "వారి పేర్లు యేవయితే యెందుకుగాని నాకు కావలసిన పనియిది. జర్మనీలో ఆఫ్ఘన్ రాయబారి ఖాన్ అల్లా నవాజ్‌ఖాన్ బెర్లిన్‌లోవున్న సంగతి మీకు తెలుసు కదూ? ఆయన నాకు స్నేహితుడు. ఆయన ప్రతి సోమవారం బెర్లిన్‌నుంచి టెలిఫోన్‌లో ఆఫ్ఘన్ రాజుతో మాట్లాడుతూ వుంటాడనికూడా మీకు తెలుసుకదూ?" అన్నాడు.

నేను యిలా అన్నాను—"ఖాన్ అల్లానవాజ్ బెర్లిన్‌లో ఆఫ్ఘన్ రాయబారి అనే విషయం నాకు తెలుసు. టెలిఫోన్ సంభాషణల సంగతి నాకు తెలుసునని మీరు ఎలాగ అనుకోగలరు? ఆ సంగతి నాకు తెలియడం ఇదే మొదటిసారి."



"మీకు తెలియకపోవచ్చుగాని, కాబూలులో అందరికీ తెలుసు. దానికేం; గత సోమవారం ఆయన టెలిఫోన్‌లో నాతోకూడా మాట్లాడాడు. ఇద్దరు భారతీయులు ఇండియానుంచి తప్పించుకొనిపోయి కాబూలులో దాగుకొన్నారని ఆయన చెప్పాడు. ప్రస్తుతం వాళ్ళిద్దరూ హిందూపేటలో ఒక హిందువు యింటిలో రహస్యంగా వున్నట్టు కూడా ఆయన చెప్పాడు. ఇక్కడి జర్మన్ రాయబార కార్యాలయం వారు వాళ్ళిద్దరినీ బెర్లిన్‌కు తీసుకుపోవాలని తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని నాకిక్కడ తెలిసింది. వాళ్ళు ఎక్కడ దాగున్నారో కనిపెట్టి నాకు ముందు సోమవారం తెలియ చెయ్యండి" అన్నాడాయన.

"అయితే, అల్లానవాజ్ మీకు పారిపోయిన ఇద్దరి భారతీయుల పేర్లనుకూడా చెప్పివుండాలే?" అనిఅడిగాను.

"అవును: చెప్పాడు. వారిపేర్లను నోట్ బుక్‌లో వ్రాసుకున్నాను గాని దానిని తేవడం మరచిపోయాను. వారిలో ఒకని పేరు చంద్రబోస్ అని జ్ఞాపకం" అని ఆయన అన్నాడు.

"సుభాస్ చంద్రబోసా?" అని అన్నాను.

## అ స ం భ వ ం

"అవు నవును. అదే" అన్నాడు.

అంతతో వూరుకోక నేను ఇంకా యిలా అన్నాను—"ఆయన భారత నాయకులలో అగ్రగణ్యుడు. ఆయనది బెంగాల్‌దేశం. సుమారు రెండునెలల క్రిందట విచిత్రంగా ఇంటినుంచి పారిపోయాడు. కాని, ఎక్కడో ఏదో పొరపాటు జరిగివుంటుందని నా నమ్మకం. ఆయన బెంగాల్‌నుంచి పారిపోయి, ఈదేశం భాష తెలియకుండా ఇక్కడకు వచ్చివుండడం ఎలా సంభవం? మీతో టెలిఫోనులో మాట్లాడిన వ్యక్తి త్రాగి మాట్లాడివుండాలి."

బషీ యిలా అన్నాడు—"నాకదంతా తెలియదు. ఆఫ్ఘన్ రాయబారి ఏమని చెప్పాడో మీకు చెప్పాను. ఈ సమాచారం సంపాదించి చెప్పారంటే మీకు కృతజ్ఞుడనై వుంటాను."

నేను అతనితో యిలా అన్నాను—"కాని, నాకు ఈ సంగతి సమ్మబుద్ధిగాలేదు. పారిపోయి వచ్చినవాళ్లు ఎవరి యింట్లో వుంటున్నారో మీరు ఎవరిపేరూ చెప్పలేదు. అతను ఆఫ్ఘన్ దేశస్థుడా, లేక పరాయిదేశస్థుడా? ఇంత సమాచారం అంతదూరంలోవున్న అల్లా నవాజ్‌ఖాన్‌కు తెలిసినప్పుడు, ఆ హిందువు పేరుకూడా ఆయన మీకు చెప్పివుండాలే?"


"అతని పేరు అయన చెప్పలేదు. కాని, అది తెలుసుకోవడం పెద్ద కష్టంకాదు" అన్నాడాయన.

"నేను ఈ దేశం వాణికాదని మీకు బాగా తెలుసు. నేను ప్రొద్దున దుకాణానికి పోతాను. సాయంత్రం ఇల్లు చేరుకుంటాను. నా వ్యాపారం తప్ప నాకు ఇక్కడ మరి దేని మీదా దృష్టిలేదు. అందుచేత, ఆ యిద్దరు వ్యక్తులు ఎవరియింటిలో దాగివున్నారో ఎలాగ తెలుసుకొనడం. పైగా, ఈ పని రాజకీయ సంబంధమైనది. నాకు రాజకీయాలంటే ఎప్పుడూ పడదు. అందుచేత కాబూలు వాడి కెవడికైనా ఈ పని చెప్పారంటే బాగుం టుంది. అతను మీకు సమాచారం సంపాదించగలదేమో: కాని, మీరు నాకు మాత్రం ఒకచిన్న ఉపకారం చేసిపెట్టండి. మీరు సుభాస్ చంద్రబోసు ఎక్కడున్నాడో తెలుసుకో గలిగితే, నాకు ఆయన దర్శనం చేయించి పెట్టండి. ఆ యన్ని చూడాలని వుంది" అన్నాను.

నేను ఈపని చెయ్యలేకపోతే కాబూలులో ఇంకెవరి వల్లనూ ఇది కాదని బషీ సాహెబ్ మళ్ళీ అన్నాడు. అధమం, ఈ పని చెయ్యగలవారు ఇంకెవ్వరూ తనకు తెలియ దన్నాడు. ఈ సంభాషణలో బహీ సాహెబ్ అసలు వుద్దేశ్యమేమిటో గ్రహించాను. అల్లా నవాజ్‌ఖాన్ ఆలితో మాట్లాడా నంటూ చెప్పినదంతా బహీసాహెబ్ అల్లి వుంటాడు. నవాజ్ ఖాన్‌వంటి రాయబారి ఫోన్‌లో మాట్లాడడానికి ఇతనొక్కడేనా సి. ఐ. డి, పైగా, బెర్లిన్ విదేశాంగ కార్యాలయం సుభాస్‌బోసు కాబూలులో వున్నట్టు రహస్యాన్ని బట్ట బయలు చేసేటంతటి తెలివి తక్కువదికాదు. అందుచేత, బషీ సాహెబ్‌ను ఈ అన్వేషణకు నియోగించినవారు మ రొకరు ఎవరో అయివుండాలి.

బషీ సాహెబ్‌తో "నావల్లకాదు" అని చెప్పివేసి దుకాణానికి వెళ్ళిపోయాను. బోసుబాబు కాబూలులోవున్న సంగతి ఇండియా ప్రభు త్వానికి ఆయన వెళ్ళిపోయిన తరువాతనేగదా తెలియవచ్చింది, అని చాలా సంతోషించాను. మరునాడు బషీసాహెబ్ మళ్ళీ నాకు బజారులో కనిపిం చాడు. సుభాస్ బాబుతోకూడా వచ్చిన వ్యక్తి పేరుకూడా చెప్పాడు.

ఇండియా ప్రభుత్వానికి అతనిపేరు తెలిసివుండదని నేను నమ్మి



ఉత్తమచంద్

వుండేవాణ్ని. కాని, ఇతను ఆ పేరు చెప్పడంతో నా ముఖం వివర్ణమై పోయింది. వెంటనే నేను తెప్పరిల్లి యిలా అన్నాను—"సరే, నేను వారెక్కడున్నదీ తెలుసుకోడానికి ప్రయత్నిస్తాను. నాకు తెలిసినట్లయితే, మీకు ఏసంగతి చెబుతాను. ఈలోగా మీరొక పని చెయ్యాలి. మీరు మళ్ళీ టెలిఫోన్‌లో అల్లానవాజ్‌ఖాన్‌తో మాట్లాడితే, వాళ్ళిద్దరూ ఏ హిందువుని యింటిలో వుంటున్నారో పేరు అడగండి." ఆ తరువాత యిద్దరం విడిపోయాము.

## అనుమానాలు

నాకు అనుమానాలు పట్టుకున్నాయి. రహస్యం బయటపెట్టివేసిన వారు జర్మన్ విదేశాంగ కార్యాలయంవారా? అని ఒక అనుమానం. ఇదే నిజమైతే బోసుబాబు నాతోనే వున్నట్టు నాపేమ తెలుసుకొని వుండడం కూడా కష్టమైన పనికాదు. బహుశా ఇండియన్ సి. ఐ. డి. రహమత్ ఖాన్ పేరును ఊహించి వుండవచ్చు. ఎందుకంటే, బోసుబాబు పారిపోయిన తరువాత, ఆయనకు రక్షణ యిచ్చివుంటారనుకున్న వారియిళ్లను ఇండియాలో సోదా చేసివుండాలి. అప్పుడు రహమత్‌ఖాన్ (భగత్‌రామ్)

కనిపించి వుండకపోగా, అతనుకూడా బోసుబాబుతో పారిపోయినట్టు ఊహించివుంటారు.

కొద్దిరోజుల తరువాత సీనోరా కరోనీ మా దుకాణానికి వచ్చింది. ఆమె తనతోకూడా ఒక జర్మన్ వ్యక్తిని తీసికొనివచ్చి నాకు పరిచయం చేసింది. అతను ఈ మధ్యనే జర్మనీనుండి కాబూలు వచ్చాడు. జర్మన్ విదేశాంగ కార్యాలయం బోసుబాబు కాబూలులో వుండిన రహస్యాన్ని బయటపెట్టి వేసిందనీ, అల్లానవాజ్‌ఖాన్ సమాచారాన్నంతమూ ఫోనులో బహీసాహెబ్‌కు తెలియ పరచాడనీ అతనితో అన్నాను.

అతను నవ్వి యిలా అన్నాడు—"మా విదేశాంగ కార్యాలయం నుంచి ఏరహస్యమూ బయటికిరాదు. అందులోనూ, ఆఫ్ఘన్‌రాయబారికి ఈ రహస్యం తెలిసేది?—అసంభవం."

పెషావరు సి. ఐ. డీలు రహమత్‌ఖాన్ కోసం వెతికి వుంటారనీ, అతను కనిపించకపోగా బోసుబాబుతో పారిపోయి వుంటాడని అనుకొని వుండవచ్చుననీ సీనోరా కరోనీకూడా అనుమానించింది. "నేనూ అదే అనుకుంటున్నాను. కాని, ఈ చవటలు సరిగా నాదగ్గరకే వచ్చి సమాచారం సంగ్రహించ మంటున్నారు. వాళ్ళ తెలివిచూడండి?"అని నేను అనగా, వాళ్ళిద్దరూ నవ్వుకున్నారు.

## బోస్ బాబునుంచి ఉత్తరం

కాబూలు నుంచి బోసుబాబు వెళ్ళిపోయిన మూడు నెలల తరువాత హాజీ భార్యకు బోసుబాబు నుంచి జర్మన్ భాషలో ఉత్తరం వచ్చింది. అది, ఆమె చెల్లెల్ని గురించి, వెయిస్ట్‌కోటు అందినందుకు తెల్పిన కృతజ్ఞత గురించిన్నీ. అందులో బోసుబాబు నన్నుగురించికూడా రెండువాక్యాలు వ్రాశాడు. అవి యివి—"ఉత్తమచంద్! నమస్తే మీరు జేసిన సహాయానికి నేను కృతజ్ఞుణ్ణి. నా జీవితంలో మీ సహాయం మరచిపోను.

ఇట్లు,
జియావుద్దీన్."

సమాప్తము

# సోవియట్ రష్యా

సంస్కృతి ప్రచురణ—4]                    [వెల 0-12-0.

రచన: జవహర్‌లాల్ నెహ్రూ

అనువాదం: పండితారాధ్యుల నాగేశ్వరరావు

"ఇందలి గ్రంథం బహుపురాతనం. పండిత జవహర్ లాల్ నెహ్రూ ప్రప్రథమ రచనలలో ఇది మొదటిది.

"అయినప్పటికీ నేటికీ పాతబడని 'లెనిన్—స్త్రీలు—వివాహం—విద్య—కారాగృహం' వంటి అధ్యాయాలున్నవి గనుక ఇదివరకు ఈ పుస్తకం చదవనివారు, ఇప్పుడు దీనిని చదివి లాభం పొందగలరని మా విశ్వాసం.

"సోషలిస్టు ఉద్యమంలో పాల్గొనే నవ యువకులందరూ 'లెనిన్' అన్న అధ్యాయాన్ని చక్కగా పఠించిన పక్షంలో, ఉద్యమంలో తమ్ము ఎదుర్కొనే అనేక క్లిష్ట ప్రశ్నలకు సమాధానాలు లభ్యం కాగలవు.

"రష్యాచరిత్రను అప్పటికీ, ఇప్పటికీ పోల్చుకోగలగడానికి ఈ గ్రంథం ఉపకరిస్తుందని పీఠికలో అన్నారు. అందుకు ఈ పుస్తకం ఎంతమాత్రం సహాయపడుతుందో చెప్పలేము. కాని పండిట్ నెహ్రూ అప్పటి భావాలను, ఇప్పటి ఆయన భావాలను పోల్చుకొని పరిచయం చేసుకోడానికి ఇది తప్పక సరిపోతుంది.

"మొత్తాన పాతపుస్తకమైనా, ఇది పదుగురికి ఉపకరించే పుస్తకమే. నెహ్రూ రచనలు ఎప్పటివైనా అతి హృదయంగమంగా ఉంటవిగదా!"

—ఆంధ్రప్రభ (17-5-1943.)

# వాత్స్యాయన కామసూత్రములు

[బ్రహ్మశ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు విశేష కృషిచేసి ప్రచురించిన మహత్తర గ్రంథమిదియే.]

ఇది 728 పేజీల ఉద్గ్రంథం. మూలశ్లోకములలోని ప్రతిపదము సామాన్యులకుగూడ అర్థమయ్యేలా ప్రతిపదార్థము, తాత్పర్యము, తెనుగు వ్యాఖ్య, వీలైనచోట్ల ఆంధ్ర రతిరహస్యగ్రంథములనుండి శ్లోకమున కనువైన పద్యములు చేర్చి ప్రచురింపబడిన ఉత్తమగ్రంథరాజము. ప్రతి ఆంధ్రుడు, ముఖ్యముగా వివాహితుడు తప్పక చదువవలసిన గ్రంథము.

అసలు ధర రూ. 20/- మావద్దనున్న పాతకాపీలు రూ. 10/-
(కాలికో బైండు)

కల్చరల్ బుక్స్ లిమిటెడ్
పెరంబూరు పోస్టు :: మద్రాసు.

## కావాలి

ఆంగ్లము, హిందీ, ఉర్దూ వంగభాషల నుండి తెనుగులోనికి తర్జుమా చేయగలవారు కావాలి,

వివరాలకు : కల్చరల్ బుక్స్ లిమిటెడ్
పెరంబూరు పోస్టు : : మద్రాసు.

# సంస్కృతి ప్రచురణలు

## త్వరలో వెలువడనున్నవి.

1. ప్రపంచ చరిత్ర

   రచన: జవహర్‌లాల్ నెహ్రూ.

   (నాలుగు భాగములు)

2. నా జీవితము (My Early life)

   రచన: మోహన్‌దాస్ కరంచంద్ గాంధి.

   ఆంగ్ల అనుసరణ, స్పష్టీకరణ: మహాదేవ్ దేశాయ్.

   ఆంధ్రీకరణము: పోలవరపు శ్రీరాములు.

3. 1942 విప్లవం

4. రష్యానుంచి ఉత్తరాలు

   రచన: రవీంద్రనాథ్ ఠాగూర్.

   ఆంధ్రీకరణము: విద్వాన్ విశ్వం.

5. భారత దేశం

   రచన: రోమైన్ రోలండ్ (ఫరాసు భాషలో)

   ఆంగ్లానువాదం: షెల్వంకర్

6. దీనబంధు ఆండ్రూస్ జీవితం

---

వివరాలకు:—

CULTURAL BOOKS LIMITED

PERAMBUR P. O : : MADRAS.

# మా ఏజన్సీ షరతులు

1. ప్రతి ఆర్డరుకు కమీషను పోగా రూ. 25-0-0 కు తగ్గకుండా మా ప్రచురణలను తెప్పించుకొనువారు మా ఏజంట్లు. మా ఏజంట్లు డిపాజిట్ రూ 10-0-0 కట్టవలెను. ఒక సంవత్సరం పూర్తిగానిది డిపాజిట్ వాపసు యివ్వము.

2. ఏ ఒకనగరంలోగాని మాసోల్ ఏజన్సీ కావాలంటే రూ. 100-0-0 మావద్ద డిపాజిట్ కట్టివుంచాలి. డిపాజిట్ కట్టిన రెండేళ్ళు వెళ్ళనిది డిపాజిట్ వాపసు యివ్వము. మాసోల్ ఏజంట్లు మా ప్రచురణలను ప్రతిరకం ప్రచురింపబడగానే 100 కాపీలు కొనాలి. మా పేరుగల ఎనామల్ బోర్డులు వారిదుకాణంలో ప్రజకు తెలిసేట్టు తగిలించాలి.

3. మా ఏజంట్లందరికీ 25% కమీషను యివ్వగలము.

4. తపాలా, పాకింగు ఖర్చులు మేమే భరింతుము. పార్సెలు ఖర్చులు ఏజంట్లే భరించవలెను.

5. కమీషను పోగా కనీసము రూ. 100/- కు ఒక్కమారు మా ప్రచురణల తెప్పించుకొన్నవారికి 33⅓% కమీషను యివ్వగలము. కాని ఏ ఒక్కరకానికి 20 కాపీలకు పైన పంపము.

6. మా ఏజంట్లకు మా ప్రచురణలు వెలువడే ముందు తెలియజేయుదుము. మా కేటలాగులో వారిపేరు ప్రకటింతుము.

7. అప్పు లివ్వము. చెక్కులు పంపేవారు క్రాస్ చెక్కులు పంపాలి. మద్రాసు బాంకులలో మార్చను అయ్యే కమీషను ఏజంట్లే భరించాలి.

8. R. R. లు బాంకులద్వారా పంప వీలుగాదు.

9. మా ఏజంట్లు కాని వారికిగూడ ఒక్కమారు కమీషనుపోగా కనీసం రూ. 10-0-0 లకు ఆర్డరిచ్చిన 20% కమీషను యివ్వగలము. అట్టివారు ముందుగా డబ్బు పంపవలెను. ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ 'కల్చరల్‌బుక్స్ లిమిటెడ్' అన్న పేరుతోనే జరపాలి. చెక్కులుగూడా ఆ పేరుకే పంపాలి.

# ప్రపంచ చరిత్ర

*

## (Glimpses of World History)

## జవహర్‌లాల్ నెహ్రూ రచన

ఈ గ్రంథ రాజమును ఆంధ్రీకరించి నాలుగు భాగములుగా, మూడు నెలల కొక భాగము చొప్పున, ప్రచురింప నున్నాము. ఒక్కొక్క భాగమునకు సుమారు 400 పుటలుండును. భాగము ఒకటికి వెల రూ 4-0-0. మొదటి భాగము జవహర్‌లాల్ నెహ్రూగారి జన్మదినోత్సవము నాడు (14-11-1946) వెలువరించ వలెనని ప్రయత్నము. 1-8-46 లోపున తమ విలాసములను విపులముగా వ్రాయుచు రూ. 4-0-0 మణియార్డరు ద్వారా డిపాజిట్ పంపవలెను. అట్టి వారికి మొదటి మూడు భాగములు తపాలాఖర్చులు మేమే భరించి రూ. 4-0-0 లకు వి. పి. కి పంపగలము. నాల్గవ భాగమును రిజిస్టరు పోస్టుద్వారా అందజేయగలము.

గ్రంథ విక్రేతలకు 20% కమీషను. మా ఏజంట్లకు 25% కమీషను యివ్వబడును. కలయువారు వెంటనే యీ క్రింది విలాసమునకు వ్రాయనగును.

CULTURAL BOOKS LIMITED

PERAMBUR P. O : : MADRAS.